తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 14.06.2026 | సంపుటి : 12 సంచిక : 325 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# హైదరాబాద్‌లో జోరువాన

## నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం
## చెరువులా శంషాబాద్ ప్రధాన రహదారి



**భారీగా వర్షపు నీరు చేరడంలో ప్రజల ఇక్కట్లు**

**పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బందులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శంషాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నగరంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. రాందేవ్ గూడా, మణికొండ, నార్సింగి, లంగర్ హౌస్, హైదర్‌గూడా, అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం ప్రాంతాలను ముంచెత్తింది. మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీ షరీఫ్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్పేట్, యూసుఫ్ గూడా, మిగతా 2లో..

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో హైఅలర్ట్‌గా ఉండాలన్నారు. పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సీఎస్, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్‌లతో సమీక్షించి నగరవాసులకు మిగతా 2లో..

## అయోధ్య రాముని ఆలయంలో
# భారీ స్కామ్..!

### భక్తులు అందించిన విరాళాలు కైంకర్యం

- సిట్, సీబీఐ విచారణకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ డిమాండ్
- రామ మందిర ట్రస్ట్ నుంచి నివేదిక కోరిన ప్రధానమంత్రి కార్యాలయం
- దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న వివాదం



**అయోధ్య, జూన్ 13 (జనంసాక్షి) :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల నిధుల నుంచి దాదాపు రూ. 7 కోట్ల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు పెద్ద వివాదంగా మారాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం అయోధ్యలోని రుడౌలి ప్రాంతంలో ఒక ఆలయ ఉద్యోగి నివాసం నుంచి పోలీసులు రూ. 10 లక్షల నుంచి 12 లక్షల మధ్య నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వయంగా ట్రస్ట్ అభ్యర్థన చేయడంతో యోగి ప్రభుత్వం శనివారం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఏడు రోజుల్లోగా ప్రాథమిక నివేదికను, 15 రోజుల్లోగా తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సిన బాధ్యతను ఈ బృందానికి అప్పగించారు. ఈ కమిటీలో లక్నో డివిజనల్ కమిషనర్ (ఐఏఎస్) విజయ్ విశ్వాస్ పంత్, మిగతా 2లో..

రాముని నామంపై నమ్మకంతో కోట్లాది భక్తులు చెల్లించిన విరాళాలు, సమర్పించిన కానుకలు దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా పెనుతుఫాను సృష్టిస్తున్నాయి. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ స్వయంగా రంగంలోకి దిగింది. నిజానిజాలు తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు నేరుగా విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.



## తదుపరి ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

**కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ మిగతా 2లో..

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం

**హైదరాబాద్(జనంసాక్షి):** భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, ఢిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో మిగతా 2లో..



## సింగరేణిలో అవకతవకలపై విచారణ జరిపించండి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. "సింగరేణి నుంచి దాదాపు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు మిగతా 9లో..

# గగనంలో ఘోర విషాదం



### వాయుసేన విమానం కూలి ఐదుగురు అధికారుల మృతి

- అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో దుర్ఘటన
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి..
- ప్రమాదంపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశం



**గహౌతి(జనంసాక్షి):** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ (వాయు)కు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్ ఆలమ్‌గా గుర్తించారు. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. మిగతా 2లో..

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సింగరేణి
# గుండెకాయ లాంటిది

### కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు
- 335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి
- ఉద్యోగాలు సాధించిన యువత
- క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపు



**మంచిర్యాల(జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఇవాళ కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. మిగతా 2లో..

# కాంగ్రెస్ పార్టీలో కోవర్టులున్నారు

- ఈ విషయమై సీఎం స్వయంగా రంగంలోకి పర్యవేక్షిస్తున్నారు
- ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందో ఆరా తీస్తున్నాం
- త్వరలోనే వారి ఆటకట్టిస్తాం • బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి
- కేసులేమీ లేకున్నా నామినేషన్ తిరస్కరించారు : మహేశ్ కుమార్ గౌడ్




**హైదరాబాద్(జనంసాక్షి):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేగుతోంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శనివారం మరోసారి అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలోనే ఉంటూ నష్టం చేకూరుస్తున్న వారిపై ఆయన ఘాటుగా స్పందించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారాన్ని పార్టీ అధిష్టానంతో పాటు రాష్ట్ర నాయకత్వం కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. మిగతా 2లో..

## 'నీట్' లీకేజీపై కాంగ్రెస్
# పోరుబాట

### 17 నుంచి రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అవకతవకలపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి తొలి దశలో జాతీయ స్థాయి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. అందులో భాగంగా ఈ నెల 17నుంచి జులై 14 వరకు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విద్యార్థుల సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వంలో ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు నెలల పాటు ఈ ప్రచారం కొనసాగుతుందని, ప్రధాని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు. జూన్ 17 నుంచి రాజస్థాన్‌లోని కోటా తొలి విద్యార్థి సదస్సు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మిగతా 2లో..



## శాంతి ఒప్పందంపై
# నీలినీడలు

- ఆదివారమే శాంతి ఒప్పందం జరుగుతుంది
- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన
- లేదు ఇకొంత సమయం పడుతుందన్న ఇరాన్

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** అమెరికా-ఇరాన్ మధ్య ఈ ఆదివారం (జూన్ 14న) శాంతి ఒప్పందం జరగే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఆ వెంటనే ఎలక్ట్రానిక్ సంతకాలు, సాంకేతిక స్థాయి చర్చలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా 9లో..

## ఆదివారమే ఒప్పందం

**సంతకాలు జరిగిన వెంటనే హర్మూజ్ తెరుచుకుంటుంది:ట్రంప్** 9లో..

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కార్యకర్తలు ఉద్యమించాలి

**నా మీద ఉన్న కోపం నేతన్నల మీద చూపించొద్దు: కేటీఆర్**



**సిరిసిల్ల(జనంసాక్షి):** తన మీద ఉన్న కోపం సిరిసిల్ల నేతన్నల మీద చూపించొద్దని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నో పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. స్థానిక నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు రద్దు చేసిందన్నారు. సిరిసిల్లలో ఉన్నవి చిన్న కుటీర పరిశ్రమలని చెప్పారు. "రైతుల ధాన్యం కొనేందుకు రాష్ట్రంలో కనీసం గన్నీ సంచులు లేవు. మిగతా 9లో..

## గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్‌ఫోర్స్ చాలా కీలకం

**హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రాజ్‌నాథ్‌సింగ్** 2లో..

## కాంగ్రెస్ పార్టీలో కోవర్టులున్నారు

దీని వెనుక అసలేం జరిగిందనే కోణంలో ఇప్పటికే అంతర్గత విచారణ ముమ్మరంగా సాగుతోందని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగారని, ఎక్కడ పొరపాటు జరిగింది, ఎవరి ప్రమేయం ఉందనే విషయాలపై ఆయనే స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

**కోవర్టులు, లీకుల వీరుల ఆట కట్టిస్తాం..**

పార్టీ అంతర్గత సమాచారాన్ని, వ్యూహాలను బయటకు చేరవేస్తున్న వారిపై టీపీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ప్రతిపక్షాలకు లబ్ధి చేకూరుస్తున్న కోవర్టులు ఎవరో గుర్తించే పనిలో నాయకత్వం నిమగ్నమైందని ఆయన పేర్కొన్నారు. "ఈ వ్యవహారంలో లీకుల వీరులు ఎవరో.. గ్రీకు వీరులు ఎవరో త్వరలోనే అందరికీ బయటపడుతుంది" అంటూ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. నామినేషన్ తిరస్కరణకు కారణమైన బాధ్యులపై, పార్టీకి నమ్మకద్రోహం చేసిన కోవర్టులపై అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోందని ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. త్వరలోనే ఈ లీకుల వెనుక ఉన్న అసలు సూత్రధారుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సింగరేణి గుండెకాయ లాంటిది



ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### భారతీయులున్న మరో నౌకపై దాడి వార్తలు..

## అవాస్తవం..

### ప్రచారాలపై క్లారిటీ ఇచ్చిన భారత్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఒమన్ తీరంలో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి జరిగిందంటూ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. దీనిపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. దాడి వార్తలు అవాస్తవమని పేర్కొంది. భారత సిబ్బందితో ఉన్న నౌక ఒమన్ తీరం వెంబడి ప్రయాణిస్తోంది. నౌక నుంచి ఒక్కసారిగా స్పందన ఆగిపోవడంతో.. దానిపై అమెరికా దాడి చేసిందంటూ వివిధ ప్రసార మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ నావికులు మరణించారంటూ ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్దఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే విదేశాంగశాఖ స్పందించింది. ఆ నౌకలోని మాస్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొంది. నౌకపై ఎలాంటి దాడి జరగలేదని ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తల ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా.. ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మూడు నౌకలను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకొంది. ఈ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. భారత్ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ చర్యలను ఆపేయాలంటూ అమెరికా వద్ద నిరసన వ్యక్తం చేసింది. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించిందని అమెరికా దళాలు ఆరోపించాయి. ఈ క్రమంలో ఆ డ్రోన్‌లను కూల్చివేసినట్లు పేర్కొన్నాయి. జలసంధిలో ఎలాంటి అంతరాయం లేకుండా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఓ పోస్టులో పేర్కొంది. హర్మూజ్‌లో ఇరానియన్ పోర్టులపై దిగ్బంధనం కొనసాగుతోందని.. నిబంధనలు సరిగ్గా ఉన్న 139 వాణిజ్య నౌకలను దారి మళ్లించామని తెలిపింది. నిబంధనలు పాటించని మరో తొమ్మిది నౌకలను నిలిపివేసినట్లు వెల్లడించింది.

## హైదరాబాద్‌లో జోరు వాన



సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్ మూసాపేట్ పరిసరాల ప్రాంతాల్లో వాన జోరుగా పడింది.నగరంలోని ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, కవాడీగూడ, బోలక్‌పూర్, గాంధీనగర్, అంబర్‌పేట, బర్కత్‌పురా, కాచిగూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడలో వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, మూసాపేట, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీవాన పడింది.పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. శంషాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరి చెరువుగా మారింది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై నీరు ఉండంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు నీటిలోనే ప్రయాణించాయి. పలు షాపులు, సెల్లార్లలోకి వరద నీరు చేరడంతో వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. షాపు యజమానులు నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు చేశారు.సమాచారం అందుకున్న శంషాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ ఘటనాస్థలానికి చేరుకుంది. మోటార్ల సహాయంతో దాదాపు మూడు గంటలు శ్రమించి వర్షపు నీటిన తొలగించింది. రోడ్లపై నిలిచిన నీటిని, షాపుల్లోకి చేరకుండా జాగ్రత్తలు వహించింది. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. షాద్‌నగర్‌లో భారీ వర్షానికి జాతీయ రహదారిపై భారీగా నీరు నిలిచింది. బెంగళూరు – హైదరాబాద్ హైవేపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.భారీ వర్షాల దృష్ట్యా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో హైఅలర్ట్‌గా ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని సూచించారు.నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సీ.వీ.ఆనంద్ పర్యటించారు. మల్కంపేట చెరువు, టోలిచౌకీ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. సైబరాబా ద్ సీపీ రమేశ్‌తో కలిసి ట్రాఫిక్ పరిస్థితులపై సమీక్ష జరిపారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో తొలగింపు చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా ఉండాలని సూచించారు. కీలక జంక్షన్లలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల్లోనూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు.రాజధాని నగరంలో వర్షం కారణంగా అవస్థలు పడుతూ ఉంటే మరోవైపు పల్లె ప్రాంతాల్లో ఆహ్లాద వాతావరణం నెలకొంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో తీసి వాగు పొంగిపొర్లుతుంది. ఎగువ కురిసిన వర్షానికి దేవరంపల్లిలోని ఈసీ వాగు పారుతుంది. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షం కురవడంతో శనివారం రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. తొలకరి వర్షం కురవడంతో పంటల సాగుకు సిద్ధమయ్యారు. రైతులు విత్తనాలు నాటడం ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో అతి తక్కువ వర్షం కురవడంతో రైతులు వాన కోసం ఎదురుచూస్తున్నారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని తెలిపారు.హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ వద్ద బెంగళూరు హైవేపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది.. మోటార్ల





ద్వారా నీటిని తొలగిస్తున్నారు. షాద్‌నగర్‌లోనూ జాతీయ రహదారిపై భారీగా వరద నిలిచింది. పోలీసులు హైఅలర్ట్‌లో ఉండాలి: డీజీపీ హైదరాబాద్‌లోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. మల్కంపేట చెరువు, టోలిచౌకీల్లో పరిస్థితిని పరిశీలించారు. సైబరాబాద్ సీపీ రమేశ్‌తో కలిసి నీటమునిగిన ప్రాంతాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. కీలక జంక్షన్లలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలన్నారు. హైదరాబాద్‌తో పాటు వర్ష ప్రభావిత జిల్లాల పోలీసు అధికారులు హైఅలర్ట్‌లో ఉండాలని ఆదేశించారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం

ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

## మన రక్షణ వ్యవస్థ మరింత శత్రుదుర్భేద్యం

### బాలిస్టిక్ క్షిపణి దాడులకు చెక్.. డీఆర్డీఓ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రక్షణలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. శత్రుదేశాల నుంచి ఎదురయ్యే విభిన్న ముప్పులను ఎదుర్కొనేలా మన రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకుంది. బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, యాంటీ షిప్ వార్‌ఫేర్‌లో కొత్త టెక్నాలజీని డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. దీంతో దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల దాడులను తిప్పికొట్టే సామర్థ్యం భారత్‌కు లభించినట్లయ్యింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో వెల్లడిస్తూ.. ప్రయోగానికి సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. దీర్ఘశ్రేణి ఖండాంతర క్షిపణుల ఆట కట్టించే మల్టీలేయర్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థను డీఆర్డీవో ఇటీవల విజయవంతంగా పరీక్షించింది. జూన్ 10, 11 తేదీల్లో వరుసగా మూడు ఫ్లైట్ టెస్ట్‌లు నిర్వహించింది. ఇందులో ఇంటర్‌సెప్టర్లు విజయవంతంగా తమ లక్ష్యాలను ఛేదించి.. బీఎండీ సామర్థ్యాన్ని నిరూపించాయి. ఖండాంతర క్షిపణి ముప్పును ఎదుర్కొనేలా అధునాతన సాంకేతికతతో ఈ డిఫెన్స్ వ్యవస్థను డీఆర్డీవో రూపొందించింది.దీంతో బీఎండీ సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో భారత్ చేరినట్లయ్యిందని డీఆర్డీవో వెల్లడించింది. ఇక నావెల్ యాంటీ-షిప్ మిసైల్ మీడియం రేంజ్ తొలి పరీక్షను కూడా శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.



## గగనంలో ఘోర విషాదం

ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్. ఈ సైనిక రవాణా విమానాన్ని తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## అయోధ్య రాముని ఆలయంలో భారీ స్కామ్..!

ఐజీ రేంజ్ (ఐపీఎస్) కిరణ్ ఎస్, ప్రత్యేక కార్యదర్శి (ఆర్థిక) నీల్ రతన్ ఉన్నారు.

**ముదిరిన వివాదం..**

జూన్ 9న బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీష్ సింగ్, సీబీఐ విచారణ కోరుతూ ప్రధానమంత్రికి లేఖ రాయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. మరుసటి రోజు, ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఈ విషయంపై ఆలయ ట్రస్ట్ నుంచి సమగ్ర నివేదికను కోరింది. ఈలోగా, కానుకల దుర్వినియోగం ఆరోపణలపై సీబీఐ విచారణ కోరుతూ శుక్రవారం అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌లో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్) దాఖలైంది. స్థానిక న్యాయవాది మోహిత్ అశోక్ దాఖలు చేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. కానుకలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ చేత ఆడిట్ చేయించాలని కూడా ఈ పిటిషన్‌లో డిమాండ్ చేశారు. విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఖాతాలపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని కోరారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఆలయ మాజీ అకౌంట్స్-ఇన్-ఛార్జ్‌నని చెప్పుకుంటున్న మాజీ అకౌంటెంట్ మహిపాల్ సింగ్, కానుకల దొంగతనం సర్వసాధారణంగా జరిగేదని ఆరోపించారు.

**సీసీ టీవీ పుటేజీని కూడా తొలగించారు..**

ట్రస్ట్ ఖాతాల వ్యవహారాలతో సంబంధం ఉన్న మహిపాల్ సింగ్ విరాళాల విషయంలో చాలాకాలంగా అవకతవకలు జరుగుతున్నాయని బాహాటంగా ఆరోపించారు. తాను ఫిర్యాదు చేసినందుకే తనను విధుల నుండి తప్పించారని వెల్లడించారు. తాను ఒక దొంగతనం ఆరోపణపై చంపత్ రాయ్, గోపాల్ అనే ట్రస్ట్ సభ్యుడికి ఫిర్యాదు చేసిన మరుసటి రోజే తనను పదవి నుంచి తొలగించారని మహిపాల్ ఆరోపించారు. ఎనిమిది నెలల క్రితం నాటి ఆలయ సీసీటీవీ ఫుటేజీని కూడా తొలగించారని ఆయన ఆరోపించారు. తన ఆడిటింగ్ అనుభవం కారణంగా ఆర్ఎస్ఎస్ తనను కోటా నుంచి తీసుకువచ్చిందని, రామ మందిర సమర్పణ నిధి ప్రచార సమయంలో తాను సుమారు 50 మంది డిపాజిటర్లను పర్యవేక్షించానని మహిపాల్ తెలిపారు.

**ట్రస్టే.. విచారణకు డిమాండ్**

భారతదేశంలో, విదేశాలలో ఉన్న లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కాబట్టి, పారదర్శకమైన, నిష్పక్షపాతమైన విచారణ అత్యవసరం అని ట్రస్ట్ పేర్కొంది. విరాళాల డబ్బు దొంగతనం జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న తప్పుదోవ పట్టించే వదంతులు, ఊహాగానాలకు స్వతంత్ర విచారణ ముగింపు పలకడానికి సహాయపడు తుందని ట్రస్ట్ తెలిపింది. విలువైన సొమ్ము దొంగతనం జరిగిందంటూ వస్తున్న నివేదికలు, వదంతుల దృష్ట్యా ట్రస్ట్ ఈ విచారణ కోరిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. కోట్లాది సామాన్య భక్తులు ఒక్కో రూపాయిని రాముని పేరిట నమ్మకంతో ఇచ్చారు. ఆ నమ్మకానికి జవాబు చెప్పాల్సిన బాధ్యత ట్రస్ట్‌పై ఉంది. నిష్పక్షపాతమైన విచారణ జరిగి, దోషులకు శిక్ష పడినప్పుడే భక్తుల విశ్వాసం కాపాడబడుతుంది.

**ఎలాంటి రికార్డూ లేదట..!!**

జూన్ 7న, రామ మందిర విరాళాల నుంచి దాదాపు 7.5 కోట్లు దుర్వినియోగం అయ్యాయని మాజీ మంత్రి పవన్ పాండే ఆరోపించారు. అనంతరం అఖిలేష్ యాదవ్ ఈ విషయంపై న్యాయ సమీక్ష జరపాలని పిలుపునిచ్చారు. అలాంటి వ్యత్యాసాలేవీ కనుగొనబడలేదని చెబుతూ రామ మందిర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఆ ఆరోపణలను తోసిపుచ్చారు. 2021 నుంచి దొంగతనాలు జరుగుతున్నాయని మాజీ అకౌంట్స్ ఇన్‌చార్జ్ మహిపాల్ సింగ్ ఆరోపించడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. బంగారం, వెండి విరాళాలకు సంబంధించి ఎలాంటి రాతపూర్వక రికార్డు లేదని, విలువైన లోహాల కానుకల ఫోటోలను కేవలం జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్‌కి మాత్రమే పంపారని ఆయన పేర్కొన్నారు. సింగ్ ప్రకారం, అటువంటి విరాళాలు చివరికి ఎక్కడ నిల్వ చేయబడ్డాయో రాయ్‌కి, అతని డ్రైవర్ రామ్‌శంకర్ యాదవ్‌కి (టిన్ను అని కూడా పిలుస్తారు) మాత్రమే తెలుసు. బ్యాంకుల్లో నగదు జమ చేసే వోచర్లను తన సంతకాలు తీసుకోకుండానే ప్రాసెస్ చేశారని కూడా ఆరోపించారు. మహిపాల్ సింగ్ ఆర్ఎస్ఎస్‌తో సంబంధం కలిగి ఉన్నారు. ఆయన ఫిబ్రవరి 2021 నుండి జూలై 2022 వరకు రామ మందిరానికి అకౌంట్స్ ఇన్‌చార్జ్‌గా పనిచేయడం గమనార్హం.

## గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్‌ఫోర్స్ చాలా కీలకం

రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్ ఫోర్స్ చాలా కీలకమని పేర్కొన్నారు. యుద్ధంలో సాంకేతిక వినియోగం చాలా పెరిగిందని, సాంకేతిక వినియోగాన్ని అధికారులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌లో ఎయిర్ వారియర్స్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ ప్రస్తుత టెక్నాలజీ ప్రపంచంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు ఎయిర్ ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్ ట్రైనీలకు వింగ్స్, బ్రెవెట్స్‌ను రాజ్‌నాథ్‌సింగ్ అందజేశారు. పరేడ్‌లో సుఖోయ్, సూర్యకిరణ్, సారంగ్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలి ఎన్‌డీఏ మహిళా క్యాడెట్ల కమిషనింగ్‌కు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ వేదిక అయ్యింది. మెరిట్‌లో అగ్రస్థానంలో నిలిచిన క్యాడెట్లకు ప్రెసిడెంట్స్ ప్లాక్ అవార్డులను రక్షణమంత్రి ప్రదానం చేశారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ నేతృత్వంలో ఫ్లైపాస్ట్, ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్ ట్రైనీలకు వింగ్స్, బ్రెవెట్స్ అందజేశారు. వియత్నాం ట్రైనీలకూ శిక్షణ పూర్తి ధ్రువపత్రాల ప్రదానం చేశారు. పరేడ్ ప్రారంభంలో ఆకాష్‌గంగా, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ విన్యాసాలు ప్రదర్శించారు.హైదరాబాద్‌లోని



సీఐఎస్ఎఫ్ నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై పరేడ్?లో గౌరవ వందనం స్వీకరించారు. 39వ బ్యాచ్‌కు చెందిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 9వ బ్యాచ్‌కు చెందిన 124 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 5 మంది మహిళా అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, సేవా భావంతో విధులు నిర్వహిస్తూ దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని శిక్షణార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ స్కీం పట్ల తెలంగాణ ప్రభుత్వ నిరసన

- కేంద్రానికి లేఖ రాస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు.పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

## 'నీట్'లీకేజీపై కాంగ్రెస్ పోరుబాట

తెలిపారు. అనతరం జులై 10న అలహాబాద్, జులై 11న పట్నా, జులై 14న ఢిల్లీలో భారీ సమావేశాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువజన సంఘాలు, విద్యావేత్తలు, పరీక్షల అక్రమాల వల్ల నష్టపోయిన యువత హాజరవుతారని చెప్పారు. వారి సమస్యలను ప్రత్యక్షంగా వినడంతో పాటు, ప్రభుత్వంపై జవాబుదారీతనం కోరే వేదికగా ఈ సమావేశాలు ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు.ఈ ఉద్యమంలో భాగంగా నేషల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ ఇండియా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీలు, స్థానిక పార్టీ యూనిట్లు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించనున్నాయని కేసీ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, కోచింగ్ సెంటర్లు, పాఠశాలలు, యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. అలాగే డిజిటల్ ఆహ్వానాలు, సామాజిక మాధ్యమ ప్రచారం, ప్రత్యక్ష ప్రసారాలు, విద్యార్థులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులు, నియామక ప్రక్రియల్లో జాప్యం, పెరుగుతున్న పరీక్ష ఫీజులు లక్షలాది మంది యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని కేసీ వేణుగోపాల్



ఆరోపించారు. న్యాయమైన, పారదర్శకమైన విద్యా, నియామక వ్యవస్థను అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువత ఆకాంక్షలు అవినీతి, పరిపాలనా వైఫల్యాలు, రాజకీయ నిర్లక్ష్యానికి బలికాకూడదన్న ఉద్దేశంతో ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే భారత యువత ఎదుర్కొంటున్న సంక్షోభంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. యువత హక్కులు, అవకాశాలు, భవిష్యత్తును రక్షించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. పేపర్ లీకులు, పరీక్షల అవకతవకలు, నిరుద్యోగం, ఎన్నికల వ్యవస్థలో అవకతవకలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడమే ఈ ప్రచార ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు

**రాహుల్ గాంధీ డిమాండ్లు ఇవే**

యువత సమస్యలపై రాహుల్ గాంధీ గతంలో చేసిన డిమాండ్లను ఈ ఉద్యమం ద్వారా మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. వాటిలో ప్రధానంగా నీట్ పరీక్ష నిర్వహణను వికేంద్రీకరించడం, పరీక్ష ఫీజులను పూర్తిగా రద్దు చేయడం పేపర్ లీక్ ముఠాలపై కఠిన చట్టపరమైన చర్యలు అమలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలపై ఉన్నతస్థాయి బాధ్యత నిర్ధారణ, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా వంటి అంశాలు ఉన్నాయి.ఇటీవల నీట్-యూజీ 2026 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయ్యింది. దీంతో ఆ పరీక్షను రద్దు చేశారు. అనంతరం పరీక్షను జూన్ 21కు రీషెడ్యూల్ చేశారు. ఈ ఆరోపణలు, నిర్వహణలో లోపాల కారణంగా ఈ ఉద్యమానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ చేపట్టనున్న విద్యార్థి సదస్సులు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారే అవకాశముంది

# నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన ఓఎస్‌ఎఫ్ అకౌంటెంట్ నియామకాలు?

- జిల్లా అధికారి ఏకపక్ష నిర్ణయాలు?
- కొత్త పోస్టులు ఉన్నా... ఎమ్మెస్ అకౌంటెంట్లకే బాధ్యతలు
- నల్లగొండ జిల్లాలో అవకాశాలు కోల్పోయిన నిరుద్యోగ యువత?
- విచారణ జరిపి న్యాయం చేయాలని ప్రజల డిమాండ్




**మర్రిగూడ, జూన్ 13 (జనం సాక్షి):** గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం తెలంగాణ సెర్ప్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వన్ స్టాప్ ఫెసిలిటీ (ఓఎస్‌ఎఫ్) కేంద్రాల అకౌంటెంట్ నియామకాల వ్యవహారం నల్లగొండ జిల్లాలో వివాదాస్పదంగా మారింది. కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన చోట ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య (ఎమ్మెస్) అకౌంటెంట్లకే అదనపు బాధ్యతలు అప్పగించడం పట్ల నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సమాచారం ప్రకారం, నల్లగొండ జిల్లాలో ఓఎస్‌ఎఫ్ పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి, గుర్రంపోడు, చింతపల్లి, చండూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ మండలాల్లో కొత్తగా ఏర్పాటయ్యే ఓఎస్‌ఎఫ్ కేంద్రాలకు ప్రత్యేకంగా అకౌంటెంట్లను నియమించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తారని ఆశించినప్పటికీ, ప్రత్యేక నియామక ప్రక్రియ చేపట్టకుండా ఇప్పటికే పనిచేస్తున్న ఎమ్మెస్ అకౌంటెంట్లకే బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.దీంతో బీకాం, ఎంకాం, ఎంబీఏ (ఫైనాన్స్) వంటి అర్హతలు కలిగిన పలువురు నిరుద్యోగ యువత అవకాశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఈ పోస్టుల కోసం నిరుద్యోగులు దరఖాస్తులు సమర్పించినట్లు సమాచారం. అయితే బహిరంగ నోటిఫికేషన్, ఎంపిక విధానం, ఇంటర్వ్యూల నిర్వహణ వంటి అంశాలపై స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఓఎస్‌ఎఫ్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారా? ఎంపిక ప్రక్రియ నిర్వహించారా? లేక నేరుగా ఎమ్మెస్ అకౌంటెంట్లకే బాధ్యతలు అప్పగించారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త పోస్టులకు నిరుద్యోగులను పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమనే చర్చ సాగుతోంది.జిల్లా స్థాయి అధికారుల ఏకపక్ష నిర్ణయంతో ఈ ప్రక్రియ జరిగిందని, దీంతో అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న నేపథ్యంలో కొత్త పోస్టులను బహిరంగంగా భర్తీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో ఓఎస్‌ఎఫ్ అకౌంటెంట్ నియామకాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నియామకాల కోసం అనుసరించిన విధానం, మార్గదర్శకాలు, అధికారిక ఉత్తర్వులను బహిర్గతం చేసి పారదర్శకత పాటించాలని కోరుతున్నారు. 'ఓఎస్‌ఎఫ్ అకౌంటెంట్ పోస్టులకు ప్రత్యేక నియామక ప్రక్రియ నిర్వహించారా? బహిరంగ నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదు? అర్హులైన నిరుద్యోగులకు అవకాశం కల్పించారా? ఎమ్మెస్ అకౌంటెంట్లకే బాధ్యతలు అప్పగించడానికి ఉన్న అధికారిక నిబంధనలు ఏమిటి?" అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవస రం ఉందని ప్రజలు అభిప్రాయప డుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ అంశంపై స్పందించి పూర్తి వివరాలను వెల్లడిస్తేనే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి

- రాష్ట్రంలో ఆలయాల పునర్నిర్మాణానికి రూ.2,216 కోట్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



**మంచిర్యాల ప్రతినిధి/ దండేపల్లి, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయ, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు.

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి. రోడ్డు పనులు, 2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఓట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక, గుడి రేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలి

**కిషన్ రెడ్డికి ఎంపీ వంశీకృష్ణ సవాల్**



**మంచిర్యాల, జూన్13 (జనంసాక్షి) :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ సవాల్ విసిరారు. సింగరేణి కార్మికులపై కేంద్రానికి నిజంగానే ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే... రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను తక్షణమే పెంచి చూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని గుండెల్లో మోసి... ఉద్యమాన్ని ముందుకు నడిపిన వీరులు సింగరేణి కార్మికులని ఆయన కొనియాడారు. మంచిర్యాల వేదికగాశ్రీరాంపూర్ సింగరేణి ఏరియా ఆధ్వర్యంలో... ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సింగరేణి కారుణ్య నియామకాల పత్రాల పంపిణీ జరిగింది. డిపెండెంట్ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు... ఈసందర్భంగా ఎంపీ వంశీకృష్ణ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం... రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపు కోసం... పార్లమెంట్‌లో గళం విప్పాను, ఇకముందూ గళం విప్పుతూనే ఉంటా అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ.150 కోట్ల భారీ వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి కార్మికులు అనగానే... అందరికీ గుర్తొచ్చేది కాకా వెంకటస్వామి అని... నాడు నష్టాల్లో, అప్పుల్లో ఉన్న సింగరేణి సంస్థను కాపాడిన మహోన్నత వ్యక్తి కాకా అని ఆయన గుర్తుచేశారు. సింగరేణి ఉద్యోగులకు ఐటీ పర్క్స్ (ఎ÷ఃఖఃసీబ) నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే సింగరేణిలో మారుపేరు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సుఖంగా ఉంటేనే సంస్థ బాగుంటుందని... కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో పార్లమెంట్ వేదికగా అలుపెరగని పోరాటం చేస్తానని ఎంపీ వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

# లండన్ భారత హై కమిషన్‌లో 'తెలంగాణ డే' వేడుకలు

**తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యూకే (టీఏయూకే)**



**లండన్ (జనంసాక్షి) :** లండన్‌లోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో 'తెలంగాణ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్ని సెంట్రల్ లండన్ లోని భారత హైకమిషన్ కార్యాలయంలో నిర్వహించారు, ఇందులో యూకేలోని వివిధ ప్రవాస సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యూకే (టీఏయూకే) సంస్థ తెలంగాణ కు ప్రాతినిధ్యం వహించి, ఎంతో చురుగ్గా పాల్గొనడమే కాకుండా తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించేలా ప్రత్యేక నృత్య ప్రదర్శన మరియు హాజరైన అతిధులకు టాక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బిర్యానీని రుచి చూపించారు. కార్యక్రమంలో ముందుగా లండన్‌లోని భారత హై కమిషనర్ పెరియసామి కుమారన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు, ప్రవాసులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపి, ప్రవాసుల్లో ఐక్యత, విదేశీ గడ్డ పై భారత సంస్కృతిని ప్రచారం చెయ్యడానికి వివిధ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకల్ని భారత హైకమిషన్ అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా టీఏయూకే చిన్నారులు తెలంగాణ జానపద మరియు సాంస్కృతిక గీతాలకు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బతుకమ్మ ప్రదర్శన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. భారత హైకమిషనర్ పెరియసామి కుమారన్ టాక్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందిస్తూ ...టాక్ సంస్థ ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొనడమే కాకుండా అటు సాంస్కృతిక కార్యక్రమాల్లో, అతిధులకు బిర్యానీతో అసలైన తెలంగాణ సంప్రదాయాన్ని చూపించారని తెలిపారు.

టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ లండన్‌లోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'తెలంగాణ డే' వేడుకల్లో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని, నాడు టాక్ వ్యవస్థాపకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు అనిల్ కూర్మాచలం నాయకత్వంలో ఇదే భారత హైకమిషన్ ముందు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆకాంక్షిస్తూ కెసిఆర్ గారి పిలుపు మేరకు ఎన్నో నిరసన కార్యక్రమాలు చేశామని, మరి నేడు అదే భారత హైకమిషన్ కార్యాలయంలో అధికారికంగా తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో భాగస్వామ్యం చేసిన భారత హైకమిషన్ కార్యాలయానికి అధికారులకు, మరియు హాజరై సహకరించిన టాక్ సభ్యులకు ఉపాధ్యక్షులు సురేష్ బుడగం, ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు కృతజతలు తెలిపారు. టాక్ సంస్థ కమ్యూనిటీ అఫైర్స్ ఛైర్పర్సన్ గణేష్ కుప్పలా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను వివరిస్తూ, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని, టాక్ సంస్థ చేస్తున్న సేవలను వివరించారు. టాక్ సంస్థ సభ్యులు కుమారి తన్మయి వర్షిణి కుప్పాల, నిధి గుడ్ల, ఏషిక.డి చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకల ముగింపులో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యూకే ఆధ్వర్యంలో అతిథులకు సంప్రదాయ తెలంగాణ వంటకాలతో ఆతిథ్యం అందించారు. తెలంగాణ రుచులను ఆస్వాదించిన అతిథులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భాషను విదేశాల్లోని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని మరింతగా చాటిచెప్పే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం గాఖఖకు ఎల్లప్పుడూ గర్వకారణమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ వేడుకల్లో భారత సంతతికి చెందిన తెలంగాణ వాస్తవ్యులు లార్డ్ ఉదయ్ నాగరాజు, టాక్ సంస్థ ప్రతినిధులు రత్నాకర్ కడుదుల, గణేష్ కుప్పలా, నవీన్ రెడ్డి, సురేష్ బుడగం, సుప్రజ పులుసు, స్వాతి, అబ్దుల్ ఖుద్దూస్, నవ్య కుప్పాల ,కుమారి తన్మయ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# షాదీముబారక్‌లో అక్రమాలు

**ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** షాదీ ముబారక్ పథకంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బండ్లగూడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కిరణ్, ఇత్తేమాద్, అక్బర్, ముషారఫ్, సర్ఫరాజ్, జఫ్ఫార్‌లు అరెస్టైన వారిలో ఉన్నారు. షాదీ ముబారక్ పథకంలో వీరు రూ.30 లక్షల మేర కాజేశారు. ఐదుగురు నిందితులు.. నకిలీ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు సృష్టించి ఈ స్కీమ్‌కు తప్పుడు దరఖాస్తులు సమర్పించారు. ఆర్ఐ అశోక్‌కిరణ్ కమిషన్ తీసుకుని ఈ దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ అక్రమాలను గుర్తించారు. నిందితులను అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

## కుటుంబ కలహాలతో గర్భిణి ఆత్మహత్య

**సంగారెడ్డి, జూన్13 (జనంసాక్షి) :** జహీరాబాద్ మండలం హో(త్రి)కె డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలు.. ఒక నిండు గర్భిణి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. సదరు మహిళ కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గర్భిణి.. దారుణమైన నిర్ణయం తీసుకుంది. రెండంతస్తుల ఇంటి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

# పాఠశాలల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి వెనక్కి తీసుకోవాలి

- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధరరావు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** పాఠశాలల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి వెనక్కి తీసుకోవాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి అధ్యక్షులు ప్రొ. కె. చక్రధరరావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బడుల మసివేతను నిలిపివేయాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 20% నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధరరావు మాట్లాడుతూ 27వేల పాఠశాలలను 4వేల పాఠశాలలకు కుదిస్తామని బెంగళూర్‌లో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి తీవ్రంగా ఖండిస్తున్నదని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 20% నిధులు కేటాయించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిని అభివృద్ధి చేసి అందరికీ నాణ్యమైన, సమానమైన ఉచిత విద్యను ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటన చాలా విషాదకరమని, మానవీయ సమాజం నిర్మాణం కావాలంటే ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉనికిలో ఉండాలని తెలుపుతూ ముఖ్యమంత్రి తక్షణమే తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటి కార్యనిర్వాహణ కార్యదర్శి ప్రొ.కె.లక్ష్మినారాయణ రౌండ్ టేబుల్ సమావేశం కీ నోట్ ప్రవేశపెడుతూ ముఖ్యమంత్రి తన ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూన్ 20 నుండి జులై 15 వరకు రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులందరికీ మెమోరాండాలను సమర్పించాలని, అన్ని జిల్లాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను మసివేయడం సరైనది కాదని, ముఖ్యమంత్రి తన ప్రతిపాదనలను పునరాలోచన చేయాలని కోరారు. విద్యా పరిరక్షణ కమిటి పాఠశాలల పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమాలకు మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ 23వేల పాఠశాలలను మసివేస్తామని ప్రకటన చేయడం రాజ్యాంగానికి, విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకమని, విద్యా పరిరక్షణతోపాటు రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాల్సి దుస్థితి వచ్చిందన్నారు. ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటి కాదు ఫ్యూచర్ పౌరులను తయారు చేయాలని, అలాగే విద్యాశాఖను గుప్పిట్లో పెట్టుకున్న ముఖ్యమంత్రి ఏకపక్షంగా పాఠశాలలను మసివేయాలని ప్రకటన చేయడం వాంచనీయం కాదని, భవిష్యత్తులో విద్యా పరిరక్షణ కోసం ఉద్యమించాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మద్దతుగా సిపిఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు హన్మేష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రటి గోవర్ధన్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క, డిబిఎఫ్ నాయకులు శంకర్, విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య, ఎం.వి.ఎఫ్. నాయకులు వెంకట్ రెడ్డి, ప్రొ.సూరెపల్లి సుజాత, ప్రొ.భవాని, ప్రొ.విజయ్, ప్రొ.వినాయక్‌రెడ్డి, ప్రొ.అన్వర్‌ఖాన్, డా.వానమాల, ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు జి.సదానంద గౌడ్, యుటిఎఫ్ నాయకులు వెంకటప్ప, టిపిజెఎసి రాష్ట్ర కో-కన్వినర్ కన్నెగంటి రవి, టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చకినాల అనిల్ కుమార్, నన్నెబోయిన తిరుపతి, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి, విద్యా పరిరక్షణ కమిటి సహాధ్యక్షులు వై.అశోక్ కుమార్, సహ ప్రధాన కార్యదర్శి ఎం.రఘుశంకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.ఎన్.కిష్టప్ప, కె.వేణుగోపాల్, కార్యదర్శి రవిచంద్ర, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలతోనే కాంగ్రెస్ పాలన

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అవగాహన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య విలువలతోనే కాంగ్రెస్ పాలన అందిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని బిచ్కుంద మండల కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) కోసం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ శిబిరంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జి, జుక్కల్ నియోజక వర్గ బీఎల్ఏ ఇంఛార్జి ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి వారి పేర్లు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు అని, దానిని కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలు, వార్డులు, బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అందేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు ప్రజల్లో అవగాహన కల్పించాలి అని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్ బీఎల్ఏ కోఆర్డినేటర్ నవీన్, బిచ్కుంద మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ కవిత, బిచ్కుంద చైర్‌పర్సన్ సీమ శెట్టి కర్ , పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్ ,ఏఎంసీ ఛైర్మన్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

## రామభక్తుల విరాళాలు ఏమయ్యాయి..!?

భారతదేశ కోటి కోటి హిందువుల హృదయాల్లో రాముడు కేవలం దేవుడు మాత్రమే కాదు, ఆదర్శం, విశ్వాసం, ధర్మస్వరూపుడు. అటువంటి రాముని పేరిట నిర్మితమవుతున్న అయోధ్య మందిరం కోసం దేశం నలుమూలల నుండి సామాన్య భక్తులు తమ చెమట చుక్కల సొమ్మును ఆనందంగా అర్పించారు. ఒక్కో రూపాయి వెనక ఒక్కో కుటుంబం శ్రద్ధ, ఒక్కో నమ్మకం దాగి ఉంది. అటువంటి పవిత్ర నిధులపై అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెలుగు చూస్తున్న వేళ, మనం మూగగా ఉండటం అపరాధం.

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ స్వయంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విరాళాలు, కానుకల విషయంలో చాలాకాలంగా అవకతవకలు జరుగుతున్నాయని. ఈ విషయంపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరింది. అంటే ట్రస్ట్ లోపల నుండే అవినీతి వాసన వస్తోందని స్పష్టమవుతుంది. సొంత ఇంటిలో నిప్పు పుట్టినపుడు దాన్ని బయటి వారికంటే ముందే ఇంట్లో వారే గుర్తిస్తారు. ఇక్కడ అదే జరిగింది.

మరోవైపు న్యాయవాది మోహిత్ అశోక్ అలహాబాద్ న్యాయస్థానంలో పిల్ దాఖలు చేశారు. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టాలని, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఖాతాలపై సమగ్రమైన తనిఖీ కూడా నిర్వహించాలని కోరారు. ఈ పిల్ దాఖలు కావడం ఒక సానుకూల పరిణామం. ఎందుకంటే ప్రజలు రోడ్లపై కాకుండా న్యాయస్థానాల్లో న్యాయం వెతుకుతున్నారు. అంతకుముందే ట్రస్ట్ అకౌంట్స్ ఇంచార్జిగా ఉన్నానని చెప్పుకుంటున్న మహిపాల్ సింగ్.. విరాళాల విషయంలో చాలాకాలంగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినందుకే తనను విధుల నుండి తొలగించారని ఆయన వెల్లడించారు. ఇది అత్యంత తీవ్రమైన విషయం. సత్యం చెప్పినందుకు శిక్ష పడటం. ఏ సంస్థలో జరిగినా అది ప్రమాద సంకేతమే. మరీ ముఖ్యంగా మతపరమైన ట్రస్ట్‌లో జరిగినప్పుడు అది విశ్వాసఘాతుకత్వం అవుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలు విరాళాలుగా వచ్చాయి. ఆ నిధులు ఎక్కడికి వెళ్ళాయి? ఏ నిర్మాణ పనులకు, ఏ మొత్తాలు ఖర్చయ్యాయి? లెక్కలు పారదర్శకంగా ఉన్నాయా? ప్రజలకు జవాబు చెప్పే బాధ్యత ట్రస్ట్‌కు లేదా? ఫిర్యాదు చేసిన వ్యక్తిని తొలగించడం, సాక్ష్యాన్ని తొలగించే ప్రయత్నమా?

మతం పేరిట జరిగే అవినీతి సాధారణ అవినీతి కంటే చాలా ప్రమాదకరమైనది. అది విశ్వాసాన్ని ఆయుధంగా మారుస్తుంది. భక్తి భావాన్ని వ్యాపారంగా మలుస్తుంది. రాముని పేరిట ప్రశ్నించడం పాపమన్న వాదన ఏమాత్రం చెల్లదు. నిజమైన రామభక్తి అంటే ఆయన పేరిట జరిగే అన్యాయాన్ని సహించకపోవడమే. రాముడు స్వయంగా ధర్మస్వరూపుడు, అవినీతిని సమర్థించే దేవుడు ఆయన కాదు. ఇప్పుడు జరగవలసినది చాలా స్పష్టంగా ఉంది. న్యాయస్థానాలు స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని వెంటనే నియమించాలి. ట్రస్ట్ సంపూర్ణ ఆర్థిక నివేదికలను బహిరంగపరచాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తికి రక్షణ కల్పించాలి. దోషులు ఎవరైనా సరే, ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా సరే, శిక్ష తప్పకూడదు. భవిష్యత్తులో మతపరమైన ట్రస్ట్‌లకు తప్పనిసరి తనిఖీ విధానాన్ని చట్టబద్ధంగా అమలు చేయాలి. కోట్లాది భక్తులు రాముని మందిరం కోసం కన్నీళ్ళతో, అపార భక్తితో డబ్బు ఇచ్చారు. వారు ఇచ్చింది రాళ్ళ కోసం కాదు, రాముని కోసం. ఆ నమ్మకాన్ని మోసగించినవారికి సమాజంలో క్షమాపణ లేదు, న్యాయంలో తప్పించుకునే మార్గం ఉండకూడదు. రాముని పేరిట మొదలైన ఈ మందిర నిర్మాణం నిజాయితీగా, పవిత్రంగా పూర్తి కావడమే అసలైన రామభక్తి. ఆ పవిత్రతను కాపాడడానికే న్యాయస్థానాలు తలుపులు తెరిచాయి. న్యాయం తప్పకుండా జరగాలని మనమందరం కోరుకుందాం. సత్యమేవ జయతే.. ఇది రాముని సూత్రం కూడా.

# నల్ల నేల ముద్దుబిడ్డ

### ప్రొలిటేరియన్ జర్నలిస్ట్ "మునీర్ బాయ్" పుస్తకావిష్కరణ నేడు



ముళ్లబాటను చదును చేస్తూ, కత్తుల వంతెన పై నడకను ప్రారంభించి, పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కి, జైలు గోడల ముద్దాడి, ఎరుపెక్కిన గుండెతో రాజ్యానికి ఎదురు నిలిచిన ఉద్యమకారుడు మునీర్....

కష్టాలకు కారణం వెతికి, పరిష్కారానికి మార్గాన్ని అన్వేషించే దూరదృష్టి కలవాడు జర్నలిస్ట్ మునీర్....

నల్ల నేలన జన్మించి, ఐదు దశాబ్దాలకు పైగా బాల్యం నుంచి చివరి శ్వాస వరకు ప్రజల కోసం పరితపించిన మహా మనిషి మునీర్...

ఒక సాధారణ గని కార్మికుడి కుటుంబంలో జన్మించిన మునీర్ కుటుంబ బంధాలను, గంపెడు సంతానం బాధలు, ప్రేమ, దుఃఖం, సుఖం, సంతోషం తెలిసిన సగటు జీవి మునీర్...


ఆకలి రుచి తెలిసినవాడు.. అవమాన భారం మోసినవాడు.. అసమానతలు తొలగాలని కలలు కన్నవాడు... కలల సాకారానికి ప్రశ్నను ఆయుధంగా మలిచి, రాజ్యానికి ముచ్చెమటలు పట్టించిన వాడు మునీర్!

ప్రజల జీవించే హక్కును కాపాడాలని జీవితాంతం కృషి చేశాడు. దోపిడి ముఠాలు కోల్ బెల్ట్ లో వీరంగం చేస్తున్ననాడు తన రక్తాన్ని చిందించి వారి ఆటలు కట్టించాడు. పౌర హక్కులు కాపాడాలని ఎలుగెత్తి చాటిన మహా మనిషి ప్రొఫెసర్ బాలగోపాల్ వెంట అడుగులో అడుగు వేస్తూ నడిచాడు. ప్రజల రాజ్యాంగబద్ధ జీవనం కోసం జీవితకాలం పనిచేసిన ప్రజా న్యాయవాది కన్నబీరాన్ ప్రేమను పొందిన జర్నలిస్ట్ మునీర్..

చిరునవ్వుతో పలకరించి.. ఓపికగా ఎదుటి వ్యక్తి కష్టం విని తన జేబు ఖాళీ అయిన కడుపు ఖాళీగా ఉన్న ఎదుటి వ్యక్తి అవసరా నికి తన శక్తి మేర నిలబడిన గొప్ప ఆచరణాత్మక నాయకుడు మునీర్..

బాధితులను ఓదార్చడమే కాదు, భరోసానివ్వడమే కాదు, బరి గీసి వారి కోసం నిలబడి, కలబడి సమస్య పరిష్కారం అయ్యేదాకా వారితోనే గడిపిన పోరు బిడ్డడు.

సింగరేణి కార్మిక నేత అమరుడు వీటి అబ్రహం తో కలిగిన పరిచయం వలన ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ సిపిఐ నాయకుడిగా తన నడక కొన్నాళ్లపాటు కొనసాగింది.



మునీర్ భాయ్
ప్రొలిటేరియన్ జర్నలిస్ట్
ఎడిటర్స్
మాదాసి రామమూర్తి
నక్క వెంకట్రావ్

మందమర్రి భూస్వామి హత్య కేసులో నిందను మోసి, పోలీస్ చిత్రహింసలు, జైలు ఊచలను లెక్కించాడు. హైకోర్టు న్యాయవాది లు శ్రీ పద్మనాభరెడ్డి కన్నాభిరాన్ ల వాదనలతో హైకోర్టు ద్వారా నిర్దోషిగా విడుదలై ప్రజా జీవితంలోకి మునీర్ అడుగు పెట్టాడు.

ప్రజల్లో చైతన్యాన్ని రగిలించటానికి, జనం సమస్యలు పరిష్కరించటానికి అక్షరాలను ఆయుధాలుగా మలిచే జర్నలిస్టు రంగంలోకి అడుగుపెట్టారు.

చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకు వచ్చే కాంట్రాక్టు కూలీల కష్టాలను, పుడమి తల్లి ఒడిలోకి వెళ్లి, నల్ల బంగారాన్ని వెలికి తీసే చీకటి సూర్యుల కన్నీటి గాథలను, బాయి దొరల బాగోతాలను, అధికారుల అవినీతిని, దొంగ నాయకుల బండారాన్ని బట్టబయలు చేస్తూ అనేక కథనాలను పత్రికల్లో రాశాడు.

1980వ సంవత్సరం నుంచి దాదాపు 20 ఏళ్ల పాటు ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా కోల్ బెల్ట్ ప్రాంతంలో జరిగిన హింసపై ప్రత్యక్ష సాక్షిగా వందలాది కథనాలను రాసిన గొప్ప ధైర్యశాలి. పోలీసులు, ప్రభుత్వం బెదిరించి దాడులు చేసినా, భయపడకుండా ప్రజల పక్షాన,కార్మికుల పక్షాన, పీడితుల గొంతుగా తన రచనలను అప్రతిహతంగా కొనసాగించిన గొప్ప మనిషి మునీర్.



గుర్తుతెలియని వ్యక్తులు మనుషులను మాయం చేయడం, ఎదురు కాల్పులు, ఏకపక్ష కాల్పులు, వామపక్ష ,విప్లవ సంస్థల హత్యలు, ప్రజల తిరుగుబాటు, అడవి బిడ్డల ఉద్యమాలు గూడేల కన్నీటి ఘోషలు, పర్యావరణ విధ్వంసం, రెక్కలే ఆస్తులుగా బతికే దళిత బిడ్డల కన్నీటి గాథలపై వరుస కథనాలను రాసిన గొప్ప జర్నలిస్టుగా ప్రజల మన్ననలు పొందాడు.


చెడు సహవాసం, చెడు అలవాట్లు ఏవి లేకున్నా, కలుషిత వాతావరణంలో జీవించడం వల్ల క్యాన్సర్ మహమ్మారి వేటుకు మునీర్ బలయ్యాడు. ఉత్పత్తి, లాభాలు తప్ప ప్రజల జీవితాలపై కర్మగార యాజమాన్యాలకు పట్టింపు లేదు., ప్రభుత్వ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం. ప్రజాప్రతినిధుల చేతకానితనం వల్ల కోల్ బెల్ట్ లో జనం కాలుష్యంతో జీవిస్తున్నారు. పర్యావరణ విధ్వంసం వల్ల ప్రజలు రోజురోజుకు మృత్యువు వైపు అడుగులు వేస్తున్నారని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.

ఆయన జీవనం నుంచి మరణం వరకు జరిగిన పరిణామాలపై రచించిన ప్రొలిటేరియన్ జర్నలిస్ట్ "మునీర్ బాయ్" పుస్తకావిష్కరణ ఆదివారం, ఉదయం పదిన్నర గంటలకు, మందమర్రి సి ఆర్ క్లబ్ లో జరుగుతున్నది.

**వ్యాసకర్త, మాదాసి రామమూర్తి,**
సీనియర్ జర్నలిస్ట్, గోదావరి ఖని

### గతి తర్కం !

"నువ్వు ఎంత చెప్పు
ఈ సమాజం మారదు "
అనేవాళ్ళను చూస్తే
నాకు ఎంతో ఆశ్చర్యం!
ప్రతీక్షణంపాతనీరుపోయి
కొత్త నీరు వస్తుంది!
వీచే ప్రతి గాలితెర
కొత్త అణువుల కదలికే!
పుట్టిన ప్రతిజీవిలో
క్షణక్షణం మార్పు!
వృద్దాప్య దశకు చేరి
తుదకు మరణం!
నిప్పు నీరు గాలి భూమి
ఆకాశం..పంచభూతాలు
నీకుచూడటం చేతనైతే
ప్రతిక్షణంనిత్యనూతనమే!
స్థావర జంగమాలన్నీ
ప్రతీక్షణం మారతాయి!
సృష్టి నిరంతరం
చలనశీల స్వభావం!




అడవి నుండి మనిషి
ఆగని ప్రయాణమే
నేటి అధునాతన
ప్రజాప్రస్థానం!
సృష్టి ఒక్కటేకాదు
సమాజం కూడా
బానిసయుగం నుండి
నేటి సామ్రాజ్యవాదం !
మారనిది ఎక్కడ?
మారుతూనే ఉంటుంది!
కులాలు మతాలు కూడా
అలాగే ఉండవు!
మార్పు సహజం!
నేను చెప్పటం
ఆ మార్పును వేగిర
పరచగలగటం!
మనువాదులు మళ్ళీ
అదే మనుస్మృతిని
తేవాలనుకోవటం
వాళ్ల బుద్ధి మాంధ్యం!
స్టవ్ మీద పెట్టినబియ్యం
గింజ గింజ ఉడికి
'అన్నం' గా మారితే
అది గుణాత్మక మార్పు!
సూర్యాస్తమయం భ్రమ!
అది మరోచోట ఉదయం!
సూర్యబింబం ప్రతీక్షణం
చలనశీల జ్వలనం!
అందుకే చెపుతున్నాను
నువ్వుఔనన్నా కాదన్నా
సోషలిస్టుసమాజంఖాయ!
నేనుచెపుతూనేఉంటాను!
అరచేతిని అడ్డుపెట్టి
ఏ స్వార్ధపరుడూ
వర్గరహితసమాజాన్ని
ఆపలేడు!అదిగతితర్కం!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# రాజ్యాధికారం, హింస, ప్రజాస్వామ్యం

### ఆయుధాధిపత్యం నుంచి ప్రజాస్వామ్య విలువల వరకు సిద్ధాంతాల ముసుగులో సాగిన అధికార రాజకీయాల తాత్విక విశ్లేషణ



మానవ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే ఒక మౌలిక సత్యం మనకు కనిపిస్తుంది. రాజ్యాలు, సామ్రాజ్యాలు, పాలక వర్గాలు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రధానంగా ఆధారపడింది నైతికతపై కాదు; ఆయుధ బలం, బలవంతం, హింసపైనే. అయితే ఆ హింసను సమర్థించేందుకు, ప్రజల అంగీకారాన్ని పొందేందుకు ప్రతీ యుగంలోనూ కొన్ని సిద్ధాంతాలు, భావజాలాలు, మతాలు, రాజకీయ నినాదాలు పుట్టుకొచ్చాయి. కర్ర చేతిలో ఉన్నవాడిదే బర్రె అన్న సామెత చరిత్ర అంతటా పునరావృతమవుతూనే వచ్చింది.

ప్రాచీన కాలంలో అలెగ్జాండర్, చెంఘిజ్ ఖాన్ వంటి పాలకులు తమ కత్తుల బలంతో సామ్రాజ్యాలను నిర్మించారు. వారికి ప్రత్యేక సిద్ధాంతాల అవసరం లేదు. సైనిక శక్తి చాలు. తరువాతి కాలంలో గజనీ మహ్మద్, మహ్మద్ ఘోరీ, బాబర్, ఔరంగజేబు వంటి పాలకులు మతాన్ని తమ రాజకీయ విస్తరణకు ఒక సాధనంగా ఉపయోగించారు. మత ప్రచారం, మత రక్షణ వంటి నినాదాలు చివరికి సామ్రాజ్య విస్తరణకే ఉపయోగపడ్డాయి.

చరిత్రలో ఏ శక్తి కేవలం సిద్ధాంతం వల్ల అధికారంలోకి రాలేదు. సైనిక బలం ఉన్నవారే పాలకులయ్యారు. జర్మన్ సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ చెప్పినట్లు, "రాజ్యం అంటే చట్టబద్ధమైన హింసపై గుత్తాధిపత్యం కలిగిన వ్యవస్థ." ఈ నిర్వచనం రాజ్యాధికార స్వభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇలాంటి నేపథ్యంలో మార్క్సిజం కూడా ఒక ప్రత్యేక పరిశీలనకు అర్హమైనది. కార్ల్ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థపై తీవ్రమైన విమర్శలు చేసినప్పటికీ, రాజకీయంగా ఆయన ప్రతిపాదించిన మార్గం కూడా శక్తి స్వాధీనంపైనే ఆధారపడింది. కార్మిక వర్గ విప్లవం ద్వారా పాత రాజ్య యంత్రాంగాన్ని కూలదోసి, కార్మిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించాలనే ఆలోచనలో ప్రజాస్వామ్య స్వేచ్ఛలకు పరిమిత స్థానం మాత్రమే కనిపిస్తుంది.

లెనిన్ నాయకత్వంలో ఏర్పడిన సోవియట్ వ్యవస్థలో ఒకే పార్టీ ఆధిపత్యం పెరిగింది. ఫలితంగా ఓటు హక్కు, రాజకీయ పోటీ, విభిన్న అభిప్రాయాల వ్యక్తీకరణ వంటి ప్రజాస్వామ్య విలువలు బలహీనపడ్డాయని విమర్శకులు పేర్కొన్నారు. రాజరికం తన అధికారాన్ని మతం పేరిట సమర్థించుకున్నట్లే, కమ్యూనిస్టు వ్యవస్థలు శ్రామిక విముక్తి పేరుతో అధికార కేంద్రీకరణను సమర్థించాయని కొందరు తాత్వికులు విశ్లేషిస్తారు.

మార్క్సిజంపై మరో ప్రధాన విమర్శ దాని తాత్విక పునాదుల విషయంలో కనిపిస్తుంది. జర్మన్ తత్వవేత్త హెగెల్ ప్రతిపాదించిన "సబ్లేషన్" లేదా "ఉన్నతీకరణ" భావన ప్రకారం సమాజ పరిణామంలో పాత వ్యవస్థ పూర్తిగా నశించదు. దానిలోని మంచి అంశాలు కొత్త వ్యవస్థలో కొనసాగుతాయి. లోపాలు మాత్రమే తొలగించబడతాయి. ప్రకృతిలో కూడా ఇదే క్రమం కనిపిస్తుంది. జీవ పరిణామం, వారసత్వ లక్షణాలు, చారిత్రక అనుభవాలు అన్నీ నిరంతరాయంగా కొనసాగుతాయి.

అయితే మార్క్స్ పాత వ్యవస్థను పూర్తిగా తిరస్కరించే "నెగేషన్" భావనను ముందుకు తెచ్చారని విమర్శకులు అంటారు. ఫలితంగా కమ్యూనిస్టు వ్యవస్థలు ఏర్పడిన అనేక దేశాల్లో కొత్త అధికార వర్గాలు పుట్టుకొచ్చి, ప్రజల రాజకీయ స్వేచ్ఛలను పరిమితం చేశాయని చరిత్రలోని కొన్ని ఉదాహరణలు సూచిస్తున్నాయి.

ఆధునిక భారతదేశంలో భావజాల రాజకీయాలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. కొందరు విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, మతపరమైన భావోద్వేగాలు, జాతీయత, సామాజిక వైరుధ్యాలు రాజకీయ సమీకరణకు సాధనాలుగా ఉపయోగించబడుతున్నాయి. మతం, జాతి, భద్రత, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలు ప్రజలను సమీకరించే శక్తివంతమైన రాజకీయ సాధనాలుగా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య చైతన్యం కంటే భావోద్వేగ రాజకీయాలు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.


ఇలాంటి చారిత్రక అనుభవాల మధ్య బౌద్ధ తత్వం ఒక భిన్నమైన మార్గాన్ని సూచిస్తుంది. గౌతమ బుద్ధుడు హింసను కాకుండా కరుణను, ద్వేషాన్ని కాకుండా మానవత్వాన్ని, బలవంతాన్ని కాకుండా హృదయ పరివర్తనను విశ్వసించారు. అంగుళీమాలుడు వంటి క్రూరుడిని కూడా మార్పు దిశగా నడిపించిన బౌద్ధ ధర్మం, శాంతియుత సామాజిక పరివర్తనకు ప్రతీకగా నిలిచింది.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన "ఒక మనిషి – ఒక ఓటు – ఒకే విలువ" అనే ప్రజాస్వామ్య సూత్రం ఈ నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ప్రజాస్వామ్యంలో ఆయుధ బలం కాదు, ప్రజల చైతన్యమే అసలైన శక్తి. ఓటు ద్వారా పాలకులను గెలిపించే హక్కు ప్రజలకు ఉన్నట్లే, వారిని ఓడించే శక్తి కూడా ప్రజలకే ఉంది. ఇదే ప్రజాస్వామ్య మహోన్నతత్వం.

అలాగే వినియోగదారులుగా ప్రజలు సంఘటితమైతే ఆర్థిక వ్యవస్థలపైనా ప్రభావం చూపగలరు. కొనుగోలు నిరాకరణ, ప్రజాస్వామ్య నిరసన, ఓటు తిరస్కరణ వంటి శాంతియుత మార్గాలు సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనాలుగా నిలుస్తాయి.

చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటంటే, సిద్ధాంతాలు ఎంత గొప్పగా కనిపించినా అవి మానవ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడినప్పుడే వాటి విలువ నిలుస్తుంది. ఏ సిద్ధాంతమైనా ప్రజలపై ఆధిపత్యం కోసం ఉపయోగించబడితే అది మరో రకమైన నియంతృత్వంగా మారే ప్రమాదం ఉంటుంది.

అందువల్ల సమాజ భవిష్యత్తు ఆయుధాల్లో కాదు, నైతిక చైతన్యంలో ఉంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, "ఒక మనిషి – ఒక ఓటు – ఒకే విలువ" అనే సూత్రాన్ని బలపరుస్తూ, మానవ గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం ఆధారంగా ముందుకు సాగినప్పుడే నిజమైన ప్రజాస్వామిక, మానవతావాద సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ఇదే ఆధునిక ప్రపంచానికి అత్యంత అవసరమైన తాత్విక దిశ.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# అమెరికా పెత్తనం

### ప్రపంచ శాంతికి పెరుగుతున్న ముప్పు



ప్రపంచ రాజకీయాల్లో అమెరికా పాత్రపై విమర్శలు కొత్తవి కావు. అయితే ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఇరాన్‌పై కొనసాగుతున్న సైనిక చర్యలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలపై పెరుగుతున్న ఉద్రిక్తతలు మరోసారి ఒక ప్రాథమిక ప్రశ్నను ముందుకు తెచ్చాయి. ప్రపంచ భద్రత పేరుతో ఒకే దేశం తన సైనిక, ఆర్థిక, రాజకీయ శక్తిని ప్రపంచవ్యాప్తంగా ప్రయోగించడం ఎంతవరకు సమంజసం? అంతర్జాతీయ చట్టాలు, ఇతర దేశాల సార్వభౌమాధికారాలు, స్వతంత్ర విదేశాంగ విధానాలు అన్నీ ఒకే శక్తి ముందు తలవంచాల్సిందేనా?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 80 శాతం సరుకు రవాణా సముద్ర మార్గాల ద్వారానే జరుగుతుంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 శాతం ప్రవహిస్తుంది. ఇలాంటి ప్రాంతాల్లో ఏ చిన్న సైనిక ఘర్షణ జరిగినా దాని ప్రభావం కేవలం సంబంధిత దేశాలకే పరిమితం కాదు. ఆసియా, ఆఫ్రికా, యూరప్, లాటిన్ అమెరికా వరకు ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడుతుంది.

అమెరికా చాలా కాలంగా ఇరాన్‌పై ఆంక్షలు అమలు చేస్తోంది. ఆ ఆంక్షలను ఉల్లంఘిస్తూ చమురు కొనుగోలు చేసే దేశాలపై కూడా ఒత్తిడి తెస్తోంది. కానీ ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. రెండు స్వతంత్ర దేశాల మధ్య జరిగే వాణిజ్య లావాదేవీలను నియంత్రించే హక్కు ఒక మూడో దేశానికి ఎవరు ఇచ్చారు? ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆమోదించని ఏకపక్ష ఆంక్షలను ప్రపంచమంతా పాటించాలని కోరడం అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?

గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా విదేశాంగ విధానాన్ని పరిశీలిస్తే ఒక స్పష్టమైన ధోరణి కనిపిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాల్లో జరిగిన యుద్ధాలు లక్షలాది మంది ప్రాణాలను బలితీసుకున్నాయి. ఇరాక్‌లో సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయని చెప్పి యుద్ధం ప్రారంభించారు. కానీ తర్వాత అలాంటి ఆయుధాల ఉనికిని నిరూపించలేక పోయారు. అయినప్పటికీ ఆ దేశం పూర్తిగా విధ్వంసమైపోయింది. లక్షలాది పౌరులు నిరాశ్రయులయ్యారు. ఇదే పరిస్థితి లిబియాలోనూ కనిపించింది. ఒకప్పుడు ఆఫ్రికాలో అత్యధిక జీవన ప్రమాణాలు కలిగిన దేశంగా ఉన్న లిబియా నేడు అంతర్యుద్ధాలతో కుదేలైంది.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా సైనిక స్థావరాల సంఖ్య 750 కంటే ఎక్కువగా ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. జపాన్ నుంచి జర్మనీ వరకు, బహ్రెయిన్ నుంచి దక్షిణ కొరియా వరకు అమెరికా సైన్యం విస్తరించి ఉంది. ప్రపంచ చరిత్రలో ఏ సామ్రాజ్యానికీ ఇంత విస్తృతమైన సైనిక ఉనికి లేదు. భద్రత, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి పేర్లతో ఈ ఉనికిని సమర్థించుకుంటున్నప్పటికీ, అనేక దేశాల్లో దీనిని ఆధిపత్య రాజకీయాలుగా చూస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ సంబంధాల్లో మరింత అనిశ్చితి పెరిగింది. మిత్రదేశాలపైనా సుంకాలు విధించడం, అంతర్జాతీయ ఒప్పందాలను పునఃసమీక్షించడం, ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై ఒత్తిడి పెంచడం వంటి చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, సరఫరా గొలుసు సమస్యలు, ఇంధన ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో సైనిక ఉద్రిక్తతలు మరింత భారంగా మారుతున్నాయి.

భారత్ వంటి దేశాలకు ఈ పరిస్థితి ప్రత్యేక సవాల్. ఒకవైపు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరం. మరోవైపు ఇంధన భద్రత, స్వతంత్ర విదేశాంగ విధానం కూడా అంతే ముఖ్యం. భారతదేశం తన జాతీయ ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలి. ఏ శక్తికైనా అనుకూలంగా లేదా వ్యతిరేకంగా కాకుండా, తన ఆర్థిక అవసరాలు, ఇంధన అవసరాలు, భద్రతా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి.

ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచ శక్తి సమీకరణలు కూడా మారుతున్నాయి. చైనా ఎదుగుదల, రష్యా ప్రభావం, బ్రిక్స్ దేశాల విస్తరణ, గ్లోబల్ సౌత్ దేశాల ఐక్యత వంటి పరిణామాలు ఒకే దేశం ఆధిపత్యానికి సవాలు విసురుతున్నాయి. ప్రపంచ జనాభాలో 85 శాతం కంటే ఎక్కువ మంది పాశ్చాత్య దేశాల వెలుపల నివసిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలోనూ ఆసియా, ఆఫ్రికా దేశాల పాత్ర పెరుగుతోంది. ఈ మార్పులను అంగీకరించకుండా పాత ఆధిపత్య రాజకీయాలను కొనసాగించడం మరింత ఘర్షణలకు దారి తీసే ప్రమాదం ఉంది.

అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, యుద్ధాల ఖర్చును చివరకు సామాన్య ప్రజలే భరిస్తారు. చమురు ధరలు పెరుగుతాయి. ఆహార ధరలు పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. శరణార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థలు పేద దేశాలపై మరిన్ని ఒత్తిడులు పెడతాయి. ఆయుధ పరిశ్రమలు లాభపడతాయి కానీ ప్రజలు నష్టపోతారు.

అంతర్జాతీయ వ్యవస్థలో నిజమైన సంస్కరణల అవసరం ఇంతకుముందెన్నడూ ఇంత తీవ్రంగా కనిపించలేదు. ఐక్యరాజ్యసమితి మరింత ప్రజాస్వామ్యబద్ధంగా మారాలి. అంతర్జాతీయ చట్టాలు బలహీన దేశాలకే కాకుండా శక్తివంతమైన దేశాలకూ సమానంగా వర్తించాలి. ఏ దేశమైనా తన సైనిక, ఆర్థిక శక్తిని ఉపయోగించి ప్రపంచంపై పెత్తనం చలాయించే ధోరణిని ప్రపంచ సమాజం ప్రశ్నించాలి.

ప్రపంచానికి నేడు కావలసింది మరిన్ని యుద్ధాలు కాదు. మరింత సహకారం. మరిన్ని ఆంక్షలు కాదు. మరింత సంభాషణ. మరిన్ని క్షిపణులు కాదు. మరింత దౌత్యం. శాంతి, పరస్పర గౌరవం, సార్వభౌమాధికారాల పట్ల గౌరవం అనే సూత్రాలపై అంతర్జాతీయ వ్యవస్థ పునర్నిర్మించబడకపోతే, నేటి పశ్చిమాసియా సంక్షోభం రేపటి ప్రపంచ సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచాన్ని భయంతో కాదు, న్యాయంతో నడిపించే వ్యవస్థ కోసం దేశాలన్నీ గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

## తెలంగాణ వాదం జాతీయవాదానికి వ్యతిరేకం కాదు

- ఎమ్మెల్సీ కోదండరాం
- ఘనంగా గుండ యాదగిరి పటేల్ సంతాప సభ



**ముషీరాబాద్, జూన్ 13 (జనం సాక్షి) :** తెలంగాణ వాదం జాతీయవాదానికి వ్యతిరేకం కాదని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం అన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్, బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుండ యాదగిరి పటేల్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, పలువురు ఉద్యమకారులు, నాయకులు హాజరై పూలమాలలు వేసి అయి ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకోదండరాం మాట్లాడుతూ .. రాష్ట్ర అధ్యక్షుడు గుండ యాదగిరి తెలంగాణ కోసం ఏదైనా చేయాలని ఎంతో తాపత్రయపడి, నిబద్ధతతో క్రియాసీలకంగా పనిచేశారని కొనియాడారు. తెలంగాణ తన ప్రాంతాన్ని తాను కాపాడుకుంటూ భారతదేశం యొక్క గొప్పతనం అభివృద్ధి కోసం, కీలకమైన ఒక భాగంగా బ్రతకాలని తెలంగాణ ప్రయత్నం చేసిందని చెప్పారు. ఇవాళ తామందరం కూడా తెలంగాణ లక్ష్యసాధన కోసం పనిచేయాలని పేర్కొన్నారు. ఆంధ్ర పాలకులు చేసుకున్నటువంటి దోపిడి దౌర్జన్యం, ఆధిపత్యం కారణంగానే తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. తమ సంస్కృతిని, యాస భాషను కాపాడుకుంటామన్నారు. ఇక్కడి వనరులు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలన్నారు. ఈ కార్యక్రమంలో టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి, తెలంగాణ జన సమితి హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య గౌడ్, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి నాయకులు పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో తండ్రీ కూతురు దుర్మరణం

- అల్వాల్ టెలికం కాలనీలో హృదయ విదారక ఘటన
- వర్షానికి విరిగిన వేపచెట్టు.. నేలపై పడిన విద్యుత్ తీగ
- కూతురిని కాపాడబోయి తండ్రి మృతి
- ముందే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ కాలనీవాసుల ఆగ్రహం

**అల్వాల్, జూన్ 13 (జనంసాక్షి) :** ఉన్నత చదువులతో జీవితంలో ఎదగాలనుకున్న ఆ కూతురు.. ఆమె భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తండ్రి.. క్షణాల్లో మృత్యువాత పడ్డారు. భారీ వర్షం, ఈదురుగాలులకు విరిగిన చెట్టు.. నేలపై పడిన విద్యుత్ తీగ.. సంబంధిత శాఖల నిర్లక్ష్యం కలిసి ఒక కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్ టెలికం కాలనీలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

### క్షణాల్లో చిద్రమైన కుటుంబం

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్న సందీప్ (45) తన భార్య మమత, ఏకైక కుమార్తె హృతిక (16)తో కలిసి టెలికం కాలనీలో అద్దెకు నివాసముంటున్నారు. హృతిక ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసి నీట్ పరీక్షకు సిద్ధమవుతోంది. శనివారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఇంటి ముందున్న పెద్ద వేపచెట్టు వేర్లతో సహా విరిగిపడింది. చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో కరెంట్ ప్రవహిస్తున్న తీగ నేలపై పడింది. పెద్ద శబ్దం రావడంతో సందీప్, ఆయన భార్య మమత, కుమార్తె హృతిక ఇంటి బయటకు వచ్చారు. చెట్టు కొమ్మలు కారుపై పడే ప్రమాదం ఉండటంతో దానిని వెనక్కి తీసేందుకు సందీప్ ప్రయత్నించారు. భార్య, కుమార్తె బయట నిలబడి కారుకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

### కర్రగా భావించి తాకగా...

ఆ సమయంలో నేలపై పడిన విద్యుత్ తీగకు ప్లాస్టిక్ పైపు చుట్టుకుని ఉండటంతో.. చీకట్లో అది కర్రలా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించని హృతిక దానిని పక్కకు జరపబోయి తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలింది.

కళ్లముందే కుమార్తె విలవిలలాడటం చూసి చలించిపోయిన సందీప్.. ఆమెను కాపాడేందుకు పరుగెత్తారు. అయితే ఆయన కూడా విద్యుత్ తీగకు తగలడంతో తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

భర్త, కుమార్తెను రక్షించేందుకు మమత కూడా ముందుకు వెళ్లగా.. అప్పటికే అక్కడికి చేరుకున్న కాలనీవాసులు ఆమెను అడ్డుకోవడంతో మరో ప్రమాదం తప్పింది.

### "ఫోన్లు చేసినా స్పందించలేదు"

ప్రమాదం జరిగిన వెంటనే కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు 108, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సహాయ ఇంజినీరు, అదనపు సహాయ ఇంజినీరు, విభాగ ఇంజినీరు స్థాయి అధికారులకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

"ఇది ప్రమాదం కాదు.. అధికారుల నిర్లక్ష్యం. ఘటన జరిగిన తర్వాత కూడా విద్యుత్ శాఖ స్పందించలేదు. చివరకు 108 సిబ్బందే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశారు."

హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు పరస్పరం బాధ్యతలు నెట్టేసుకుంటూ ప్రజా ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని స్థానికులు మండిపడ్డారు.



### కన్నీరుమున్నీరైన బంధువులు

సందీప్ తన తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు కావడం, ఆయనకు కూడా ఒక్క కుమార్తె మాత్రమే ఉండటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. "ఒకే కుటుంబంలో రెండు ప్రాణాలు కళ్లముందే పోయాయి" అంటూ బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న అల్వాల్ ఉప కమిషనర్ భోగేశ్వర్లు ఘటనాస్థలిని పరిశీలించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ముందస్తు చర్యల్లో విఫలమైన వ్యవస్థలు

వర్షాకాలం ప్రారంభమైన ప్రతిసారి ప్రమాదకర చెట్లు, తెగిన విద్యుత్ తీగలు, వేలాడుతున్న వీధిదీపాల లైన్లు ప్రజలకు ప్రాణహానిగా మారుతున్నా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక చెట్టు విరిగింది.. ఒక విద్యుత్ తీగ నేలపై పడింది.. కానీ అసలు విషాదం మాత్రం ప్రమాదం కనిపించినా వ్యవస్థ స్పందించకపోవడమే. అల్వాల్‌లో ఆ నిర్లక్ష్యం ఒక తండ్రిని, అతని ఏకైక కుమార్తెను బలిగొంది.

# నకిలీ లేబుళ్లతో ఫార్మా ముడి సరుకు విక్రయ యత్నం

- ఆల్వాల్‌లోని డీకే ఫార్మాస్యూటికల్స్‌పై డ్రగ్స్ నియంత్రణ శాఖ దాడులు
- రూ.70.56 లక్షల విలువైన 240 కిలోల ఔషధ ముడిసరుకు స్వాధీనం
- అసలు లేబుళ్లు తొలగించి.. కల్పిత తయారీ చిరునామాలతో సరఫరా ప్రయత్నం
- నిందితులపై కేసు నమోదు..
- ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం

**ఆల్వాల్, జూన్ 13 (జనంసాక్షి) :** ఫార్మా ముడిసరుకుపై అసలు లేబుళ్లు తొలగించి, కల్పిత తయారీ వివరాలతో అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యవహారాన్ని తెలంగాణ డ్రగ్స్ నియంత్రణ శాఖ అధికారులు బట్టబయలు చేశారు. ఆల్వాల్‌లోని డీకే ఫార్మాస్యూటికల్స్ సంస్థపై నిర్వహించిన దాడుల్లో రూ.70.56 లక్షల విలువైన 240 కిలోల ఔషధ ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు.

### మంగపురం కాలనీలో దాడులు

విశ్వసనీయ సమాచారంతో డ్రగ్స్ నియంత్రణ శాఖ అధికారులు జూన్ 12న ఓల్డ్ ఆల్వాల్‌లోని మంగపురం కాలనీలో ఉన్న డీకే ఫార్మాస్యూటికల్స్ సంస్థలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 20 కిలోల చొప్పున నిల్వ ఉంచిన 12 డ్రమ్‌లలో మొత్తం 240 కిలోల 'హైడ్రాక్సీప్రొపైల్ బెటాడెక్స్ యూఎస్‌పీ/ఎన్ఎఫ్' ఔషధ ముడిసరుకును గుర్తించారు. ఈ ముడిసరుకుపై 'డీకే ఫార్మాస్యూటికల్స్' పేరుతో లేబుళ్లు అతికించినట్లు అధికారులు గుర్తించారు. వాటిపై బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, గడువు తేదీతో పాటు సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో తయారీ యూనిట్ ఉన్నట్లు పేర్కొన్నట్లు వెల్లడించారు.



### కల్పిత చిరునామా వెలుగులోకి...

క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. లేబుళ్లపై పేర్కొన్న తయారీ యూనిట్ అక్కడ లేదని, చిరునామా పూర్తిగా కల్పితమని అధికారులు నిర్ధారించారు. అసలు లేబుళ్లను తొలగించి, తప్పుడు తయారీ వివరాలతో కొత్త లేబుళ్లు అతికించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

### భాగస్వాముల పాత్రపై విచారణ

డీకే ఫార్మాస్యూటికల్స్ భాగస్వాములైన సతీష్ బాబు ధూలపల్లి, నాగస్వామి కట్రగడ్డలు ఈ వ్యవహారంలో పాత్ర ఉన్నట్లు డ్రగ్స్ నియంత్రణ శాఖ అధికారులు గుర్తించారు. అసలు తయారీదారుల వివరాలు మార్చి, కల్పిత తయారీ యూనిట్ పేరుతో ముడిసరుకును మార్కెట్లోకి విడుదల చేసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ముడిసరుకు విలువ సుమారు రూ.70.56 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

నమూనాల సేకరణ

సీజ్ చేసిన ముడిసరుకు నాణ్యతను పరీక్షించేందుకు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిందితులపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం--1940 కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నేరం రుజువైతే గరిష్ఠంగా ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి పనులు చేపడతాం

- బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**నిజాంపేట్, జూన్ 13 (జనం సాక్షి) :** సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట లోని లహరి గ్రీన్ పార్క్ లో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను కల్పిస్తూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ సందర్భంగా లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సునీతా మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తెర అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెలగపూడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, సభ్యులు మురళి, ప్రశాంత్, కాటం శ్రీనివాస్, నాయకులు ఎస్వి.సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డీఏపీ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఫరూక్‌నగర్, జూన్ 13 (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డీఏపీ యాప్ విధానంతో రైతులు, ఫెర్టిలైజర్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నందిగామలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని రైతుల సమస్యలపై గళమెత్తారు. సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రైతులు పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో సరైన శాస్త్రీయ అవగాహన లేకుండా వాడుతున్నారని పేర్కొన్నారు. గతంలో యూరియా దొరకదేమోననే వదంతులతో రైతులు భయాందోళనలకు గురై, పది బస్తాలు అవసరమయ్యే చోట ఇరవై బస్తాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకునేవారని గుర్తుచేశారు. ఈ క్రమంలో యూరియా పంపిణీకి యాప్ విధానం తీసుకురావడంతో ఆ సమస్య చాలా వరకు పరిష్కారమైందని ఆయన తెలిపారు.యూరియా తరహాలోనే ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న డీఏపీ యాప్‌లో అనేక సాంకేతిక లోపాలు టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల డీలర్లు, రైతులు ఎరువులు తీసుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్నప్పటికీ, సామాన్య రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ ద్వారా ఎరువుల వివరాలు నమోదు చేయడంపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన రాలేదని స్పష్టం చేశారు. విధానాలు రూపొందించే అధికారుల అంచనాలకు, క్షేత్ర స్థాయిలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులకు వ్యత్యాసం ఉందన్నారు.రాబోయే సీజన్ నాటికి ఈ యాప్ ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరు, ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి, వారికి యాప్ వినియోగంపై ముందుగా శిక్షణ ఇస్తే.. వారు ఆయా గ్రామాల్లోని మిగతా రైతులకు ఎరువుల కొనుగోలులో సహాయపడతారని ఆయన అధికారులకు ఓ చక్కటి పరిష్కారాన్ని సూచించారు.ఈ కీలక సమావేశంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్లు కే. విజయ్ కుమార్, బి. నరసింహారావు, ఏడీఏ లు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



# ఉప్పల్‌లో గంజాయి విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

- 4.2 కిలోల గంజాయి స్వాధీనం.
- నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్

**ఉప్పల్, జూన్ 13 (జనం సాక్షి) :** ఉప్పల్ పరిధిలో గంజాయి విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక విజయం సాధించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న మల్కాజిగిరి డీసీపీ ఆదేశాల మేరకు, ఏఈఎస్పీ పర్యవేక్షణలో ఉప్పల్ పోలీసులు నిర్వహించిన దాడిలో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లచెరువు కట్ట సమీపంలోని ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షంషీర్ అలీ ఖాన్ (32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతని వద్ద నుంచి 4.2 కిలోల ఎండిన గంజాయి, 1,014 చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసిన గంజాయి, అలాగే ఒక వివో వి29ఈ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నాగ్‌పూర్ ప్రాంతం నుంచి గంజాయిని తెప్పించి, నారపల్లి ప్రాంతంలో నిర్వహిస్తున్న తన ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను కేంద్రంగా చేసుకుని రహస్యంగా విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిసింది. స్థానిక యువతను లక్ష్యంగా చేసుకుని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ లక్షల రూపాయల మేర ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ విధించారు. మాదక ద్రవ్యాల వ్యాపారంపై ఎలాంటి రాజీ ఉండదని, యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ దాడిలో పిడీ ఇన్‌స్పెక్టర్ బి. ఓంకార్ నేతృత్వంలో పోలీసు బృందం కీలక పాత్ర పోషించింది. వారి అప్రమత్తతతో భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం కావడంతో పాటు, అక్రమ మాదక ద్రవ్యాల విక్రయాల ముఠాకు గట్టి దెబ్బ తగిలినట్లు అధికారులు పేర్కొన్నారు.



## కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ అంజయ్య

**కోట్‌పల్లి, జూన్ 13 (జనంసాక్షి) :** కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన వికారాబాద్ డిఎస్పి అంజయ్య. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ మొత్తం పరిశీలించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలు నేరాల నియంత్రణ చర్యలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను సిబ్బంది డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. నేరాల నియంత్రణలో సీసీటీవీల ప్రాముఖ్యత గురించి డీఎస్పీ అంజయ్య సిబ్బందికి వివరించారు. గ్రామాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోట్ పల్లి ఎస్ఐ శైలజ సిబ్బంది పాల్గొన్నారు.



# కోటకొండ రోడ్డు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే, కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం

- రోడ్డు కోసం బీజేపీ, బీఆర్ఎస్ రాస్తారోకో

**నారాయణపేట, జూన్ 13 (జనం సాక్షి) :** నారాయణపేట మండ లం కోటకొండ రోడ్డు ను వెంట నే పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం అని బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు హెచ్చరించారు. అప్పక్‌పల్లి నుంచి కోటకొండ, కోయిల్ కొండ రోడ్డులో అమిరెడ్డి పల్లి, బొమ్మనుపాడ్ మధ్య 4 కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బిజెపి,బి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం కోటకొండ, అభంగపూర్, బందగొండ, తిరుమలాపూర్, ఉంటకుంట తాండా, బోమన్ పాడ్ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అప్పక్ పల్లి వద్ద హైదరాబాద్ రోడ్డుపై భారీ రాస్తారోకో నిర్వహించారు.దాంతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసు లు ,జిల్లా బిజెపి ఉపాధ్యక్షు డు కంచె శ్రీనివాసులు, బిఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీ పీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షు డు వేపూర్ రాములు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అప్పక్ పల్లి నుంచి కోటకొండ మీదుగా కోయిల్ కొండ వరకు డబుల్ రోడ్డు మంజూ రు అయి పనులు జరిగా యని అన్నారు.కానీ అమిరెడ్డిపల్లి నుంచి బొమ్మను పాడు వరకు 4 కిలోమీటర్ల రోడ్డును అసంపూర్తిగా ఉంచారన్నారు. దాంతో గత రెండు ఏళ్లుగా రోడ్డు పూర్తికాక ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో రొద్దు గుంతలమయం అయి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశా రు. ఏ అత్యవసర పరిస్థితి ఉన్న తొందరగా వెళ్లడానికి వీలు కాక గర్భిణీలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 ఏళ్లు కావస్తున్న ఎమ్మెల్యేకు అధికారులకు ఏమాత్రం ఈ రోడ్డుపై పట్టింపు లేదన్నారు. పక్కనే సి ఎం నియోజక వర్గంలో గ్రామ గ్రామానికి డబుల్ రోడ్డు పూర్తి అవు తున్నా కేవలం 4 కిలోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే పట్టించు కోవడం లేదని విమర్శించా రు.వెంటనే రోడ్డు ను పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మె ల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచు లు,బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు,మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.



# బీవీఆర్ఐటీలో విజయవంతంగా ముగిసిన వామ్స్ 2026 అంతర్జాతీయ సదస్సు

**నర్సాపూర్, జూన్ 13 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ అంతర్జాతీయ సదస్సు ఐదు రోజుల పాటు శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ అంతర్జాతీయ సదస్సు లో శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమ--విద్యా సంస్థల పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి అంతర్జాతీయ భాగస్వామ్యాలకు వేదికగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వామ్స్ సలహాదారు డా. సుధాకర్ కె. రావు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి చక్కని సదుపాయాలు మంచి ఆరోగ్యకరంగా పచ్చని వాతావరణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరిగేందుకు ప్రోత్సాహం సహాయ సదుపాయాలు కల్పించిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ కె వి విష్ణురాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వామ్స్ జనరల్ చైర్, బీవీఆర్ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి.ఆర్. సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా, , డా. పి. సతీష్ రామచౌదరి, డా. వి. సమీర్ చక్రవర్తి, బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు. వామ్స్ ప్రతిష్ఠాత్మక అవార్డులు వామ్స్ సదస్సులో అత్యున్నత గౌరవం గా భావించే డా. సుధాకర్ రావు స్పెషల్ రికగ్నిషన్ అవార్డు" ను రూ. 1,00,000 నగదు బహుమతితో ప్రొఫెసర్ సమీర్ చక్రవర్తి వేదుల ప్రొఫెసర్ పి. సతీష్




రామచౌదరిలకు సంయుక్తంగా అందజేశారు. వామ్స్ సదస్సు అభివృద్ధికి మరియు ఇంజనీరింగ్ సమాజానికి వారు అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా, రూ. 50,000 నగదు బహుమతితో కూడిన డా. సుధాకర్ రావు బెస్ట్ పేపర్ అవార్డు"ను అహ్మదాబాద్‌లోని ఇస్రో--స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ కు చెందిన రోహిత్ నంద్వానీ గారికి ఆయన అత్యుత్తమ పరిశోధన కృషికి గాను ప్రదానం చేశారు. యాంటెన్నా రూపకల్పన, వైర్లెస్ కమ్యూనికేషన్, రంగాలలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు డా. సి. జె. రెడ్డి, డా. నాసర్ చాహట్ , డా. జోనాథన్ సాడర్, నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ, అమెరికాకు చెందిన వారికి ప్రొఫెసర్ లాట్ షఫాయ్, డా. డెస్మండ్ సిమ్, డా. జయశ్రీ కులకర్ణి మరియు డా. జుబైర్ అక్తర్ వారి పరిశోధన రంగాలలో 10 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు నగదు బహుమతి పొందటం జరిగింది. సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా 60కి పైగా ప్రతిష్ఠాత్మక అవార్డులను సదస్సులో ప్రదానం చేశారు. బివిఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, పరిశోధనలో నూతన ఒరవడిని ప్రోత్సహించడం, ముఖ్య ఉద్దేశమని తెలియపరిచారు. ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ వామ్స్ ద్వారా బీవీఆర్ఐటీ కి అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరిగిందన్నారు. ఈ సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో బీవీఆర్ఐటీ యాజమాన్యం, డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు, పరిపాలనా సిబ్బంది, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) బి. బాపిరాజు మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కీలక పాత్ర పోషించారు. వామ్స్ ని విజయవంతంగా నిర్వహించిన బీవీఆర్ఐటీ యాజమాన్యానికి ఐఈఈఈ యాంటెన్నాస్ అండ్ ప్రొపగేషన్ సొసైటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో జాతీయ అంతర్జాతీయ దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ రంగ నిపుణులు, ప్రతిష్టాత్మకమైన విద్య సంస్థల అధ్యాపకులు విద్యార్థులు, ఇస్రో, సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

## పాటల పల్లకిలో ఉద్యమ పాట సిడి ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**కోహెడ, జూన్ 13 (జనంసాక్షి) :** హుస్నాబాద్ మంత్రి కార్యాలయంలో ఉద్యమ కవి గాయకులు శ్రీ నేర్నాల కిషోరన్న నేతృత్వంలో శనివారం పాటల పల్లకిలో ఉద్యమ పాట (సాంస్కృతిక సారథి చేరే వరకు కొనసాగుతూనే ఉంటుంది) పాటల పల్లకి సీడిని రాష్ట్ర రవాణా, బి సీ సంక్షేమ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అనేక ధూంధాం వేదికల మీద ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులు చేసి ఉద్యమ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులకు గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన కళాకారులకు న్యాయం చేసి సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని పాటను రూపొందించిన జరిగిందని పొన్నాల అశోక్ అన్నారు. ఈ పాటను కోహెడ మండలానికి చెందిన ధూంధాం కళాకారుడు పొన్నాల అశోక్ స్వీయ రచనలో గాయకులు గజ్జల వినోద, మంద మహేందర్, మ్యూజిక్ ఎర్రవెల్లి శ్రీనివాస్, ఎడిటింగ్ టీనా రవి హుస్నాబాద్ ప్రాంత ఉద్యమ కళాకారులు రూపొందించిన సీడీ ని ఆవిష్కరించారు. హుస్నాబాద్ ప్రాంత కళాకారులు, అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉద్యమ కళాకారులకు సముచిత స్థానం కల్పించి ఆదుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రాంత కళాకారులు తాడూరి సురేష్, కళ్ళేం లక్ష్మణ్, మామిడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'పై అవగాహన కలిగి ఉండాలి



**కేటీదొడ్డి, జూన్ 13 (జనం సాక్షి) :** ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై చేపట్టిన 'సర్' కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గాజులపాడు రాఘవేంద్రరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు శనివారం కేటిదొడ్డి మండల కేంద్రంలో మండల స్థాయి సభ్యత్వ నమోదు బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ముందుగా గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు 7వ వర్ధంతి సందర్భంగా 2 నిముషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బీఎల్ఏల బాధ్యతలు, విధులపై స్పష్టత తీసుకురావడం, సర్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఐర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. బీజేపీకి అనుకూలంగా లేనిచోట ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ఇప్పటి వరకు ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు గల్లంతైన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ దొంగ ఓట్లను వేయించే పరిస్థితి ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబుల్ ఓట్లను ఏరివేయడంతో పాటు ఏదో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చూడాలని తెలిపారు. కె.టీ.దొడ్డి మండలంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేటిదొడ్డి మండలం సభ్యత్వ నమోదులో ముందుండే విధంగా చర్యలు తీసుకుందామని అందుకు నాయకులు, కార్యకర్తల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, చక్రధర్ రావు సోమశేఖర్ రెడ్డి, చక్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటన్న, సూర్యప్రకాశ్, నరసింహులు, జగదీష్, నక్క రవి, సురేష్, కృష్ణారెడ్డి, వీరారెడ్డి, గోవిందు, రవి, ప్రహ్లాద్, శ్రీకాంత్, నాగరాజు, రవి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సామజిక న్యాయం రాజ్యాధికారం కోసం ఛలో మహబూబ్‌నగర్

- ఈ నెల 14న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభ
- బీసీ, ఎస్సి, ఎస్‌టి రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 13 (జనం సాక్షి) :** రాజ్యాధికారం సాధనే ధ్యేయంగా ఈ నెల 14న పాలమూరు జిల్లాకేంద్రంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసి నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎవరి కులం ఎంతో వారికీ అంత వాటా రావాలని ఈనెల 14 న ఆదివారం సాయంత్రం 04:00 గంటలకు భాయ్స్ కాలేజ్ గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి తోట్ల




రాఘవేంద్ర ముదిరాజ్, గుడిసె బాలయ్య ముదిరాజ్ , రాష్ట్ర నాయకులు సారంగి లక్ష్మి కాంత్ లు పిలుపునిచ్చారు. తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ మాట్లాడుతూ రాష్టంలో బిసి, ఎస్సి, ఎస్టీలు ఐక్యత కావాలన్నారు. కావున జిల్లాలోని భారీగా బీసీ ఎస్సి ఎస్‌టిల ప్రజలు తరాలని రావాలని నాయకులు కోరారు. విశారాధన్ రాష్ట్రము లో బీసీ ఎస్సి ఎస్టీ ప్రజలను చైతన్య పరుస్తూ రాష్ట్రములో ప్రతిపక్షంగా నిలిచారాని కోరారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల భూములు లాక్కొని ఇబ్బంది పెడుతున్నారు అని అన్నారు. రాష్ట్రము లో బిసిలకు 42 % రిజర్వేషన్ లు అమలు చెయ్యకుండా దోబూచులాడుతుందని అన్నారు . అలాగే 42% రిజర్వేషన్ అమలు కోసం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ దగ్గర దర్న నిరసన కార్యక్రమం చేశామని ఈసందర్భంగా బీసీ ఎస్సి ఎస్టీ లను ఐక్యం చేశామని వారు తెలిపారు. రాబోయే కాలంలో తెలంగాణ గడ్డ పైన బీసీ ఎస్సి ఎస్టీల రాజ్యం రావాలని వారు పిలుపునిచ్చారు. అలాగే ప్రతిపక్షం లేని రాష్టం గా నెలకొన్నదని ప్రతి పక్ష పాత్ర బీసీ ఎస్సి ఎస్టీల (జెఎసి) పని చేస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమం లో బీసీ ఎస్సి ఎస్టీ రాష్ట్ర నాయకులు , సారంగి లక్ష్మి కాంత్, జాంద్రా సంఘం బాలరాజ్, పాలమూరు యూనివర్సిటీ తయాప్ప, తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**మక్తల్, జూన్ 13 (జనంసాక్షి) :** స్థానిక నారాయణపేట చౌరస్తాలో నిర్మించబడినటువంటి బిఆర్ఎస్ పార్టీ జెండా కట్టపై చెప్పు గుర్తు దిచ్చిన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక పోలీస్ ఇన్స్పెక్టర్ రాజుకు ఫిర్యాదు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య ములో ఇది మంచి పద్ధతి కాదని ఇలాంటి చర్యలకు ఎవరు పాడిన వాళ్ళని ఉపేక్షించ అవసరం లేదని వారిపైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం ఉన్నప్పుడు ఈ నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక మాజీ శాసనసభలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఎంతో అభివృద్ధి చేసిన విషయాన్ని ఆ దుండగులు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. దమ్ము ధైర్యం ఉంటే ముందు వచ్చి కొట్లాడాలి తప్ప చేతగాని దద్దమ్మలు ఇలాంటి చర్యలకు పాలు పడితే ప్రజలే వారికి తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని వారు తెలిపారు. మక్తల్ లో ఇలాంటి సాంప్రదాయము గతము లేదని కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఇది ప్రారంభమైందని ఇలాంటి చర్యలకు పాలు పడితే బిఆర్ఎస్ పార్టీ ప్రతి చర్యలకు సిద్ధమవుతుందని దీనిని గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరో గుర్తుతెలియని దుండగులు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని వారు హెచ్చరించారు.




నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆధారనను చూసి ఓర్వలేకనే దుండగులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. పోలీసులు వెంటనే ఆ దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ మాజీ మండల అధ్యక్షుడు ఏ మహిపాల్ రెడ్డిపట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు చిన్న హనుమంతు మాజీ కౌన్సిలర్ అన్వర్ హుస్సేన్, సీనియర్ నాయకులు జట్ల శంకర్, కొత్త గర్లపల్లి నరసింహారెడ్డి, ఉప్పరి రఘు, రామలింగం, కృష్ణ యాదవ్, జుట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో ముందుంటాం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హన్మంత రావు

**పాపన్నపేట, జూన్ 13 (జనంసాక్షి) :** మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా పేద ప్రజలకు సేవా చేస్తున్నట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారానికి వేలాది బోర్లు వేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రజా సేవాలో ముందుంటామని స్పష్టం చేశారు. శనివారం మండలం లోని ఎల్లాపూర్, కుర్తివాడ పలు గ్రామాల్లో బోర్లకు మోటర్లు సామాగ్రి అందజేసి ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్, కిసాన్ సెల్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, మండలాధ్యక్షుడు నీరుడి వెంకటేశం, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్, సర్పంచులు..పుట్టిశేఖర్, అంజయ్య, విజయ దుర్గా నాని, నాయకులు కిష్టయ్య, గౌస్, ఖలీమ్, దోసని సంగమేశ్వర్, అనుదీప్, చోటు, వినేష్ గౌడ్, కుమ్మరి శంకరయ్య, ఏసు తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన హామీ మేరకు పీఆర్‌సీ అమలు చేయాలి

- పాఠశాలలను కుదించే ఆలోచన వదులుకోవాలి
- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

**నారాయణఖేడ్, జూన్ 13 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి .లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ జేఏసీ (౧+జుజీూజ)కి ఇచ్చిన హామీ మేరకు జూన్ నెలాఖరు వరకు పిఆర్సి నివేదిక బహిర్గతపరిచి వెంటనే పిఆర్సి అమలు చేయాలి. దాన్ని విస్మరించి పిఆర్సి నివేదిక ఇవ్వడాన్ని వాయిదా వేయడం సమంజసం కాదు. దీన్ని టీఎస్ యుటిఎఫ్ తీవ్రంగా ఖండించింది. జూన్ నెలాఖరు వరకు నివేదిక ఇచ్చి అమలు పిఆర్సి అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్టంలో ఉన్న పాఠశాలల సంఖ్యను 27,000 నుండి 4000 కుదించాలని ప్రయత్నం చేస్తుంది. ఈ విధానం సమంజసం కాదు, ప్రతి గ్రామపంచాయతీకి ఒక పాఠశాల తప్పకుండా ఉండేవిధంగా, ప్రతి ప్రాథమిక పాఠశాలకు సరిపడా ఉపాధ్యాయులను నియమించి సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలి, మేము 57 అమలు చేయాలి, ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీల షెడ్యూల్ ఆగస్టులోపు ఇచ్చి పర్యవేక్షక పోస్టులు డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జేఎల్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. -సమావేశంలో ఆవేరకు పలు తీర్మానాలు ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు




కే అశోక్ ప్రధాన కార్యదర్శి గుడి సాయిలు ఉపాధ్యక్షులు ఏం. సువర్ణ విజయ కాశీనాథ్ కోశాధికారి పి శ్రీనివాసరావు కార్యదర్శులు బి. అరుణశ్రీ, ఎం. అమరేశ్వరి, బి ఏశప్ప, బి. సాయి తేజ, ఎం. నరేష్, ఎ .జగన్మోహన్, ఆర్ సింహాచలం, సిహెచ్. విట్టల్ కే.హరి సింగ్, ప్రశాంత్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు టీఎస్ యుటిఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ నేతగా ఎదిగిన ప్రధాని మోడీ

- ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 13 (జనం సాక్షి) :** ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసం, అభివృద్ధి, సంక్షేమం అనే సూత్రంతో పని చేసి నేడు ప్రపంచ నేతగా ఎదిగా రని బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ వి ఎన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కే. రతంగ్ పాండురెడ్డి, బి. కొండయ్య, పగుడాకుల శ్రీనివాసులు, జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ లతో కలిసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ముందు దేశం తరువాత అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అలుపెరగక పని చేస్తూ 12 ఏళ్లుగా అతిపెద్ద ప్రజాస్వా మ్య దేశం అయిన భారత ప్రధానిగా రికార్డులు సృష్టిస్తూ కొనసాగుతున్నారని అన్నారు. గత ప్రభుత్వాల్లో అనేక స్కాములు జరిగాయని కేంద్రమంత్రులు, ఎమ్మెల్యేలు జైలు జీవితం గడిపారని అన్నారు. కానీ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో నేడు ప్రతి పక్షాలతో సహా మీడియా కూడా తప్పు పట్టని స్వచ్ఛ మైన పాలన




అందిస్తున్నారని అన్నారు. దేశ రక్షణకు ప్రాధాన్యమిస్తూ స్వదేశీ పరిజ్ఞానంతో మిస్సైల్స్ వరకు ఉత్పత్తి చేసి సత్తా చేస్తారని తెలిపారు. అలాగే ప్రధానంగా రోడ్లు అభివృద్ధి చెందితే ప్రజలు అన్ని రకాలుగా బాగుంటారని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి తీసుకు వచ్చిన సడక్ యోజన కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో రోజుకు దేశ వ్యాపారంగా 35 కిలో మీటర్ల హైవే రోడ్లు పనులు సాగుతున్నాయని అన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే స్వాతంత్రం వచ్చిన గత 70 ఏళ్లలో జరుగని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల సంక్షేమం విషయంలో ఉచిత పథకాలు అమలు చేయకుండా సబ్సిడీలు ఇస్తూ ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తున్నారని అన్నారు. కేవలం అధికారం కోసం ఉచిత హామీలు ఇస్తూ ఖజానా ఖాళీ చేశారని ఇండియా కూటమి పార్టీలను విమర్శించారు. ఏ పార్టీ మతరాజకీయాలతో మనుగడ సాధించలేవని అన్నారు. అదే సూత్రంతో ప్రధాని నరేంద్రమోడీ దేశం, అభివృద్ధి, సంక్షేమం స్పూర్తితో దేశాన్ని ముందుకు తీసుకొని పోతున్నారని అన్నారు. ప్రజలకు కావాల్సింది ఉచిత విద్య వైద్యం అన్నారు. వాటి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కోవిడ్ సమయంలో అతి పెద్ద జనాభా ఉన్న భారతదేశంలో ప్రజలు కుప్పతెప్పలుగా చనిపోయారని వివిధ దేశాలు భావించాయని కానీ స్వదేశీ పరిజ్ఞానంతో కొవిడ్ వ్యాక్సిన్ తయారు చేసి దేశ ప్రజలను కాపాడుతూ ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ పంపి ఆదుకున్నారని అన్నారు. చరిత్రను మరువద్దని మరిస్తే పతనం తప్పదని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా, పట్టణ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి




**మఖ్తల్, జూన్ 13 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలోని 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన మొహమ్మద్ గౌస్ ని ఎన్కౌంటర్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం టౌన్ లో మొహమ్మద్ గౌస్ చేతిలో లైంగిక దాడికి గురి అయి నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలిక హెల్త్ బులిటన్ ని రెగ్యులర్ గా విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా తక్షణ ఖర్చుల కింద బాధ్యత కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వడంతో పాటు బాలిక పేరుపైన కోటి రూపాయలు బ్యాంకులో డిపాజిట్ చేయాలి. బాలిక తల్లి లేదా తండ్రి విద్యార్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. మహ్మద్ గౌస్ పై జ్యూడిషియల్ ఎంక్వయిరీ చేసి ఉరి తీయాలని నారాయణపేట జిల్లా బజరంగ్ దళ్ కో-కన్వీనర్ పి, భీమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ మక్తల్ ప్రఖండ సంయోజక్ రాహుల్, సాహ సంయోజక్ మూర్తి, నాగరాజు మండల గోరక్ష సంయోజక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని నాశనం చేసి ఇప్పుడు పరిరక్షణ అంటున్నారా?

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఫైర్
- డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులు సిద్ధిపేటకు మళ్లించారని ఆరోపణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణిని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పరిరక్షకులుగా మాట్లాడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా మార్చే సంస్కృతి కేసీఆర్ కుటుంబానికే చెల్లుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆదాయ వనరుగా కాకుండా దోపిడీ కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. అందినకాడికి దోచుకుని ఇప్పుడు సింగరేణి కోసం ఆవేదన వ్యక్తం చేయడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమే అని ఎమ్మెల్యే అన్నారు. భూపాలపల్లికి రావాల్సిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం యాద్రికి తరలించారని చెప్పారు. ప్రాజెక్టు వ్యయాలు అమాంతం పెంచి వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. నాసిరకం సామగ్రి, అవినీతి నిర్మాణాలతో ప్లాంట్‌ను పనికిరాని స్థితికి చేర్చారని మండిపడ్డారు. సింగరేణి పరిధి ప్రజల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సిద్ధిపేట, హైదరాబాద్‌కు తరలించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వెల్లడించారు. గనుల వల్ల ఇబ్బందులు పడుతున్న భూపాలపల్లి ప్రజలకు న్యాయం చేయకుండా నిధులు మళ్లించారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్ రావు భూపాలపల్లి పర్యటనలో సింగరేణిపై మాట్లాడడం విడ్డూరమన్నారు. సింగరేణిని బలహీనపరిచిన వారే ఇప్పుడు నీతులు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో రాష్ట్రం నష్టపోయిందన్నారు. ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పారని, తప్పులు అంగీకరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దివాళాకోరుతనమని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఐఎన్టీయుసీ నాయకులు పసునూటి రాజేందర్, బేతెల్లి మధూకర్ రెడ్డి, రత్నం సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నాం

- త్వరలోనే గ్రంథాలయానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తా : మంత్రి జూపల్లి కృష్ణారావు
- చిక్మన్ ప్రాజెక్టు మరో రూ.20 కోట్లు మంజూరు
- ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన మంత్రి
- మారుమూల గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**సిరికొండ, జూన్ 13 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం పట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలతో పాటు పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని రాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సిరికొండ మండలం రిమ్మ గ్రామానికి ఆదర్శ గ్రామంగా ఎంపికై ప్రభుత్వం నుండి గ్రామానికి 153 ఇందిరమ్మ ఇల్లులు మంజూరు కాగా సకాలంలో 69 ఇల్లుల నిర్మణ పనులు పూర్తి చేయడంతో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా నాలుగు ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు చెడు అలవాటులకు బానిసలు కాకుండా మంచి చదువులు చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేల చదువులు చదివించాలని సూచించారు. మండల కేంద్రానికి చెందిన ప్రజల పలు సమస్యలపై వినతి పత్రాలు సేకరించుకొని వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చూపిస్తానని ఆయన అన్నారు. మండల కేంద్రానికి గ్రంథాలయం లేదని సమస్య విన్నవించారు. గ్రామానికి ప్రాజెక్టు, సరైన రోడ్డు లేకపోవడంతో రిమ్మ మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామానికి చెందిన పలు సమస్యలను వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారోస్తా అనుకూలంగా స్పందించి మండల కేంద్రానికి గ్రంథాలయానికి త్వరలోనే రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**మారుమూల గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి, జిల్లా సార్మేడి తొడసం అమృత్ రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో ఎల్‌వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రం ప్రారంభం

**నిర్మల్ బ్యూరో, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మల్ పట్టణంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ – కూచాడి సత్యమ్మ ప్రకాశ్‌రావు కంటి పరీక్ష కేంద్రాన్ని శనివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిర్మల్‌లోనే కంటి పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కేంద్రం ద్వారా ప్రారంభ దశలోనే కంటి సంబంధిత సమస్యలను గుర్తించి తగిన వైద్యం పొందవచ్చని తెలిపారు. క్లిష్టతరమైన నేత్ర సమస్యలు ఉన్నవారు హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణుల సేవలను పొందేలా ఈ కేంద్రం వారధిగా పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో ఇటువంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# రోబోటిక్స్ తయారీలో మదర్ తెరిసా విద్యార్థుల ప్రతిభ



- పలు రోబోటిక్స్ ప్రదర్శించిన విద్యార్థులు
- విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం

**వరంగల్ బ్యూరో ,జూన్ 13 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ శంభునిపేటలో గల మదర్ తెరిసా హై స్కూల్ విద్యార్థులు రోబోటిక్స్ తయారీలో తమ ప్రతిభను కనబరిచారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో తాము తయారు చేసినటువంటి రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిదవ తరగతికి చెందిన మేఘవర్ణ, ఏడవ తరగతికి చెందిన రిషిక, ఆరవ తరగతికి చెందిన గంగోత్రి విద్యార్థులు సివిట్రానిక్స్ కంపెనీ ద్వారా వచ్చినటువంటి రోబో కిట్ల ద్వారా రోబోటిక్స్ తయారు చేశారు. ప్రధానంగా సర్వ్ మోటర్, కాంపోనెంట్ ఆఫ్ మోటార్, లైట్ సెన్సార్, ఆటోమేటిక్ డ్రాయర్ లైట్స్, ఫ్రంటు బ్యాక్ వీల్ సెన్సార్, మొదలైన రోబోలను తయారుచేసే విజయవంతంగా ప్రదర్శించారు. విద్యార్థులు ఒక్కరోజులోనే వీటిని తయారుచేసి తమ ప్రతిభను చాటారు. పాఠశాలకు చెందిన సైన్స్ టీచర్ వీరికి గైడ్గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇన్ఫినిటో సంస్థ చైర్మన్ గౌరీ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు హైదరాబాదులోని సివిట్రానిక్స్ సంస్థ ద్వారా సుమారు రెండు లక్షల రూపాయల విలువైనటువంటి 15 రోబోటిక్స్ కిట్స్ విద్యార్థుల కోసం తీసుకొచ్చినట్లు చెప్పారు. విద్యార్థులను శాస్త్ర సాంకేతిక పరంగా విజ్ఞానం అందించే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బింగి అరుణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 17న మెగా జాబ్ మేళా

- ఉద్యోగం మీ లక్ష్యమైతే - అవకాశం మీ ముందే..
- 70కి పైగా కంపెనీలు... వేలాది ఉద్యోగ అవకాశాలు....
- జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్

TQRCG



**ములుగు బ్యూరో,జూన్13(జనం సాక్షి):** గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి వారి కుటుంబాల భవిష్యత్తును వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ములుగు జిల్లా పరిపాలన యంత్రాంగం కలిసికట్టుగా "మెగా జాబ్ మేళా 2026" జూన్ 17 న ఇంచర్ల గ్రామం నందు గల ఎంఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు జాబ్ మేళా నిర్వహించబోతున్నారు. ఈ మెగా జాబ్ మేళాకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల గౌరవ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క)ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ కార్యక్రమం 2026 జూన్ 17వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి ములుగు పట్టణంలోని ఎంఆర్ గార్డెన్స్, ఇంచర్లలో నిర్వహించబడుతుంది.ఈ జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇంజినీరింగ్, టెక్నికల్,ఫార్మసీ,స్కిల్డ్ వర్క్, సర్వీస్, ఇతర పలు రంగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నారు.ఈ ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ సిటీ లోనే కాకుండా ప్రాంతీయ జిల్లాలలో సైతం అవకాశాన్ని బట్టి కంపెనీలు ఎంపిక చేయడం జరుగుతుంది.

**ఉద్యోగ అర్హతలు :** 7వ తరగతి ఉత్తీర్ణులై,ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ మరియు సమాన అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిపాలన కోరుతోంది. అభ్యర్థులు తమతో పాటు నూతన (ప్రస్తుత )బయోడేటా (రెస్యూమ్), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు ఇతర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా తీసుకురా వాలని సూచించారు. గ్రామీణ యువత తమ ప్రతిభను చాటుకునేం దుకు, మంచి ఉద్యోగాన్ని సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరు చుకునేందుకు ఇది ఒక అరుదైన అవకాశం అని అధికారులు తెలిపారు.మరిన్ని వివరాల కోసం: డీఎస్పీ ములుగు 8712670103, సీఐ ములుగు: 8712670 111 సంప్రదించగలరు.ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకోగలరు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మోడీ 12 ఏళ్ల పాలన స్వర్ణయుగం

- తెలంగాణకు కేంద్రం ప్రాధాన్యత ఇవ్వబట్టే రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ
- గుజరాత్ తరహా అభివృద్ధి తెలంగాణలో సాధిస్తాం
- బీజేపీ నేతలు జయశ్రీ, వెంకటరమణ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన భారత జాతి గర్వించేలా సాగిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణలు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భాజపా కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరై మోడీ ప్రభుత్వ విజయాలు వివరించారు. మోడీ పుష్కరకాల పాలనను ఎలాంటి మచ్చ లేకుండా పూర్తి చేశారని నేతలు పేర్కొన్నారు. భాజపా నాయకత్వంలో దేశానికి సుస్థిరమైన, ప్రజాకేంద్రిత పాలన లభించిందన్నారు. భారత చరిత్ర, సంస్కృతి, విశ్వాసాలు ప్రపంచానికి తెలిసేలా చేశారని కొనియాడారు. ఒకప్పుడు ఆర్థిక సంక్షోభంలో ఉన్న భారత్ నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమైందన్నారు. కాపిటల్ ఎక్స్‌పెండిచర్ భారీగా పెరగడంతో మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. కోట్లాది మరుగుదొడ్లు నిర్మించి మహిళల గౌరవం కాపాడారని, నాలుగు కోట్ల ఇళ్లు కట్టి పేదల సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. కరోనా సమయంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.6,000 సహాయం, ఎరువులపై భారీ సబ్సిడీలు ఇస్తున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధికి భాజపాకు అవకాశం ఇవ్వాలని, గుజరాత్ తరహా అభివృద్ధి సాధిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోడీ మరిన్ని సంవత్సరాలు దేశానికి సేవ చేయాలని ప్రార్థించారు. ఈ సమావేశంలో మాజీ కార్యవర్గ సభ్యులు కన్నం యుగదీశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాటికొండ రవి కిరణ్, దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి భూక్య భాగ్య, కార్యాలయం కార్యదర్శి వట్టెం తిరుపతి, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గయ్య పాల్గొన్నారు.



## మృతి చెందిన అడవి దున్నకు పోస్ట్ మార్టం

**గూడూరు, జూన్ 13 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు సెక్షన్ పరిధిలోని ఊట్ల భీటు పరిధిలో శనివారం ఫారెస్ట్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎర్రదిబ్బలు సమీప ప్రాంతంలో అడవిదున్న చనిపోయి ఉన్న, దానిని చుసిన సిబ్బంది గూడూరు ఎఫ్ఆర్‌ఓ ప్రసాద్ రావు కు తెలియజేసిన వెంటనే భూపతిపేట పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. రాజేందర్‌ను అక్కడకు తీసుకొని వెళ్లిన అనంతరం వారి సమక్షంలో పోస్ట్ మార్టం నిర్వహించామని తెలిపారు.అనంతరం దానిని పరిశీలించగా దానికి గాయలేమి లేవని అది సహజ మరణమేనని,దాని వయస్సు 7-8 సంవత్సరాలు ఉంటుందని, పంచనామా అనంతరం కాలేయం,గుండె, ఇతర నమూనాలను సేకరించి, వాటిని భద్రపరిచి వరంగల్ ల్యాబ్ కు పంపించడం జరిగిందని,తుది నివేదిక అనంతరం మరణానికి కారణాలు తెలియజేస్తామని ఎఫ్ఆర్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 20 వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**పాలకుర్తి, జూన్ 13(జనంసాక్షి) :** మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే లబ్దిదారులు ఈ నెల 20 వరకు పూర్తి చేయాలని పాలకుర్తి నియోజకవర్గం హౌజింగ్ శాఖ డీఈ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే లబ్దిదారులు వారం రోజుల్లో పూర్తి చేయాలని, పూర్తయిన ఇండ్లకు ప్లాస్టరింగ్, డోర్లు, సున్నం వేస్తే ఫైనల్ బిల్లు ఇస్తామని తెలిపారు. ఆయన వెంట హౌజింగ్ ఏఈ రోహిత్ ఉన్నారు.

# చల్లగరిగలో భారీగా నిషేధిత పదార్థాలు స్వాధీనం



**చిట్యాల, జూన్ 13 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని చల్లగరిగ గ్రామంలో శనివారం ఉదయం కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా శోధించిన పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు కీలక చర్యలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా గుడుంబా, నిషేధిత పదార్థాలు విక్రయిస్తున్న కేతిరి సదయ్య,శ్రీపతి బిక్షపతి,బామర్ హీరా సింగ్ లను గుర్తించి కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల తయారు చేసిన గుడుంబాతో పాటు, దాదాపు 300 లీటర్ల గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన పానకాన్ని పోలీసులు గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ప్రభుత్వం నిషేధించబడిన సుమారు రూ.4,398 విలువగల అంబర్, గుట్కా నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సిఐ, ఎస్సై మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే గుడుంబా వంటి వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పోచంపల్లి సతీష్‌తో పాటు, ఎస్ఐ-2 రాజన్, ఎస్ఐ-3 ఈశ్వరయ్య, కానిస్టేబుల్ లాల్ సింగ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నాబార్డ్ నూతన జిల్లా అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం



**జనగామ, జూన్ 14 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి నూతన కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బి. ఉదయ్ భాస్కర్, నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయ ప్రధాన మహా ప్రబంధకులు, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యనారాయణ మూర్తి, డీఆర్‌డీఏ నూర్ ఉద్దీన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ ఉదయ్ ముక్తాపురం, వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యనిర్వాహణ అధికారి వజీర్ సుల్తాన్ పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుగా మారి సంస్థ డైరెక్టర్ జయరామారావు, వెంకట్, సిరి-శ్రీనివాస్, కొమురయ్య, స్పందన సంస్థ సోమయ్య, శాంతి సంస్థ సుధాకర్ హాజరయ్యారు.

# పాఠశాలలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్లు బంద్



**ములుగు/ వెంకటాపూర్, జూన్ 13(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంటలో పైప్‌లైన్ క్లియర్ లేక కొన్ని రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. నల్లగుంట గ్రామంలో రోడ్డు కు అవుతుల వైపు నుంచి నీళ్లు మోయాల్సిన పరిస్థితి వచ్చింది.నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు మొత్తుకున్నా మిషన్ భగీరథ అధికారుల జాడ మాత్రం లేదు.బాకెట్ల లో నీళ్ళు నింపాలనంటే ఇంకో పని అవసరం లేదు.అక్కడే నిలబడి ప్రతి నీటి చుక్క ను అదిమిపట్టి బాకెట్లో నింపి తీసుకురావాల్సిన పరిస్థితి ఉంది.అధికారులు కోసం ఆఫీసు వెళ్తే ఆఫీసు లో ఉండరు.వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోరు.ములుగు జిల్లా లోని కొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నీళ్లు వచ్చిన చిన్న డబ్బా పెట్టుకొని లోటా తో బకెట్లు నింపుకోవాల్సిన పరి స్థితి వస్తుంది. అధికారులు స్పం దించి వెంటనే మిషన్ భగీరథ నీళ్ల సమస్యను తీర్చాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం సమంజసం కాదు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) : రాష్ట్రంలో కేటీఆర్‌కి అధికారం పోయినాక మండలాలు,గ్రామాల సమస్యలు గుర్తుకువస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడలో బిఆర్ఎస్ శ్రేణులను ఉత్తేజ పరచడానికి సమావేశం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. కేటీఆర్ కల్వకుంట్ల కుటుంబశీ అధికారం కోల్పోయిన కానీ జరిగిన తప్పులను సమీక్ష చేసుకోకుండా మళ్ళీ వేములవాడలో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వము సంక్షేమ అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.గత ప్రభుత్వ హయంలో కాని పనులు ప్రజా ప్రభుత్వం చేస్తున్నందుకు అభినందనలు చెప్పాల్సింది పోయి అభివృద్ధి ఎక్కడ జరుగుతుంది అనడం సరైనది కాదన్నారు.గత ప్రభుత్వం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థిక దివాళా చేశారని,50 సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేయానీ అప్పును కేసీఆర్ కేవలం 10 సంవత్సరాలలో చేశారన్నారు.ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తిలు కడుతూ రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ పనులు కొనసాగిస్తుందన్నారు. జీవన్ రెడ్డి సభలో అన్ని అబద్ధాలు మాట్లాడరని ఆయన ఆరోపించారు. వరద కాల్వ జీవనదిల కేసీఆర్ హయాంలో ఉందని అబద్ధాలు చెప్పారని, జీవన్ రెడ్డి మాటలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మ గోసిస్తుందన్నారు.ఆనాడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నరని,కాళేశ్వరం ద్వారా వరద కాల్వ జీవనదిల ఉందని అబద్ధాలు చెప్పడం ఎంతవరకు సరైనదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు కొరకు నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు సూచన మేరకు మేము కాళేశ్వరం నిర్మాణం చేస్తున్నమన్నారు. వారి ఆదేశాల ప్రకారం అధికారులు నిర్మాణం చేస్తారన్నారు.కేటీఆర్ నువ్వు 10 సంవత్సరాల్లో చేయని పనులు ప్రజా ప్రభుత్వంలో చేస్తున్నమన్నారు. తుమ్మడి హట్టి ప్రాజెక్ట్ పై కూడా జీవన్ రెడ్డి శుద్ధ అబద్ధాలు చెప్పారని ఆయనపై మండిపడ్డారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు రూ 1737 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు ఆనాడు మల్యాల లో జరిగిన సమావేశంలో మీరు మా పక్కనే ఉన్నారు కదా అని ప్రశ్నించారు.జీవన్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో చేరారని,మీకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అవకాశాలు ఇచ్చిందన్నారు.మీరు లేకుంటే కాంగ్రెస్ పార్టీ లేదా,ఆనాడు మీరు మాతో కలసి కలికోట సూరమ్మ చెరువు కోసం ధర్నాలు చేసింది మర్చిపోయారా,సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గశీలో కాంగ్రెస్ జెండా ఎగరడం కాయమన్నారు.ఆనాడు బిఆర్ఎస్ పార్టీని తిట్టని తిట్లు తిట్టిన జీవన్ రెడ్డి నేడు వారిని పొగుడుతున్నారు.గత ప్రభుత్వ హయాంలో వేములవాడ ప్రాంతంలో ఒక్క ప్రాజెక్ట్ కూడా పూర్తి కాలేదన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో రాజన్న ఆలయ అభివృద్ధి,రోడ్డు వెడల్పు, బ్రిడ్జి నిర్మాణ పనులు,కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తిగా సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో బిఆర్ఎస్ నాయకులు బీజేపీపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు.బిజెపి బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం అన్నారు.పది సంవత్సరాలలో వేములవాడ వెనుకబాటుకు గురైందని, ప్రజా ప్రభుత్వం పాలనలో నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ తూము మధు,కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్,కుమ్మరి శ్రీనివాస్,తోట రాజు, శ్రీనివాస్, కో ఆప్షన్ నెంబర్ పీర్ మహమ్మద్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, కాంగ్రెస్ నాయకులు బింగి మహేష్, కూరగాయల కొమురయ్య, నామాల పోశెట్టి, చిలుక రమేష్, పాత సత్యలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ



భద్రాచలం, జూన్ 13 (జనంసాక్షి) : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని వైటీసీ శిక్షణా కేంద్రంలో 18 నుంచి 33 సంవత్సరాల వయస్సు కలిగిన గిరిజన యువతకు ఉపాధి నైపుణ్యం కోర్సులైన కంప్యూటర్, బ్యూటిఫికేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరే వారికి ఉచిత భోజనం, వసతి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆయనన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 20వ తేదీ లోగా తమ లగేజ్ తో నేరుగా వైటీసీ శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు.

## సుందరగిరి శివారులో బోల్తా కొట్టిన కారు

- అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



చిగురుమామిడి, జూన్ 13 (జనంసాక్షి) : అధిక వేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులోని పెసరుపల్లె మూలమలుపు వద్ద శనివారం ఓ కారు బోల్తా కొట్టింది. వివరాల్లోకి వెళితే నల్గొండ నుండి కరీంనగర్ వస్తున్న ఐ20 కార్ ఫోర్ వే లైన్ నిర్మాణం పనులు జరుగుతున్న దృశ్య ఇసుక ఉండడంతో కారు స్లిప్ అయ్యి ఎదురుగా ఉన్న డివైడర్ ఢీ కొట్టి కారు బోల్తా పడిందని స్థానికులు చెబుతున్నారు.ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.ఫోర్ వే లైన్ రహదారి పనులు నిర్లక్ష్యంగా నత్తనడకన జరుగుతుండడంతో ప్రయాణికులు దుమ్ము ధూళితో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## తండ్రికి తలకోరివి పెట్టిన కూతురు



కనగల్లు, జూన్ 13 (జనంసాక్షి) : మండలంలోని కురంపల్లి గ్రామానికి చెందిన జెట్టి సైదులు (45) గత ఐదు సంవత్సరాల నుంచి కిడ్నీల వ్యాధితో బాధపడుతూ ఇటీవలనే కిడ్నీ మార్పిడి శాస్త్ర చికిత్స జరిగిన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకునే క్రమంలో వాతావరణం అనుకూలించకపోవడంతో కుటుంబ సభ్యులు తిరిగి మెరుగైన చికిత్స కోసంప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు సైదులుకు ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు సంతానం కలగటం కుమారుడు పుట్టుకలోనే అంగవైకల్యం చెంది 10 సంవత్సరాలు అతనికి కుటుంబ సభ్యులు సహసంపర్యాలు జరపడం రెండు సంవత్సరాల క్రితం బాలుడు మృతి చెందడంతో సైదులు తనకున్న జబ్బుతో మరింత కుంగిపోయాడు. మృతుడి సైదులుకు ముగ్గురు ఆడపిల్లలు కావడంతో తన మరణాంతరం పెద్ద కూతురు సైదులు పార్టీవ దేహ ముందు శోభయాత్రలో ముందు నడిచి తలకొరివి పెట్టింది. ఈ సంఘటన చూసిన బంధువులు స్నేహితులు మరింత శోకసముద్రంలో మునిగారు . సైదులు మృతదేహాన్ని స్థానిక సర్పంచ్ ఓర్సు పెంటయ్య, ఉప సర్పంచ్ శీలం లక్ష్మారెడ్డి, బొమ్మ కంటి నరసింహస్వామి, బోనగిరి దుర్గాప్రసాద్‌లతో పాటు పొనుగోడు మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య, కొండ రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సైదులు అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సర్పంచ్ పెంటయ్య తన ఆవేదనను వ్యక్తపరిచారు.

## డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా బండరావిరాల పోరాటం ఉధృతం

- స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- మాజీ ఎమ్మెల్యే హెచ్చరిక



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13 (జనం సాక్షి) : బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం ప్రతిపాదించిన ఎకో టౌన్ (డంపింగ్ యార్డు) ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యను వివరించారు.గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామస్తులు డంపింగ్ యార్డు వల్ల గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామస్తుల వినతిని ఆలకించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నివాస ప్రాంతాలకు సమీపంలో డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు.అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ అంశంపై అనుసరిస్తున్న వైఖరిపై కూడా మంచిరెడ్డి కిషన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు నేమురగోముల మహేష్, కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ ముదిరాజ్, గ్రామ యువ నాయకులు కవాడి దయాకర్ రెడ్డి, గుండ్ల సతీష్ యాదవ్, కొత్త శ్రీకాంత్ గౌడ్, ఒంగూరి రమేష్, గుండ్ల శ్రీకాంత్, గుండ్ల మల్లేష్, కవాడి ఉదయ్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులు దిగులు చెందొద్దు

- రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13 (జనం సాక్షి) : నిజామాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా జరుగుతున్నది. ఇప్పటివరకు జిల్లాలో 1,29,824 మంది రైతులు 3,55,795 బస్తాలను కొనుగోలు చేయడం జరిగినది. మండలం యూనిట్ గా జిల్లాలోని అన్ని మండలాలకు కూడా ఈ సదుపాయము కల్పించనైనది.జిల్లాలో ప్రస్తుతము 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదు. రైతులకు సౌకర్యవంతంగా ఉండేటట్టు మరియు శాస్త్రీయంగా పంటలకు నత్రజని అందించే విధంగా ఈ యాప్ ను రూపొందించడం జరిగింది. రైతు సోదరులందరూ యాప్ విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే వ్యవసాయ విస్తీర్ణాధికారిని లేదా మండల వ్యవసాయ అధికారిని, సొసైటీలకు సంబంధించినటువంటి అధికారులను, వాలంటీర్లను సంప్రదించి యూరియా బుకింగ్ చేపించుకోగలరు. రైతు సోదరులు యూరియా దొరకదనే ఆందోళన పడవలసిన అవసరము లేదు, పంటలకు సరిపోయే యూరియాను అందించే బాధ్యత వ్యవసాయ శాఖ తీసుకుంటుందనీ కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

## కొండగట్టులో భక్తుల రద్దీ



మల్యాల, జూన్ 13 (జనం సాక్షి) : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి పర్వదినమున శనివారము మరియు వేసవి సెలవులు ముగియను ఉండడంతో భక్తుల రద్దీ నెలకొంది.సుమారు 20,000 మంది పైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి క్యూలైన్లో భక్తులకు బారులు తీరారు.కోనేట్లో పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి,ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్,టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో ఆదర్శంగా నిలిపేందుకు కృషి




నల్లగొండ, జూన్ 13 (జనం సాక్షి) : రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. నల్గొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకు వస్తుందని, ఒకప్పుడు జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో సాగైన బత్తాయి తోటలు ప్రస్తుతం 40 వేల ఎకరాలకు తగ్గిపోవడం బాధాకరమన్నారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా మారాల్సిన అవసరం ఉందని, వరి పంటపైనే ఆధారపడకుండా బత్తాయి, ఇతర ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయిలో కొత్త రకాల వంగడాలు రైతులకు ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, వివిధ జిల్లాల అధికారులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వ్యవసాయ, ఉద్యాన ప్రదర్శన స్టాళ్లను మంత్రి ప్రారంభించారు.

## ముఖ్యమంత్రి సభాస్థలిని పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



కనగల్, జూన్ 13 (జనం సాక్షి) : ఈ నెల 17న కనగల్ మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభ సందర్భంగా అట్టి సభా స్థలాన్ని రాష్ట్ర రోడ్లు భవనముల సినీమాటోగ్రఫీ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిలు సహకరించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. మంత్రి వెంట జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాం రెడ్డి, సిఐ రాము, ఎస్ ఐ క రాజీవ్ రెడ్డి , ఎంపీడీవోఎ. పేద రక్షిత, ఆర్టిఏ జిల్లాసభ్యులు కే రాజిరెడ్డిఎక్స్ జెడ్ పి టి సి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, సర్పంచులు మురళీధర్ గౌడ్, పంపు నాగమణి జానయ్య, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోల్డ్ జగాల్ రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, హఫీజుద్దీన్, కృష్ణయ్య, గోపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట టెంపుల్, జూన్ 13 (జనంసాక్షి) : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. వీకెండ్ తో పాటు వేసవి సెలవు లు ముగుస్తుండటం తో అధిక సంఖ్యలో స్వామి వారి ఆలయానికి విచ్చేశారు భక్తులు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండున్నర గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంటన్నర సమయం పట్టింది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యా కల్యాణం, లడ్డు ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

# వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి
- విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి
- వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13 (జనం సాక్షి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ , సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ 2.0 పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మిర్యాలగూడ, జూన్ 12 (జనంసాక్షి) : పట్టణంలో జరుగుతున్న అమృత్ 2.0పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాడు ఆయన పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి అమృత్ 2.0 పనుల్లో భాగం గా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 2.0 పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని, పనులు జరిగే ప్రదేశాల్లో ప్రజలకు ఇలాంటి ఇబ్బశీదులు తలె త్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో మిర్యాలగూడ పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు కొట్లాది రూపాయల వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ ల నిర్మాణం, పైపులైన్ పనులను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులను చేపడుతున్నామని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ,గుడిపాటి నవీన్,కౌన్సిలర్ ఆడావత్ అశోక్ నాయక్, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## లక్కీ లేడీ.. వారం వ్యవధిలో రెండుసార్లు లాటరీ జాక్‌పాట్

నక్క తోక తొక్కడం అంటే ఇదే మరి. సాధారణంగా అదృష్టం ఒకసారి వరించ డమే గొప్ప విషయం. అలాంటిది కెనడా కు చెందిన ఓ మహిళకు రెండుసార్లు అదృష్టం వచ్చి పడింది. వారం వ్యవధి లోనే ఆమె రెండు లాటరీలు గెలుచుకొ ని.. కోట్ల రూపాయలు సొంతం చేసుకు న్నారు. వివరాల్లోకి వెళితే.. ఒంటారియో లోని మిస్సిసాగకు చెందిన ట్రాంగ్ ఫామ్ తన నలుగురు సహోద్యోగులతో కలిసి గతేడాది ఒక లాటరీని కొనుగోలు చేశారు. దానికి 60 మిలియన్ల కెనెడియన్ డాలర్ల(భారత కరెన్సీలో రూ.407 కోట్లకు పైగా) జాక్‌పాట్ తగిలింది. దాన్ని ఆ ఐదుగురూ సమానంగా పంచుకున్నారు. ఒక వారం వ్యవధిలోనే ఆమె స్క్రాచ్ కార్డ్ అనే మరో లాటరీని కొనుగోలు చేశారు. ఆశ్చర్యకరంగా.. దానికి కూడా జాక్‌పాట్ తగిలింది. ఈ లాటరీతో 2,50,000 కెనడియన్ డాలర్లు వచ్చాయి. అయితే, ఈ లాటరీని ఆమె గ్రూప్‌గా కొనుగోలు చేశారా లేక ఒంటరిగా కొన్నారా అనే విషయం తెలియరాలేదు. సాధారణంగా జీవితంలో ఒకసారి లాటరీ తగలడమే చాలా అరుదు. అలాంటిది ట్రాంగ్ వారం వ్యవధిలోనే రెండుసార్లు భారీ మొత్తంలో లాటరీని దక్కించుకోవడం కెనడా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అనేక మంది లాటరీ నిపుణులు కూడా ఇది అసాధ్యమంటూ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సోషల్ మీడియాలోను 'లక్కీ లేడీ' అంటూ నెటిజన్లు పోస్టులు పెట్టారు.

## నాస్‌డాక్-100 నుంచి కాగ్నిజంట్ బయటకు

**విప్రో కూడా నిఫ్టీ-50 నుంచి నిష్క్రమణ!**

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ) విప్లవం రాకతో ఐటీ కంపెనీల షేర్లు ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ఐటీ దిగ్గజం కాగ్నిజంట్‌పైనా ఈ ప్రభావం కాస్త ఎక్కువగానే పడుతోంది. అమెరికాలోని నాస్‌డాక్-100 సూచీ నుంచి కాగ్నిజంట్ బయటకు వస్తోంది. ఏఐ బూమ్ నుంచి ప్రయోజనం పొందే కంపెనీలకు ఐటీ కంపెనీలు దారి ఇస్తున్నాయి. కాగ్నిజంట్‌తో పాటు, చార్టర్ కమ్యూనికేషన్స్, ఇన్స్‌మెడ్, వరిస్క్ అనలిటిక్స్, స్కేలర్ వంటి సంస్థలను సూచీ నుంచి తొలగిస్తున్నట్లు నాస్‌డాక్ జూన్ 11న ప్రకటించింది. నాస్‌డాక్-100 సూచీ అనేది 100 అతిపెద్ద బ్యాంకింగేతర కంపెనీల పనితీరును లెక్కలోకి తీసుకుంటోంది.

# గృహరుణం ఈఎంఐ రూ.1,000 పెంచితే

**న్యూఢిల్లీ:** ముఖ్యంగా చిన్న మొత్తాల గృహ రుణాలపై ఈ అదనపు చెల్లింపుల వల్ల జరిగే ఆదా దామాషా ప్రకారం మరింత ఎక్కువగా ఉంటుంది.గృహ రుణాలు భారీ వడ్డీ భారాన్ని మిగులుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉదాహరణకు ప్రస్తుత సగటు వడ్డీ రేటు 8.5 శాతంగా పరిగణనలోకి తీసుకొని, 20 ఏళ్ల కాల వ్యవధికి రూ.50లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. ఆ రుణానికి మీరు చెల్లించే మొత్తం వడ్డీ సుమారు రూ.54.13 లక్షలు అవుతుంది. అంటే, రూ.50లక్షల రుణం పూర్తిగా తీరేసరికి మీరు మొత్తంగా రూ.1.04 కోట్లు బ్యాంకుకు చెల్లించాల్సి వస్తుందన్నమాట. రుణ చెల్లింపుల ప్రారంభ సంవత్సరాల్లో మీరు కట్టే ఈఎంఐలో ఎక్కువ భాగం అసలు కన్నా వడ్డీ చెల్లింపులకే వెళుతుంది. మీ అసలు మొత్తం తగ్గే కొద్దీ, దానిపై పడే వడ్డీ క్రమంగా తగ్గుతూ వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈఎంఐ స్వల్పంగా పెంచినా, అది నేరుగా అసలు మొత్తాన్ని వేగంగా తగ్గిస్తుంది. ఒక ఉదాహరణతో చూద్దాం.. మీరు 8.5 శాతం వడ్డీ రేటుతో 240 నెలల (20 ఏళ్ల) కాలపరిమితికి రూ.75 లక్షల ఇంటి రుణం తీసుకున్నారనుకుందాం.ఈ రుణంపై మీ నెలవారీ ఈఎంఐ సుమారు.. రూ.64,600గా ఉంటుంది.




ఇలా 240 నెలలపాటు క్రమం తప్పకుండా చెల్లిస్తే, మీరు చెల్లించే మొత్తం రూ.1,55,10,948 అవుతుంది. ఇందులో అసలు రూ.75 లక్షలు పోగా, మిగిలిన రూ.80,10,948 కేవలం వడ్డీ రూపంలోనే చెల్లిస్తున్నట్లు లెక్క.ఇప్పుడు మీ ఈఎంఐని రూ.1,000 అదనంగా పెంచి, రూ.65,600 చేశారనుకుందాం. దీనివల్ల మీ రుణ కాలపరిమితి దాదాపు 9 నెలలు తగ్గిపోయి, 231 నెలల్లోనే రుణం పూర్తిగా తీరిపోతుంది.ఈ కొత్త ఈఎంఐ ద్వారా మీరు చెల్లించే మొత్తం రూ.1,51,53,062కు పరిమితం అవుతుంది. మీరు చెల్లించే వడ్డీ రూ.76,53,062 దాకా తగ్గుతుంది.ఇలా కేవలం రూ.1,000 అదనంగా చెల్లించడం వల్ల, మీ మొత్తం రుణ కాల వ్యవధిలో నికరంగా రూ.3,57,886 వడ్డీ ఆదా

సొంతింటి కలను నిజం చేసుకునేందుకు గృహరుణం ఎంతో సాయం చేస్తుంది. కానీ, ఇది దీర్ఘకాలిక రుణం కావడం వల్ల అసలు కన్నా వడ్డీ రూపంలోనే మనం భారీ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. మీరు ప్రతి నెలా చెల్లించే వాయిదా (ఈఎంఐ)కి అదనంగా కేవలం రూ.1,000 జోడిస్తే చాలు, రూ.లక్షల వడ్డీని ఆదా చేయొచ్చు. రుణ కాలపరిమితినీ సులభంగా తగ్గించుకోవచ్చు.

అవుతుంది.ఈఎంఐ మొత్తాన్ని పెంచడం లేదా ముందస్తు చెల్లింపుల (ప్రి-పేమెంట్) వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం వడ్డీ భారాన్ని తగ్గించుకోవడమే. మీ గృహరుణ చెల్లింపుల ప్రారంభ దశలోనే ఈఎంఐలో వడ్డీ భాగం అత్యధికంగా ఉంటుంది. కాబట్టి, వీలైనంత త్వరగా అంటే, రుణం తీసుకున్న తొలినాళ్లలోనే ముందస్తు చెల్లింపులు లేదా అదనపు ఈఎంఐ చెల్లించడం ప్రారంభించాలి. ఒకవేళ రుణ వ్యవధి మధ్యలో లేదా చివరి దశలో ఈ ముందస్తు చెల్లింపులు చేస్తే, వడ్డీ ఆదా పరంగా గరిష్ఠ ప్రయోజనాన్ని పొందలేరు. కాబట్టి, మీ ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకొని, ప్రతి నెలా రూ.1,000 ఈఎంఐకి అదనంగా కలిపి చెల్లించడం ప్రారంభించండి.

**భవిష్యత్తులో రూ.లక్షల వడ్డీ భారం తగ్గించుకోండి.**

డూప్లికేట్ ఎంట్రీలు ఏమైనా ఉన్నాయా తనిఖీ చేయాలి. వడ్డీ, మూలధన లాభాలు వంటివి ఏఐఎస్‌లో ఉండి, ఫారం 16లో లేకపోతే వాటి పన్ను బాధ్యతను అంచనా వేసి, రిటర్నుల్లో చూపాలి.

ఒకవేళ ఏఐఎస్‌లో పొరపాట్లు ఉంటే, వెంటనే ఆదాయపు పన్ను పోర్టల్‌లో ఫీడ్‌బ్యాక్ ద్వారా తెలియజేసి, తగిన ఆధారాలను మీ వద్ద ఉంచుకోవాలి. ఇలా సరిచూసుకోవడం వల్ల తప్పు రిటర్నులు వేయడం, పన్ను నోటీసులు రావడం, భవిష్యత్తులో పన్ను శాఖతో వివాదాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.ఒకటికి మించి ఉంటే: ఒక ఆర్థిక సంవత్సరంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ సంస్థల్లో పనిచేసినట్లయితే, వాటన్నింటి నుంచి ఫారం 16లను పొందాలి. అన్ని ఫారాల నుంచి వచ్చిన ఆదాయాన్ని, మినహాయింపులను కలిపి రిటర్నులలో చూపించాలి. ప్రామాణిక తగ్గింపును రెండుసార్లు క్లెయిం చేయకూడదు. ఉద్యోగం మారినప్పుడు, పాత కంపెనీ జీతం వివరాలను కొత్త కంపెనీకి అందించడం ఉత్తమం. అలా చేయకపోతే టీడీఎస్ సరిగా మినహాయింపు జరగదు. ఆ తర్వాత పన్నును జరిమానా, వడ్డీతో సహా చెల్లించాల్సి రావచ్చు.ముందుగానే గుర్తిస్తే..:ఫారం 16లో ఏవైనా తప్పులను గుర్తిస్తే వెంటనే మీ యాజమాన్యాన్ని సంప్రదించి సవరించిన ఫారం ఇవ్వాల్సిందిగా కోరాలి. రిటర్నులు ఫైలు చేయడానికి ముందే వీలైనంత వరకూ తప్పులను సరిదిద్దుకోవాలి. గడువులోపు సవరించిన ఫారం రాకపోతే, మీ దగ్గరున్న ఆధారాలు, ఫారం 26ఏఎస్, ఏఐఎస్‌లతో పోల్చుకొని, సరైన వివరాలతో రిటర్నులు వేయాలి. ఏదైనా అదనపు పన్ను చెల్లించాల్సి వస్తే, రిటర్ను దాఖలు చేయడానికి ముందే ఆ మొత్తాన్ని చెల్లించాలి.బహుళ ఆదాయ మార్గాలుంటే, మీ తుది పన్ను బాధ్యతను నిర్ణయించేందుకు కేవలం ఫారం 16పైనే ఆధారపడొద్దు.ఫారం 16 లేదా ఫారం 16ఏలో లేనప్పటికీ, విదేశీ ఆదాయంతో సహా పన్ను విధించదగిన అన్ని ఆదాయాలను కలిపి రిటర్నులలో కచ్చితంగా చూపించాలి.

## యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ సరికొత్త రికార్డ్

ప్రపంచంలోనే నం.1 యూట్యూబర్‌గా పేరొందిన మిస్టర్ బీస్ట్ సరికొత్త రికార్డ్ సృష్టించాడు. యూట్యూబ్‌లో 50కోట్ల సబ్‌స్క్రైబర్లు దాటిన తొలి క్రియేటర్‌గా నిలిచాడు. జూన్ 12, 2026న, మిస్టర్‌బీస్ట్ తన అధికారిక యూట్యూబ్ ఛానల్ లైవ్‌లో ఉన్న సమయంలో 50కోట్ల సబ్‌స్క్రైబర్ల మార్క్‌ను చేరుకున్నాడు. యూట్యూబ్ చరిత్రలో ఇది మరో మైలురాయి. మిస్టర్ బీస్ట్ ఫిబ్రవరి 2012లో తన యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించాడు. అప్పుడు అతడి వయసు 13ఏళ్లు. 2017లో అతడు అంకెలను



లక్ష వరకు లెక్కపెడుతూ చేసిన వీడియోకు విస్తృత ప్రజాదరణ లభించింది. మిస్టర్ బీస్ట్ అసలు పేరు జేమ్స్ డోనాల్డ్‌సన్. అతడు తన 'బీస్ట్ ఫిలాంత్రపీ' ఛానల్ పైన వచ్చే మొత్తం ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తుంటాడు. చెట్లను నాటడం, సముద్రాల శుభ్రత, పేదలకు ఇళ్లు, ఆహారం అందించే ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపడుతుంటాడు. బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలకు విముక్తి కలిగించడంతోపాటు... 'లైట్ ఏఐ' అనే ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టి స్మార్ట్‌ఫోన్, ఏఐ పరిజ్ఞానంతో టెస్టులు చేయిస్తూ అవసరం అయిన వారికి చికిత్సలూ చేయిస్తున్నాడు. 'ఘనా మేక్ ఎ డిఫరెన్స్' అనే స్థానిక స్వచ్ఛందసంస్థతో కలిసి గుండెజబ్బులున్న పిల్లలకు శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుగా అత్యాధునిక సదుపాయాలతో సర్జికల్ సెంటర్‌నీ ప్రారంభించాడు. కెన్యా, జింబాబ్వే, ఉగాండా ప్రాంతాల్లోని పిల్లలకు మంచినీరు అందించడం కోసం వంద బావులు తవ్వించాడు. వీటన్నింటి వీడియోలను ఆయన యూట్యూబ్‌లో పంచుకుంటాడు. దీంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మిస్టర్ బీస్ట్‌ను అభిమానిస్తారు. ఇదీ చదవండి: లక్కీ లేడీ.. వారం వ్యవధిలో రెండుసార్లు లాటరీ జాక్‌పాట్

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |


### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## మ్యాగీలో పురుగుల వార్తలు.. ఖండించిన నెస్లే ఇండియా

మ్యాగీ నూడుల్స్‌లో పురుగులున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న ఆరోపణలను ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ఖండించింది. అవన్నీ నిరాధారణ ఆరోపణలని కొట్టిపారేసింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు




అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో కంపెనీ స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియా వేదికగా ఓ యూజర్ నుంచి వచ్చిన ఆరోపణలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తమ దృష్టికి తీసుకొచ్చినట్లు నెస్లే ఇండియా పేర్కొంది. ఇప్పటివరకు ఆ ఫిర్యాదుదారు నుంచి ఎలాంటి శాంపిల్స్ అందలేదని, కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నించినా ఆ యూజర్ వివరాలు తెలియరాలేదని కంపెనీ పేర్కొంది. "మ్యాగీ నూడుల్స్ శాంపిల్స్‌ను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించగా, మా ఉత్పత్తుల్లో ఎలాంటి పురుగులు లేవని ధృవీకరించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తులు ఉన్నట్లు నివేదిక వచ్చింది. వినియోగదారుల ఆరోగ్యం, నాణ్యత విషయంలో రాజీపడబోం. కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తాం" అని నెస్లే ఇండియా వెల్లడించింది.

# ఆంత్రోపిక్‌కు మరో తలనొప్పి

**ఫ్యాబిల్, మిథోస్‌పై అమెరికా బ్యాన్..!**

**న్యూఢిల్లీ:** శక్తిమంతమైన ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తూ అమెరికా సర్కార్ ఆగ్రహానికి గురవుతోన్న కృత్రిమ మేధ సంస్థ 'ఆంత్రోపిక్ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీ ఇటీవల విడుదల చేసిన తమ సరికొత్త ఏఐ మోడళ్లు 'ఫ్యాబిల్ 5', 'మిథోస్ 5' సేవలను తాజాగా నిలిపివేసింది. దేశ భద్రతా కారణాల రీత్యా ఈ మోడళ్లపై అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ఆంత్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా.. ఫ్యాబిల్ 5ను విడుదల చేసిన మూడు రోజులకే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.ఫ్యాబిల్ 5, మిథోస్ 5 ఏఐ మోడళ్లపై భద్రతాపరమైన ఆందోళనలను వ్యక్తంచేసిన అమెరికా ప్రభుత్వం.. వాటిని విదేశీ పౌరులకు నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆంత్రోపిక్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు కూడా ఈ మోడళ్ల యాక్సెస్ ఉండకూడదని స్పష్టంచేసింది. ఈమేరకు అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ కంపెనీకి లేఖ పంపినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ఆంత్రోపిక్.. విదేశీ పౌరులే గాక,




యూజర్లందరికీ ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.ఈ ఏఐ మోడళ్లపై నిషేధానికి గల కారణాలను అమెరికా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. అయితే, ఇందులోని అధునాతన సాంకేతికత సాయంతో సైబర్ నేరగాళ్లు సులువుగా హ్యాకింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని ట్రంప్ సర్కారు ఆరోపించింది. ఈ ఏఐ టూల్స్‌తో కోడ్‌లోని సాఫ్ట్‌వేర్ లోపాలను సులువుగా గుర్తించి హ్యాకర్లు దుర్వినియోగం చేసే ముప్పు ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై ఆంత్రోపిక్ స్పందించింది."ఈ మోడళ్లు దుర్వినియోగం అయ్యే అవకాశం అత్యంత తక్కువగా ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎన్నో మోడళ్లు కూడా హ్యాకర్లకు అదనపు సామర్థ్యాలను కలిగిస్తున్నాయి. ఈ ఒక్క కారణంతో కోట్లాది మంది కోసం రూపొందించిన కమర్షియల్ మోడల్‌ను రీకాల్ చేసుకోవడం అత్యంత బాధాకరం. మా సెక్యూరిటీ టెస్టింగ్‌లలో మేం ఎలాంటి లోపాలను గుర్తించలేదు" అని ఆంత్రోపిక్ వెల్లడించింది. గత మంగళవారమే ఫ్యాబిల్ 5 మోడల్‌ను ఈ సంస్థ విడుదల చేసింది. ఇది మిథోస్ 5కు అధునాతన వెర్షన్.'ప్రాజెక్ట్ గ్లాస్‌వింగ్'లో భాగంగా ఆంత్రోపిక్ సంస్థ క్లాడ్ మిథోస్‌ను తెరపైకి తెచ్చింది. ఇది అధునాతన ఏఐ నమూనా. ఆయా సంస్థల సాఫ్ట్‌వేర్‌లో లోపాలను గుర్తించి, సైబర్ భద్రతను మెరుగుపరచడానికి దీన్ని రూపొందించారు. ఎంపిక చేసిన కొన్ని కంపెనీలకు మాత్రమే ఈ టూల్ యాక్సెస్‌ను ఆంత్రోపిక్ కల్పించింది. భారత్‌లోనూ కొన్ని కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి.

## ప్రపంచంలో రెండింతలైన బియ్యం ఉత్పాదన

**చైనా, భారత్, థాయ్‌లాండ్‌లే అత్యధిక ఉత్పాదకులు.. వెల్లడించిన అధ్యయనం**

**దిల్లీ:** చైనా, భారత్, థాయ్‌లాండ్‌లు ప్రపంచంలో అత్యధికంగా వరి పండిస్తున్న దేశాలని ఒక కొత్త అధ్యయనం వెల్లడించింది. 2006 నుంచి 2015 వరకూ ప్రపంచంలో మొత్తం 71.3 కోట్ల టన్నుల బియ్యం ఉత్పత్తి కాగా ఈ మూడు దేశాలు ఉత్పాదనలో మొదటి మూడు స్థానాలు ఆక్రమించాయని అమెరికాకు చెందిన ఇల్లినోయి అర్బానా షాంపేన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వెల్లడించారు. 1960 దశకం నుంచి 2010 దశకం వరకూ ప్రపంచంలో వరి ఉత్పాదన రెండింతలయ్యిందని వారు వెల్లడించారు. విస్తరించిన నీటిపారుదల, పెరిగిన పోషకాల వాడకం వంటి సేద్య నిర్వహణ ప్రక్రియలు ఉత్పాదనను స్థిర వృద్ధి దిశగా నడిపాయని, వాతావరణ ప్రతికూలతల కారణంగా తలెత్తిన నష్టాలను భర్తీ చేశాయని అధ్యయనకర్తలు తెలిపారు. ప్రపంచ బియ్యం ఉత్పాదనలో సింహభాగం ఆసియా ఖండంలోనే



నమోదవుతోందని, భారత్, చైనాలతోపాటు ఇతర దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలు ఈ విషయంలో అగ్రభాగాన నిలుస్తున్నాయని ఈ అధ్యయనంలో పాల్గొన్న ప్రొఫెసర్ అతుల్ జైన్ పేర్కొన్నారు. వరి పంట విస్తృతి 52 శాతం పెరగడం కూడా బియ్యం ఉత్పాదన పెరగడానికి ప్రధాన కారణమని నీటి పారుదల కలిగిన ప్రాంతాల్లో 39 శాతం, వర్షాధార ప్రాంతాల్లో 13 శాతం పంట విస్తరణలో పెరుగుదల నమోదైందని అధ్యయనం తెలిపింది. నైట్రోజన్ ఎరువులు, ఇతర పోషకాల వాడకం 24 శాతం పెరిగిందని గుర్తించింది. పర్యావరణ సంబంధ అంశాలు కూడా ఉత్పాదకతను పెంచాయని, వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరుగుదల 30 శాతం, నైట్రోజన్ పెరుగుదల 1 శాతం ఉత్పాదకత పెరుగుదలకు దోహదపడ్డాయని తెలిపింది. అయితే వాతావరణ మార్పుల కారణంగా ఉత్పాదకత ఏడుశాతం తగ్గిందని వెల్లడించింది.

## ట్రంప్ బర్త్‌డే.. వైట్‌హౌస్‌లో 'కేజ్ ఫైట్'..

**రూ.500 కోట్ల ఖర్చు!**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 80వ పుట్టిన రోజును ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం అధ్యక్ష భవనంలో యూఎఫ్‌సీ 'కేజ్ ఫైట్'ను నిర్వహించనున్నారు. వైట్‌హౌస్ చరిత్రలోనే తొలిసారిగా ఇటువంటి కార్యక్రమం కోసం భారీ వేదికను ఏర్పాటు చేయడం విశేషం. ఆదివారం (జులై 14న) రాత్రి నిర్వహించే ఈ ఈవెంట్‌కు 60 మిలియన్ డాలర్లు (సుమారు రూ.500 కోట్లు) ఖర్చు చేయనున్నట్లు అంచనా. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని (జులై 4) పురస్కరించుకొని ఈ కార్యక్రమానికి 'యూఎఫ్‌సీ ఫ్రీడమ్ 250' అని పేరు పెట్టారు.యూఎఫ్‌సీ అంటే.. అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్. అధ్యక్షుడు ట్రంప్‌నకు ఈ పోటీలంటే ఎంతో ఇష్టం. గతంలో చాలా ఈవెంట్లను ప్రత్యక్షంగా వీక్షించారు. యూఎఫ్‌సీ సీఈవో డానా వైట్ కూడా ట్రంప్‌నకు సన్నిహితుడు. వీరి స్నేహానికి ప్రతీకగానే వైట్‌హౌస్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి జరిగే ఫ్రీడమ్ 250లో పలు దేశాలకు చెందిన ప్రముఖ ఫైటర్లు తలపడనున్నారు.యూఎఫ్‌సీ ఫ్రీడమ్ 250 ఈవెంట్ కోసం వైట్‌హౌస్ సౌత్ లాన్ ముస్తాబైంది. 'ది క్లా' పేరుతో భారీ వేదికను రూపొందించారు. 92 అడుగుల ఎత్తు, 154 అడుగుల వెడల్పు, 600 టన్నుల భారీ స్థాయిలో తాత్కాలిక పైకప్పును నిర్మించారు. వేదిక మధ్యలో యూఎఫ్‌సీ అక్టాగాన్ (కేజ్)తోపాటు మూడు నుంచి నాలుగు వేల మంది అతిథులు కూర్చొని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. వేలాది మంది సామాన్యులు చూసేందుకు వైట్‌హౌస్ బయట కూడా భారీ స్క్రీన్‌లను పెట్టారు. అయితే, ఈఫిల్ టవర్ మాదిరిగా ఈ తాత్కాలిక నిర్మాణం శాశ్వతంగా ఉండిపోయే అవకాశం ఉందని ట్రంప్ చెప్పడం విశేషం.ట్రంప్ పుట్టినరోజు సందర్భంగా వైట్‌హౌస్‌లో యూఎఫ్‌సీ పోటీలు నిర్వహించడం స్థానికంగా తీవ్ర విమర్శలకు కారణమైంది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు క్రీడా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# ఆహా ఏమి రుచి.. తింటాం మైమరిచి..

**న్యూఢిల్లీ:** రుచి అంటే నాలుక చేసే మ్యాజిక్... అయితే నాలుక ఒక్కటే కాదు... పంచేంద్రియాలూ అందులో భాగస్వాములే అని పరిశోధనలు చెబుతున్నాయి. తినడం ద్వారానే కాదు... కళ్లతో చూడడం, వాసన చూడడం, తాకడంద్వారా కూడా రుచిని ఆస్వాదించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ అనుభూతుల ఆధారంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంపిక చేసుకోవచ్చని వారు వివరిస్తున్నారు. మనం రుచిని నోటి ద్వారానే గ్రహిస్తామని, రుచి అక్కడ్నుంచే వస్తుందని అనుకుంటాం. నిజానికి అందులో ఇతర ఇంద్రియాలన్నీ పాలు పంచుకుంటాయని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఆహారశాస్త్రాల మనస్తత్వవేత్త చార్లెస్ స్పెన్స్ చెబుతారు. ఇంద్రియాలు మనం తినే పరిమాణాన్నీ ప్రభావితం చేస్తాయి. మనకు తెలియకపోవచ్చు కానీ చెవులతో కూడా రుచి చూడగలం. ఒక స్టీక్ వేగుతున్నప్పుడు వచ్చే చిటపట శబ్దం... శీతల పానీయం మూత తీస్తున్నప్పుడు వచ్చే బుసబుసమనే శబ్దం కూడా మన రుచి మొగ్గలను ప్రభావితం చేస్తుంది. వాటిని క్రియాశీలం చేస్తుంది. రుచి చూడకముందే మన మెదడు ఆహార రూపం, వాసన, స్పర్శ, శబ్దం ఆధారంగా ఒక అంచనాకు వచ్చేస్తుంది. కళ్లు, చెవులు, వేళ్లు, ముక్కు నుంచి ఆ సమాచారాన్ని తీసుకుంటుంది. ఏవైతే ఇంద్రియాలు మనిషిని అధికంగా తినేందుకు ప్రేరేపిస్తున్నాయో... వాటిని నియంత్రించి ఆరోగ్యకరమైన ఆహారం తినేలా పురికొల్పవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకు ఏంచేయాలంటే..ఆహార ఎంపికలో కళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. ప్యాకింగ్, లోగో, ఆకర్షణీయతను చూసి ఆ ఆహారం కొనేలా ప్రేరేపిస్తాయి. చిప్స్ ప్యాకెట్లు, పలు రకాల బిస్కెట్లు వంటి ఉప్పు, చక్కెర అధికంగా ఉండే



ఆహారాన్ని కళ్లు చెదిరే ప్యాకింగ్‌తో ఉంచుతారు. తద్వారా వాటిని కొనేలా ప్రేరేపిస్తారు. సేలియన్స్ బయాస్ అనే ఈ సూత్రాన్ని విరుగుడుగా కూడా వాడొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆకర్షణీయంగా ప్యాక్ చేసి అందుబాటులో ఉంచడం ద్వారా వినియోగదారుడు వాటిని ఎంపిక చేసుకునేలా ప్రోత్సహించాలన్న మాట.చాలా సూపర్‌మార్కెట్లలో కొన్ని ఉత్పత్తులను చెక్‌అవుట్‌ల దగ్గర ఉంచుతారు. షాపింగ్ చివరి దశలో వినియోగదారుడిని ఆకర్షించే మార్గమది. ఇలా ఉంచే వాటిలో అనారోగ్యకరమైన వాటిని పలు యూరోపియన్ దేశాల్లో నిషేధిస్తున్నారు.

## ఆదివారమే ఒప్పందం..

వాషింగ్టన్(జనంసాక్షి): మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించడానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అమెరికా-ఇరాన్ ఒప్పందం ఆదివారం కుదరనున్నట్లు యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో ఒప్పందంపై జూన్ 14న సంతకాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతకాలు జరిగిన వెంటనే హర్మూజ్ అందరికోసం తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య ఈ ఆదివారం శాంతి ఒప్పందం జరగే అవకాశం ఉందని పాకిస్థాన్ (ఖజీనెతిబబిజీని) ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంతకుముందు ప్రకటించారు. అయితే, పాక్ ప్రధాని ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ స్పందించింది. ఇప్పుడే ఒప్పందంపై సంతకాలు జరగవని, ఇందుకు మరింత సమయం పడుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరుగుతుందని ట్రంప్ నుంచి ప్రకటన రావడం గమనార్హం.

## సింగరేణిలో అవకతవకలపై విచారణ జరిపించండి..

వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలి" అని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కార్యకర్తలు ఉద్యమించాలి

ఉన్న బ్యాగులన్నీ రాహుల్ గాంధీకి డబ్బులు పంపేందుకు దిల్లీకి వెళ్లాయని అంటున్నారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు 900 రోజులైనా నెరవేర్చలేదు. హామీల గురించి ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరైనా.. కేసీఆర్‌ను మాత్రమే చూడాలి. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉంది" అని కేటీఆర్ అన్నారు.

## శాంతి ఒప్పందంపై నీలినీడలు

మెమోరాండంపై రానున్న రోజుల్లో సంతకాలు చేసే అంశాన్ని తోసిపుచ్చలేమని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ పేర్కొన్నారు. అమెరికా అనుమానాల నేపథ్యంలో సంతకాలు చేసే కచ్చితమైన తేదీపై జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, పాక్ ప్రధాని ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ స్పందించింది. ఆదివారం ఒప్పందంపై సంతకాలు జరగవని, ఇందుకు మరింత సమయం పడుతుందని స్పష్టం చేసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
14 జూన్ 2026






# ప్రభుత్వ సొమ్మును కోట్లల్లో దోచుకుంటున్న డిఎస్ఓ

- డీఎస్ఓ కాశీ విశ్వనాథ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- రూ.50 లక్షల ధాన్యం కేటాయించాల్సిన మిల్లుకు రూ.7 కోట్ల ధాన్యం కేటాయించారని విమర్శ
- జిల్లాలోని పలు రైస్‌మిల్లుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



## ధాన్యం కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు

**వనపర్తి బ్యూరో జూన్ 13 జనంసాక్షి :** ధాన్యం కేటాయింపుల్లో ప్రభుత్వ సొమ్మును కోట్లల్లో అప్పనంగా మింగుతున్న డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ పై తక్షణమే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా రాజనగరం శివారులో గల బసవేశ్వర రైస్ మిల్లును బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లాలో నేడు డిఎస్ఓ కాశి విశ్వనాథ్ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. కస్టోడియన్ గా ఉన్న మిల్లులో రూ. 9 కోట్ల ధాన్యం మాయం కావడం, తర్వాత సాంబశివ రైస్ మిల్లుకు రూ.10 లక్షల బిజీ చెల్లిస్తే రూ.6.50 కోట్ల ధాన్యం కేటాయించి అందులో రూ.3 కోట్లకు పైగా ధాన్యం మాయం చేయడం, తాజాగా వనపర్తి మండలం రాజనగరం శివారులోని బసవేశ్వర రైస్ మిల్లులో పరిస్థితి కూడా అదే విధంగా ఉందన్నారు.

చివర ఖరీఫ్ సీజన్లో రూ.5 లక్షల బ్యాంకు గ్యారంటీ మాత్రమే చెల్లించారని, వారికి నిబంధనల ప్రకారం రూ.50 లక్షల ధాన్యం మాత్రమే కేటాయించాలని, కాని డిఎస్ఓ ఏకపక్షంగా వ్యవహరించి ఏకంగా రూ.7 కోట్లకు పైగా ధాన్యం కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో అనేకమంది మిల్లర్లు ఇబ్బందులు పడుతూ ధాన్యం కేటాయించమని మొరపెట్టుకున్న ఏమాత్రం పట్టించుకోకుండా పెడచెవిన పెట్టిన డీఎస్ఓ కాశి విశ్వనాథ్, జిల్లా కలెక్టర్ తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రం ప్రభుత్వ సొమ్మును అప్పనంగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. తమకు బిజీ చెల్లిస్తేనే ధాన్యం కేటాయిస్తామని నిరంకుశంగా వ్యవహరించిన డీఎస్ఓ,కలెక్టర్ స్థానికులకు కేటాయించకుండా గద్వాల, మెదక్ జిల్లాలకు ధాన్యం పంపించారని పేర్కొన్నారు. మరి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ బసవేశ్వర రైస్ మిల్లుకు అదనంగా కోట్ల రూపాయల ధాన్యాన్ని ఏ విధంగా కేటాయించారని ప్రశ్నించారు. ప్రభుత్వ సొమ్మును ఏ విధంగా అప్పనంగా పంచి పెడుతున్నారని, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి మొదటి నుంచి మొరపెట్టుకుంటున్నప్పటికీ కాశీ విశ్వనాథ్ ను వెనకేసుకొస్తూ కాపాడుతున్నాడని విమర్శించారు.

డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ అవినీతి అక్రమాలు ఇంకా అనేకంగా ఉన్నాయని, ప్రతిరోజు ఒక్కొక్కటిగా బీసీ పొలిటికల్ జేఏసీ బయటికి తీస్తుందని తెలిపారు.జిల్లాలో జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, జి మధుసూదన్ రెడ్డి, తూడి మెగా రెడ్డి ఇలా ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండి కూడా డిఎస్ఓ కాశి విశ్వనాథ్ అవినీతి అక్రమాలను చూసి చూడనట్లు వదిలేస్తున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ సొమ్మును కాపాడటానికి ఉన్నారా? లేక అవినీతి అధికారికి బాసటగా నిలుస్తారా? తెల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ సొమ్మును కాజేస్తూ, ఖజానాకు గండి కొడుతున్న డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ పై తక్షణమే స్పందించి సస్పెండ్ చేయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అవినీతి అధికారిని ఎన్ని రోజులు రక్షిస్తార్ చూస్తామని, బీసీ పొలిటికల్ జేఏసీ మాత్రం అవినీతి అధికారి కాశీ విశ్వనాథ్ ను చంచల్ గూడ జైల్లో ఊచలు లెక్క పెట్టించే వరకు విశ్రమించదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి వి గౌడ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్, మోహన్ రెడ్డి, శేఖర్ గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# నిమ్స్‌లో దవాఖానలో రక్తదాన శిబిరం

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు



**ఖైరతాబాద్, జూన్ 13 (జనం సాక్షి) :** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్(నిమ్స్) లో శనివారం ఇమ్యునో హీమటాలజీ అండ్ ట్రాన్స్ ఫ్యూషన్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో అవగా హన ర్యాలీతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించా రు. ర్యాలీ అనంతరం నిమ్స్ పాత భవనంలోని లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన అవగాహన కార్యక్రమం లో నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాతలు, రక్తదాన శిబిరా ల నిర్వాహకులు,సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న పలువురిని ఆయన సన్మానించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ఒక యూనిట్ రక్తం అనేక మంది రోగుల ప్రాణాలను కాపాడగల దని పేర్కొన్నారు. అత్యవసర చికిత్సలు, శస్త్రచికిత్సలు, ప్రమాదాలు, క్యాన్సర్ చికిత్సలు, ప్రసూతి సేవల్లో రక్తం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. స్వచ్ఛంద రక్తదాతలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని వైద్యులు పిలుపు నిచ్చారు.రక్తదానం ఆరోగ్యానికి హానికరం కాదని, ఇది సురక్షితమైన, మానవతా దృక్పథంతో కూడిన సేవ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయ ణ, అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి లక్ష్మీ భాస్కర్, బ్ల డ్ బ్యాంక్ హెచ్‌వోడి సుధీర్ ఉజ్జిని, డా.కె.మహేష్, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డా.మార్త రమేష్, బిడుగు శేఖర్, వెంకటరత్నం, సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# షాదీ ముబారక్ లో రూ.21 లక్షల మోసం అరుగురు అరెస్టు



**రాజేంద్రనగర్, జూన్ 13 (జనంసాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో షాదీ ముబారక్ పథకానికి నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వాన్ని సుమారు రూ.21 లక్షల మేర మోసం చేసిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు వివరాల ప్రకారం ఈ కేసులో మహమ్మద్ ఎతిమాద్ ఉల్ హక్, మహమ్మద్ అక్బర్, సయ్యద్ ముషరఫ్ ఉద్దీన్, మహమ్మద్ సర్ఫరాజ్, మహమ్మద్ జాఫర్, బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ధరావత్ అశోక్ కిరణ్‌ను నిందితులుగా అరెస్ట్ చేశారు. విచారణలో ప్రధాన నిందితుడు మహమ్మద్ ఎతిమాద్ ఉల్ హక్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ల సహాయంతో వధువుల ఫోటోలు, ఆధార్ వివరాలు, వివాహ ధృవపత్రాలు తదితర పత్రాలను నకిలీగా తయారు చేసినట్లు తేలింది. మహమ్మద్ అక్బర్ నకిలీ దరఖాస్తులను సమర్పించగా, ధరావత్ అశోక్ కిరణ్ ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండానే తదుపరి ప్రక్రియకు పంపేందుకు సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ముషరఫ్ ఉద్దీన్, మహమ్మద్ సర్ఫరాజ్, మహమ్మద్ జాఫర్ నకిలీ లబ్ధిదారుల వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర పత్రాల సేకరణలో సహకరించినట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, , ఒక డెస్క్‌టాప్ కంప్యూటర్, ఆరు మొబైల్ ఫోన్లు, షాదీ ముబారక్‌కు సంబంధించిన నకిలీ దరఖాస్తులు, ఐడీ ప్రూఫ్‌లు, సుమారు రూ.21 లక్షల విలువైన 21 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు సూచించారు.

# పదవి ఆభరణం కాదు.. ప్రజాసేవకు వచ్చిన బాధ్యత

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి
- దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే
- సర్పంచ్‌లకు అవగాహన, శిక్షణ శిబిరం నిర్వహణ
- గ్రామాభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ



**తాండూరు, జూన్ 13 (జనంసాక్షి):** పదవి అనేది ఆభరణం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ కన్వెన్షన్‌లో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లకు నిర్వహించిన అవగాహన, శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, నాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబం దేశానికి విశేష సేవలు అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు లబ్ధి చేకూరిందని, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. సర్పంచ్ పదవి దక్కడం అదృష్టమైతే, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మాట, నడవడిక, మర్యాద, పనితనంతోనే ప్రజల గౌరవం, ప్రేమ పొందవచ్చన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గ్రామాల్లో మరిన్ని పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై ఎలాంటి సందేహాలున్నా తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ లేదా ఇతర సమస్యల విషయంలో తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# జోరు వానలోనూ పోలీసుల సేవలు ప్రశంసనీయం

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**శేరిలింగంపల్లి, జూన్ 13 (జనంసాక్షి):** నగరంలో శనివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు అందించిన సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపై నిరంతరం విధులు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ వాహనాల రాకపోకలను నియంత్రించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలను హెచ్చరిస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

## డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా

# బండరావిరాల ఉద్యమం ఉధృతం

- నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే కలెక్టరేట్ ముట్టడి హెచ్చరిక
- ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రభావం ఉంటుందన్న ఆందోళన
- గ్రామ ప్రజల పోరాటానికి పూర్తి మద్దతు: మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఎకో టౌన్ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13 (జనంసాక్షి):** బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లో 494 ఎకరాల్లో ప్రతిపాదిత ఎకో టౌన్ (డంపింగ్ యార్డు) ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజల ఆందోళన మరింత ఉధృతమైంది. డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వెంటనే విరమించుకోవాలని కోరుతూ గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసి తమ అభ్యంతరాలను వెల్లడించారు. గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామస్తులు డంపింగ్ యార్డు వల్ల ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నివాస ప్రాంతాలకు సమీపంలో ఇటువంటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి కలెక్టరేట్ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరిన ఆయన, ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు కూడా స్పందించి గ్రామస్తులకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు, యువ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేయాలి

## 'జల్, జంగల్, జమీన్' కోసం పోరాడిన గిరిజన వీరులను స్మరించాలి : బండారు దత్తాత్రేయ



**సికింద్రాబాద్ (జనంసాక్షి) :** అడవులను అమ్మలా ఆదరించి, భూమిని దేవతగా భావించి సంరక్షించిన గొప్ప వారసత్వం గిరిజన సమాజానిదని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, స్వాభిమానాన్ని కాపాడుతూ వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమ్మక్క-సారలక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, గోపాల్ రావు స్మారక సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సెమినార్ ముగింపు సమావేశం శనివారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రొ. జి. రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు సభకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొనున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, ప్రకృతితో మమేకమై నీతి, నిజాయితీ, సామూహిక జీవన విధానాన్ని కొనసాగించిన ఆదివాసీ సమాజానికి వందనం చేయాలని అన్నారు. అడవులు, కొండలు, వాగులు, జీవవైవిధ్యాన్ని సంరక్షిస్తూ తరతరాలుగా జీవించిన గిరిజన సమాజానికి దేశం రుణపడి ఉందన్నారు. అయితే గిరిజనుల భూమి హక్కులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, తాగునీరు, రవాణా వంటి అంశాల్లో ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఆదివాసి కుటుంబానికి చేరేలా ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాలని సూచించారు. గిరిజన భాషలు, జ్ఞాన సంపద, జీవన విధానం భారతదేశానికి అమూల్యమైన వారసత్వమని పేర్కొంటూ, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృభాషల పరిరక్షణ, గిరిజన భాషల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని దత్తాత్రేయ తెలిపారు. ప్రతి భాష ఒక సమాజపు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ గిరిజన సమాజాల అభ్యున్నతికి విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాలని అన్నారు. గిరిజన యువత తమ మాతృభాషపై గర్వపడుతూ ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. 'జల్, జంగల్, జమీన్' కోసం పోరాడిన గిరిజన వీరుల త్యాగాలను స్మరిస్తూ, వారి సంక్షేమం కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పాల్గొన్నారు.

# వైరా రోడ్డుపై 'నారాయణ' దర్జా

## అనుమతులు లేవు.. అడ్డూ అదుపూ లేదు

- కలెక్టరేట్ కూతవేటు దూరంలోనే అక్రమ బ్రాంచ్
- ఐఐటి, నీట్ పేరుతో లక్షల్లో ఫీజుల దోపిడీ
- కన్నెత్తి చూడని ఇంటర్మీడియట్ అధికారులు
- విద్యార్థుల భవిష్యత్తుతో కార్పొరేట్ చెలగాటం




**ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) :** నిబంధనలు ప్రభుత్వానికే కానీ.. మాకు కాదన్నట్లు వ్యవహరిస్తోంది 'నారాయణ' విద్యాసంస్థల యాజమాన్యం. కనీస అనుమతులు లేవు.. బోర్డు పెట్టడానికి గుర్తింపు లేదు.. అయినా ఖమ్మం నడిబొడ్డున దర్జాగా అడ్మిషన్ల దుకాణం తెరిచేసింది. 'మేము కార్పొరేట్ కింగ్స్.. మమ్మల్ని ఎవరూ ఏంచేయలేరు' అనే అహంకారంతో నిబంధనలను తుంగలో తొక్కి వెలుగుమట్ల (వైరా రోడ్డు) సమీపంలో అక్రమంగా బ్రాంచ్‌ను నడుపుతోంది.

### లక్షల్లో ఫీజులు.. కోట్లలో వ్యాపారం

కాలేజీకి ప్రభుత్వ గుర్తింపు లేదన్న విషయాన్ని దాచిపెట్టి, కార్పొరేట్ బ్రాండ్ ఇమేజ్‌ను వాడుకుంటూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్ లాంటి ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి లక్షలాది రూపాయల ఫీజులు గుంజుతున్నారు. అసలు అనుమతి లేని కాలేజీలో అడ్మిషన్లు ఎలా ఇస్తారు? రేపు విద్యార్థుల భవిష్యత్తుకు ఏమైనా గ్యారెంటీ ఉందా? అంటే యాజమాన్యం దగ్గర సమాధానం లేదు. కేవలం ధనార్జనే ధ్యేయంగా కోట్లాది రూపాయల దోపిడీ వ్యాపారానికి తెరలేపారు.

### అధికారుల మొద్దు నిద్ర

ఈ అక్రమ వ్యవహారమంతా జిల్లా కలెక్టరేట్‌కు, ఉన్నతాధికారుల కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే జరుగుతుండటం గమనార్హం. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నిత్యం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. రహదారి పక్కనే భారీ బిల్డింగ్, నారాయణ బోర్డు స్పష్టంగా కనిపిస్తున్నా ఆయనకు 'కంటిచూపు' ఆనకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే బ్రాంచ్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న సదరు అధికారి.. ఈ విద్యాసంవత్సరం యథేచ్ఛగా అడ్మిషన్లు సాగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

### కలెక్టర్ గారూ.. తక్షణమే జోక్యం చేసుకోండి

విద్యాసంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. తల్లిదండ్రులు మోసపోయి, విద్యార్థుల జీవితాలు నడిరోడ్డున పడకముందే జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించాలి. ఎలాంటి అనుమతులు లేని ఈ అక్రమ బ్రాంచ్‌ను తక్షణమే సీజ్ చేయాలని, విద్యార్థులను గుర్తింపు ఉన్న కాలేజీల్లో చేరేలా గైడెన్స్ ఇవ్వాలని జిల్లా ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసి ఏజెంట్లే వెన్నుముక

- యాఫీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్‌బి శ్రీనివాస చారి




**హయత్ నగర్, జూన్ 13 (జనం సాక్షి) :** జూన్ 17, 18, 2026 తేదీలలో భారత జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ 1964) 18వ సర్వసభ్య సమావేశం సందర్భంగా భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి విలేకరుల సమావేశంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ బి శ్రీనివాస చారి మాట్లాడుతూ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ -1964) తమ జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని 2026 జూన్ 17, 18 తేదీలలో హైదరాబాద్‌లోని నాగోల్, శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, జస్టిస్ లక్ష్మణ్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, పాలసీదారులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించడానికి దేశవ్యాప్తంగా ఉన్న 3000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

వేగంగా మారుతున్న బీమా రంగం, బీమా ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ రెండు రోజుల సమావేశం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. బీమా పరిశ్రమలో ప్రస్తుత పరిణామాలను సమీక్షించడం, సంస్థాగత విషయాలపై చర్చించడం, అలాగే ఏజెంట్ల వ్యవస్థను బలోపేతం చేయడం, పాలసీదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం వ్యూహాలను రూపొందించడం వంటి అంశాలపై కౌన్సిల్ దృష్టి సారిస్తుంది. ఏజెంట్ల సంక్షేమం, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి, బీమా సేవల్లో డిజిటల్ పరివర్తన, కస్టమర్ సేవా ప్రమాణాల పెంపు, దేశవ్యాప్తంగా బీమా వ్యాప్తిని పెంచే చర్యలకు సంబంధించిన అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారు. సంస్థాగత కార్యకలాపాలు, సభ్యత్వ వృద్ధి, ఏజెంట్లు, పాలసీదారులపై ప్రభావం చూపే అంశాలపై అధికారులకు సమర్పించిన వినతుల గురించి లియాఫీ 1964 సీనియర్ నాయకులు నివేదికలను సమర్పిస్తారు. ఫెడరేషన్ భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ సమావేశంలో కీలక తీర్మానాలు ఆమోదించబడతాయని భావిస్తున్నారు.

లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ప్రయోజనాలను పరిరక్షించడం, నైతిక బీమా విధానాలను ప్రోత్సహించడం, భారతదేశంలో బీమా రంగ వృద్ధికి తోడ్పడటం పట్ల లియాఫీ1964 కట్టుబడి ఉందని తెలియజేశారు. జనరల్ కౌన్సిల్ సమావేశం ముగిసిన తర్వాత, అందులో జరిగిన చర్చలు, ఆమోదించిన తీర్మానాలపై సమగ్ర వివరాలు మీడియాకు తెలియజేయబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లియోఫీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. ఎస్. మూర్తి, కోశాధికారి బి. శ్రీరామ్, రాజ్యాంగ కమిటీ చైర్మన్ బి. ఎన్. చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగరాపు శ్రీనివాస్, జి. బి. సమావేశం - పత్రికా, ప్రచార కమిటీ చైర్మన్ షేక్ షాజహాన్, కో చైర్మన్ కె పాపయ్య నాయుడు, సురేష్ బాబు, సభ్యులు జన్నపల్లి శ్రీనివాసరెడ్డి, గడ్డం సత్యనారాయణ, భాస్కర్, శ్రీధర్, నవనీత్, కరుణ, రజిత, సునీత, దాసయ్య, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ బోర్డు నిర్వహించాలి..
# కార్మికులకు న్యాయం చేయాలి

- 26 నెలలుగా మెడికల్ బోర్డు లేక వేలాది మంది ఇబ్బందులు
- కారుణ్య నియామకాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

**గోదావరిఖని, జూన్ 13 (జనంసాక్షి):** సింగరేణి కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహించి, మారుపేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. విఠల్‌నగర్ హనుమాన్ ఆలయం నుంచి ఆర్జీ-1 జీఎం కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కార్మిక నేత కౌశిక్ హరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా సుమారు 19 వేల మంది యువతకు ఉపాధి లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 26 నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో వేలాది మంది కార్మికులు నష్టపోతున్నారని విమర్శించారు. 24 నెలల సర్వీస్ నిబంధన కారణంగా కారుణ్య నియామకాలు అందక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల ఫిట్‌నెస్ నివేదికలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా పరిష్కారం కాని మారుపేర్ల సమస్యతో వందలాది మంది కార్మికుల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కారుణ్య నియామకాలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## గడిచిన వారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ 64 కేసులు నమోదు

- ఐదు లక్షల పైన జరిమానాలు విధింపు : ఇంచార్జ్ పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 13 జనం సాక్షి :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 1 వారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 64 నమోదు అయ్యాయని , 5,50,000/- సంబంధిత కోర్టులు జరిమానాలు విధించినట్లు ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర వెల్లడించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 1 వారంలో డ్రంకన్ డ్రైవ్ లో 64 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు , బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో హాజరు పర్చగా ఇందులో 9 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని,మిగిలిన వారికి 5,50,000/- జరిమానాలి విధించనైనది. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరుగుచున్నది, డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడును.మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు.మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడును. పైన తెలిపిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు.

## అర్హుల ఓట్లు పోవద్దు.. దొంగ ఓట్లు రావద్దు

- ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి
- ఇతర రాష్ట్రాల్లో భారీగా ఓట్ల తొలగింపులు జరిగాయని ఆరోపణ
- ఎస్ఐఆర్ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు
- ప్రతి ఓటు విలువైనదే: కేటీఆర్





**వేములవాడ, జూన్ 13 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త భాగస్వామి కావాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా, దొంగ ఓటు ఒక్కటి కూడా చేరకుండా చూసే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, బీహార్, తమిళనాడుల్లో లక్షల సంఖ్యలో ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితులు తలెత్తకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నాయకులకు తగిన గౌరవం లభించలేదని, ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ విజయవంతంగా నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించిన కేటీఆర్, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలు ఇప్పుడు హామీల అమలుపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌లో పదవుల విక్రయాలపై గతంలో ఆ పార్టీ నేతలే ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, దాని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జులు గూడూరు ప్రవీణ్, తుల ఉమా, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఖబర్దార్ నాగేందర్.. బహిరంగ చర్చకు సిద్ధమా?’

- సబితా ఇంద్రారెడ్డికి తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపణ
- అభివృద్ధి పనులపై ప్రజలకు సమాధానం చెప్పేందుకు సిద్ధమన్న యాదయ్య
- మూలమాడ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

**చేవెళ్ల, జూన్ 13 (జనంసాక్షి):** మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ తనపై చేసిన వ్యాఖ్యలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తీవ్రంగా ఖండించారు. శనివారం చేవెళ్లలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన రాజకీయ, ప్రజాసేవా ప్రస్థానంపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టానని, వంతెనలు, రహదారులు, మార్కెట్ కమిటీ కార్యాలయాలు, గోదాంల నిర్మాణం వంటి పనులు చేశానని పేర్కొన్నారు. తాను ఎప్పుడైనా అక్రమంగా డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. నాగేందర్ గౌడ్ గతంలో నిర్వహించిన పదవులు, ఆయన హయాంలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన చేసిన పనులపై కూడా ప్రజల ముందుకు రావాలని డిమాండ్ చేశారు. మూలమాడ గ్రామంలో జరిగిన ఘటనపై స్పందిస్తూ, బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో అక్కడికి వెళ్లానని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై నిష్పాక్షిక విచారణ జరిపి దోషులను గుర్తించాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. బాధితులపై నమోదు చేసిన కేసుల విషయంలోనూ సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. సబితా ఇంద్రారెడ్డిని తాను ఎక్కడా వ్యక్తిగతంగా విమర్శించలేదని, ఆమెకు తప్పుడు సమాచారం అందించి రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజల మధ్య అపోహలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. తాను 35 ఏళ్లుగా ప్రజా జీవితంలో చేసిన సేవలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, నాగేందర్ గౌడ్ కూడా తన రాజకీయ ప్రస్థానంపై ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసేది కమ్యూనిస్టులే

**సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



**కరీంనగర్ టౌన్, జూన్ 13, (జనం సాక్షి) :**
ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే రాజకీయ శక్తి కమ్యూనిస్టు పార్టీలేనని, దేశంలో పెరుగుతున్న మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు.శనివారం కరీంనగర్‌లోని ముకుంద్‌లాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి క్యాడర్ రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. శిక్షణ తరగతులకు జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పునూటి శ్రీనివాస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కంటే ముందుగానే దేశానికి స్వరాజ్యం రావాలని, బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేసిన శక్తి కమ్యూనిస్టు ఉద్యమమేనని తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలో కమ్యూనిస్టుల పాత్ర చెరగని ముద్ర వేసిందన్నారు.
దేశంలో మతం, కులం పేరుతో విద్వేషాలను పెంచుతున్నారని, భారత లౌకిక రాజ్యాంగాన్ని మత రాజ్యాంగంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడే బాధ్యత వామపక్షాలపై ఉందన్నారు.వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష ఐక్యతను మరింత బలోపేతం చేసి, ప్రత్యామ్నాయ ప్రజా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేసి, సంఘటిత ఉద్యమాలను నిర్మించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.జూన్ 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న జిల్లా క్యాడర్ రాజకీయ శిక్షణ తరగతుల్లో వివిధ అంశాలపై గిట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం శిక్షణ అందించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెలమారెడ్డి రాజిరెడ్డి, జి. రాజేశం, డి. నరేష్, కొప్పుల శంకర్, జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, రాయికంటి శ్రీనివాస్, కె. అరవింద్, కనకం దుర్గాప్రసాద్, పుల్లెల మల్లయ్య, పున్నం రవి, జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 123వ డివిజన్ హైదర్షాకోట్ శివగంగా కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 121వ డివిజన్ పరిధిలోని పద్మశ్రీ హిల్స్, తిరుమల గార్డెన్, నర్సారెడ్డి కాలనీ, పి అండ్ టి బ్లాక్, డాక్టర్ కాలనీలలో రూ.2.05 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, పిఏసిసి చైర్మన్ రాందాస్ ముదిరాజ్, సాగర్ గౌడ్, సురేష్ గౌడ్, అస్లంబిన్ అబ్దుల్లా, సుమన్, నదీమ్, రాజు యాదవ్, హఫీజ్ ఖాన్, ఆయా కాలనీల అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కాలయాపనతో రైతు భరోసా నిర్వీర్యం!

- మాటల్లో రైతు సంక్షేమం...చేతల్లో రైతు నిరాశ!!
- శాటిలైట్ రివ్యూలు, మాటలతో నెలల తరబడి నిరీక్షణ
- రెండు ఎకరాలకే పరిమితం చేసిన ప్రభుత్వం.. రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తి

**సిరికొండ, జూన్ 13 (జనం సాక్షి):** రైతులకు పెట్టుబడి సాయంగా అందాల్సిన రైతు భరోసా పథకం కాలయాపనతో నిర్వీర్యమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అండగా ఉంటామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా నిధుల విడుదల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. రైతుకు అవసరమైన సమయంలో అందాల్సిన ఆర్థిక సాయం ఆలస్యంగా రావడంతో పథకం అసలు ఉద్దేశమే దెబ్బతింటోందని అంటున్నారు. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడానికి భారీగా పెట్టుబడులు అవసరమవుతున్నాయి. అయితే రైతు భరోసా నిధులు అందకపోవడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ అప్పులు చేసి వ్యవసాయం సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఎరువుల కొరత, పెరిగిన సాగు ఖర్చులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తుండగా, రైతు భరోసా నిధుల జాప్యం మరింత భారంగా మారిందని రైతులు వాపోతున్నారు. రైతు ప్యాట్ల నర్సయ్య మాట్లాడుతూ, “గతంలో రైతు బంధు డబ్బులు ముందుగానే వచ్చేవి. ఆ డబ్బులతో పొలానికి సరిపడా 20-20-13, యూరియా బస్తాలు తెచ్చుకొనేవాళ్ళము ఇపుడు యూరియా కోసం కష్టాలు పడుతున్నాము. మరియు రైతు భరోసా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. బోనస్ ప్రకటనలు చేయడం కంటే రైతు ఖాతాల్లో నిధులు జమ చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. రైతుకు అవసరమైన సమయంలో అందే సాయమే నిజమైన భరోసా” అని అన్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగులో నిమగ్నమై ఉన్నందున రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, ఎకరాల పరిమితి లేకుండా అర్హులైన ప్రతి రైతుకు పథకం వర్తింపజేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. ప్రచారాలు, ప్రకటనల కంటే రైతుల కష్టాలను అర్థం చేసుకుని సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ బాధ్యత అని రైతులు స్పష్టం చేస్తున్నారు.

# అభివృద్ధి ఓర్వలేక కాంగ్రెస్‌పై నిందలు

- అధికారంలో ఉండి ఎమ్మెల్సీ, విప్‌గా ఉన్నప్పుడే కౌశిక్ రెడ్డి ఏం చేయలే
- ఉప ఎన్నికల్లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించలేదు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జూన్ 13 (జనం సాక్షి):**
ఉప ఎన్నికల తర్వాత హుజురాబాద్ అభివృద్ధికి ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించలేదని, ఇక్కడున్న కౌశిక్ రెడ్డి పిచ్చి లేసినట్టు ప్రవర్తిస్తునాడే తప్ప అభివృద్ధి గురించి ఏనాడు మాట్లాడలేదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం హుజురాబాద్ పట్టణంలో ప్రతాప సాయి గార్డెన్ లో సర్ పై బిఎల్ఏ లకు అవగాహన సదస్సు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అధ్యక్షతన ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్ పై జాగ్రత్తగా ఉండాలని, ఓటరు నమోదు జాబితా తొలగించే, జతచేర్చే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. హుజురాబాద్ ఇకపై కాంగ్రెస్ అడ్డా అని దానికి ఉదాహరణ హుజురాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగిరిందని,సర్పంచుల స్థానంలో మొదటి స్థానం,ఎంపీలో,ఎమ్మెల్సీ లో ముందు స్థానంలో ఉన్నామని ఇకపై హుజురాబాద్ లో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని,వడ్ల,మక్కల కొనుగోలుపై అబద్ధాలు చెప్పారని జమ్మికుంట మార్కెట్ లో సుమారు లక్ష క్వింటాళ్ల పై చిలుకు మక్కలు కొనుగోలు చేశామని,చివరి గింజ వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేశామని ఇది మా ప్రభుత్వ పనితీరు అని అన్నారు.కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఏం పని చేశాడో,ఎన్ని నిధులు తీసుకొచ్చావో చెప్పే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కనీసం ఉప ఎన్నికల్లో ఇచ్చిన పనులు,ప్రొసీడింగ్స్ కూడా పూర్తి చేయలేదని ఉప ఎన్నిక తర్వాత 2న్నర సంవత్సరాల్లో వారి ప్రభుత్వమే ఉంది అయిన వారు ఇక్కడ అభివృద్ధికి నిధులు మంజూరు చేపించలేదని,ఎమ్మెల్సీగా,విప్‌గా,ఎమ్మెల్యేగా హుజురాబాద్ అభివృద్ధికి తట్టెడు మట్టి కౌశిక్ రెడ్డి తీయలేదని మండిపడ్డారు.బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులను ఆదుకున్నామని 10 సంవత్సరంలో చేసిన రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒకే సంవత్సరంలో చేశామని అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్లు మాయం,నిధులు మాయం,అప్పుల కుప్పగా చేశారని 2 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతు సంక్షేమం,అభివృద్ధి కాంక్షించినదని అన్నారు.ఉనికి కాపాడుకోవడం కోసమే మాట్లాడుతున్నారు తప్ప ప్రజల్లో ప్రజాబలం బిఆర్ఎస్ కి లేదని అన్నారు.రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.రాజకీయాల కోసమే దళిత సోదరులను వాడుకున్నారని గత ప్రభుత్వం 2 ఏళ్లు అధికారంలో ఉన్నా ఎందుకు పూర్తి స్థాయిలో దళిత బంధు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.కౌశిక్ రెడ్డినీ ప్రజలు తిరస్కరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు.
- బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హుజూరాబాద్ కు ఎందుకు ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వలేదు?బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హరీష్ రావు ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో హుజూరాబాద్ కు ఎందుకు ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వలేదని ప్రశ్నించారు ప్రణవ్.కనీసం ఉప ఎన్నికల సమయంలో స్వయంగా హరీష్ రావు ఇచ్చిన ప్రొసీడింగ్స్ వెనక్కి మళ్ళాయనీ,ఆనాడు పదేళ్లు ఉండి చేయలేదు ఇప్పుడు గెలిపిస్తే చేస్తామని ప్రజలను మభ్యపెట్టే మాటలు మానుకోవాలని హరీష్ రావుకు సూచించారు. కౌశిక్ రెడ్డి మాయలో పడి హరీష్ రావు కూడా అబద్ధాలు మాట్లాడారని, హుజురాబాద్ ప్రజలు చైతన్యవంతులనీ అన్ని గమనిస్తున్నారని అన్నారు.

# టీజీఎస్ ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగం

- ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలతోనే తుది నిర్ణయం: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్



**కరీంనగర్ టౌన్, జూన్ 13, ( జనం సాక్షి) :**
టీజీఎస్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలనే ఉద్యోగులు, కార్మికుల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ తెలిపారు. కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన విలీన ప్రక్రియకు సంబంధించిన తాజా పురోగతిని వివరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏప్రిల్‌లో జరిగిన ఆర్టీసీ సమ్మె సమయంలో ఉద్యోగులు, కార్మికులు ప్రధానంగా ప్రస్తావించిన మూడు కీలక అంశాలైన 2021 వేతన సవరణ, కార్మిక సంఘాల పునరుద్ధరణ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సానుకూలంగా పరిశీలించిందన్నారు. అనంతరం విలీన అంశాన్ని ప్రత్యేకంగా క్యాబినెట్ సబ్ కమిటీ పరిధిలోకి తీసుకువచ్చి అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. విలీన ప్రక్రియను సమగ్రంగా అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ఇప్పటికే సమావేశమై విలీనానికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించిందని వెల్లడించారు. ఉద్యోగుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తు, ప్రభుత్వ ఆర్థిక బాధ్యతలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించే పనిలో కమిటీ నిమగ్నమై ఉందన్నారు.అదేవిధంగా సమ్మె కాలంలో మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ఆర్టీసీ ఈడీల కమిటీ కార్మిక సంఘాలతో చర్చలు కొనసాగిస్తోందని చెప్పారు. ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ లక్ష్యమని, విలీన ప్రక్రియలో ప్రతి కార్మికుడి స్వరం వినిపించేలా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో కార్మిక శాఖ పర్యవేక్షణలో పారదర్శకంగా యూనియన్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించను న్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజార్టీ సాధించిన కార్మిక సంఘాల ప్రతినిధులను విలీన ప్రక్రియలో ప్రత్యక్ష భాగస్వాములుగా చేర్చుతామని స్పష్టం చేశారు. వారి నుంచి వచ్చే సూచనలు, సలహాలను క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలనకు పంపించి అందరికీ ఆమోదయోగ్యంగా, పూర్తి పారదర్శకతతో తుది విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్న సోలమన్, ఎప్పటిలాగే విధులను అంకితభావంతో నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఉద్యోగులను కోరారు.ఈ పత్రికా సమావేశంలో రీజనల్ మేనేజర్ బి. రాజు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ టి. బాబు రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎస్. భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ గ్లోబల్ శక్తిగా ఎదుగుతోంది

- వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అనుగుణంగా మోడీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన
- మీడియా సమావేశంలో బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జూన్ 13 (జనంసాక్షి) :**
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ వేదికపై తన ప్రభావాన్ని మరింత పెంచుకుంటూ, గ్లోబల్ శక్తిగా ఎదుగుతుందని బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి అన్నారు. శనివారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి జిల్లా శాఖ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. 2047 నాటికి దేశాన్ని ‘వికసిత్ భారత్’గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తోందని తెలిపారు. ఆ దిశలోనే మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన కొనసాగిందన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్‌ను నిలబెట్టాలనే దృఢ సంకల్పంతో ప్రధాని మోదీ నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. స్వచ్ఛ భారత్ అభియాన్, జన్‌ధన్ యోజన, జీఎస్టీ, ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య నిర్మాణం, మెకిన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ , వందే భారత్ రైళ్లు, నేషనల్ హైవే ల నిర్మాణం లాంటి నిర్ణయాలు దేశ చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయన్నారు. ఈ నిర్ణయాలు దేశ పరిపాలనా వ్యవస్థలో, సామాజిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా మహిళలను స్వయం సమృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి మోడీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పంటల బీమా, ఎరువుల సబ్సిడీ వంటి పథకాల ద్వారా రైతులకు మోడీ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ఎరువుల సబ్సిడీ రూపంలో ప్రయోజనం అందుతోందని వివరించారు. మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రోగ్రాం మీడియా ఇన్చార్జి వికాస్ రావు.మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
14 జూన్ 2026

# జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

- అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు




**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** హైదరాబాద్ జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో అద్దె ఇంట్లో బంగ్లా జాతీయులు నివాసం ఉంటున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తించారు. ఇతర డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లోనూ బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు వీరిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిని మెదక్ జిల్లా జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. వీరిందరినీ తిరిగి వారి దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

- మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలకు చర్యలు



**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకు రావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# మ్యాగీ నూడిల్స్‌లో పురుగులు

- సోషల్ మీడియా వార్తలను ఖండించిన నెస్లే



**న్యూఢిల్లీ, జూన్13 (జనంసాక్షి) :** మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.

# పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

**విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ**

**సంగారెడ్డి, జూన్13 (జనంసాక్షి) :** పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధికారులుగా నటిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు సూచించారు.

# ఆదర్శ రైతు సాయినికి ఉత్తమ రైతు అవార్డు




**భద్రాద్రికొత్తగూడెం, జూన్13 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదర్శ రైతు సాయిని మధుసూదన్ రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ విశ్వవిద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సాయిని మధుసూదన్ రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే 'రైతులకు నేస్తం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేయనున్న కొత్త వంగడాలు, చిరుధాన్య పంటల సాగు విధానాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను తన పొలంలో అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

# బడి బస్సులు భద్రమేనా?

- 15న తెరుచుకోనున్న పాఠశాలలు
- స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన
- వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ



**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రిమార్కులు తెలియజేయాలి. ప్రమాదాలు జరగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

**తాళం పగులగొట్టి సోదాలు చేశారని టీఎంసీ ఆరోపణ**



**కోల్‌కతా, జూన్13 (జనంసాక్షి) :** తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు. భవానీపూర్‌లోని ఆయన నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి ఈడీ ఈ దాడులు జరిపినట్టు చెబుతున్నారు.

# విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

- భార్య సంగీత మళ్లీ కుటుంబంలోకి..!
- రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్



**చెన్నై, జూన్ 13 (జనంసాక్షి) :** తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీక్రి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక లండన్ నుంచి రాద నుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ – సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు– కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ – సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్ళి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ – సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.

# బిర్యానీ తిన్న వైద్య విద్యార్థులకు అస్వస్థత

- ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు గుర్తింపు



**గోదావరిఖని, జూన్ 13 (జనంసాక్షి) :** నగరంలోని సిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని నగరంలో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్) చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. అనంతరం సరదాగా 12 మంది కవిత థియేటర్ సమీపంలో ని ఓ హోటల్ లో విందు భోజనానికి వెళ్లి మండీ బిర్యానీ ఆరగించాచి తిరిగి ఎవరి రూమ్ లకు వారు వెళ్లి పోయారు. ఇందులో 12 మంది విద్యార్థులలో 11 మంది కి ఫుడ్ ఫాయిజన్ అయింది. దీంతో అందరికీ వాంతులు విరోచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని గోదావరిఖనికి లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే 8 మందికి తీవ్ర, ముగ్గురికి స్వల్పంగా అస్వస్థత కు లోనయినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం వారిని వైద్యుల సలహా మేరకు డిశ్చార్జ్ చేశారు. అయితే హోటళ్లలో నాణ్యతను పరిశీలంచాల్సిన అధికారులు ఇంత జరిగినా పత్తా లేకపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.



# శంషాబాద్ విమానాల దారి మళ్లింపు

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, ఢిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.




# ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో లింగనిర్ధారణ

- డెకాయ్ ఆపరేషన్‌లో గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** వనస్థలిపురంలో లింగ నిర్ధరణ పరీక్షల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హయగ్రీవ ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఈ విషయం బయట పడింది. తొలుత మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపించారు. లింగనిర్ధరణ పరీక్షల గురించి ఆరా తీయగా.. చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్, రిసెప్షనిస్ట్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమెను తుక్కుగూడ ల్యాబ్ టెక్నీషియన్ వద్దకు రిఫర్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీసాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్‌కు చేరుకున్న పోలీసులు.. అక్కడ లింగ నిర్ధరణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హయగ్రీవ ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజు, లోకేశ్, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

- స్థానికుల ఆందోళన.. కంపెనీ ముందు ధర్నా

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన కారు కిందే బాలుడు శివం పడిపోయాడు. తీవ్ర గాయాలయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కంపెనీ ఎదుట బైఠాయించి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. న్యాయం జరిగేలా చూస్తామంటూ పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370